సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 321

మంగళవారం 11-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



**వాహన అమ్మకాలు.. బే'కార్'!**

జనవరిలో 6% తగ్గిన విక్రయాలు. మందగమనం కారణం - బిజినెస్‌లో




**నేడు మూడో వన్డే**

మౌంట్ మాంగనీలో తలపడనున్న భారత్, న్యూజిలాండ్ - స్పోర్ట్స్‌లో

• ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీం...

## రాజ్యాంగబద్ధమే



ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం–2018 చట్టబద్ధతను సుప్రీంకోర్టు సమర్థించింది. ప్రాథమిక విచారణలో ఆరోపణలు నిరూపించలేకపోతే బెయిల్ మంజూరు చేయవచ్చని పేర్కొంది. ఎఫ్‌ఐఆర్ నమోదుకు ముందే ప్రాథమిక విచారణ అవసరం లేదని తెలిపింది. - 14లో

• మరికొన్ని గంటల్లో...

## ఢిల్లీ ఫలితం నేడే



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. నేడు జరిగే కౌంటింగ్ కోసం ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీకే మళ్లీ అధికారమన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల నేపథ్యంలో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. - 14లో

• కరోనా గుప్పిట చైనా...

## కకావికలం




చైనాలో కరోనా వైరస్‌వ్యాప్తి పెరిగిపోతోంది. ఇప్పటివరకూ ఈ వ్యాధి కారణంగా 908 మంది మరణించగా వైరస్ సోకినట్లు నిర్ధారణైన కేసుల సంఖ్య 40 వేలు మించింది. ఆదివారం ఒక్కరోజే చైనాలో 97 మంది మరణించారు. - 14లో

• సూర్యుడి ఫొటోల కోసం...

## నింగిలోకి ఆర్బిటర్



అంతరిక్ష చరిత్రలోనే తొలిసారిగా సూర్యుడి ధ్రువాల చిత్రాలను మనకు పంపేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ సంయుక్తంగా తయారు చేసిన సోలార్ ఆర్బిటర్ అంతరిక్ష నౌక సోమవారం నింగిలోకి దూసుకెళ్లింది. - 14లో

# ఆశలన్నీ భూమిపైనే..

## 2020-21 వార్షిక బడ్జెట్‌లో కీలకం కానున్న భూముల అమ్మకాల ప్రతిపాదన

**రూ. 25-50 వేల కోట్ల వరకు సమీకరణకు అవకాశం**

- వచ్చే ఏడాది కూడా వాస్తవిక రాబడులు రూ. లక్ష కోట్లు దాటని పరిస్థితి
- తగ్గిన కేంద్ర పన్నుల వాటా.... గత మూడేళ్ల రాబడుల అంచనాలూ ఇవే
- ఈసారి వార్షిక బడ్జెట్ రూ. 1.50 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా
- రుణమాఫీకి రూ. 18 వేల కోట్లు... ఇరిగేషన్‌కు రూ. 20 వేల కోట్లు



**సాక్షి, హైదరాబాద్:** ఆర్థిక మాంద్యం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్నుల రాబడులు, కేంద్ర పన్నుల వాటాలో తగ్గుదల నేపథ్యంలో ఈసారి రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు ఎలా ఉంటాయన్నది ఆసక్తి కలిగిస్తోంది. ఈ నెలలో ప్రవేశపెడతారని భావిస్తున్న 2020–21 వార్షిక బడ్జెట్ కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేయడంతో కచ్చితమైన ఖర్చులు, సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు అవసరమైన నిధులను ప్రతిపాదించాలంటే భూములపైనే ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎఫ్‌ఆర్‌బీఎం చట్టానికి లోబడి తీసుకొనే అప్పులకుతోడు బడ్జెట్‌లో భూముల అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు చేస్తుందన్న దానిపైనే వార్షిక బడ్జెట్ అంచనాలు ఆధారపడతాయనే చర్చ ఆర్థిక శాఖ వర్గాల్లో జరుగుతోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములతోపాటు అన్ని రకాల భూములపై వివరాల సేకరణను రెవెన్యూ శాఖ ముమ్మరం చేయడంతో భూముల అమ్మకాల విషయంలో ప్రభుత్వం అనుసరించబోయే విధానం చర్చనీయాంశం అవుతోంది.

**రాబడులు ఈసారీ అంతంత మాత్రమే...**

గత మూడేళ్ల వార్షిక రాబడులను పరిశీలిస్తే ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా ఆదాయం లేదని బడ్జెట్ లెక్కలు చెబుతున్నాయి. రాబడులకుతోడు అప్పులు కలిపినా బడ్జెట్ అంచనాల్లో 90 శాతం మేర నిధుల సమీకరణ జరగడం లేదు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 1.13 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా కేవలం రూ. 88,711 కోట్లు మాత్రమే వచ్చింది. దీనికి అదనంగా రూ. 26,738 కోట్లను ప్రభుత్వం అప్పుల రూపంలో సమకూర్చుకుంది. 2018–19 సంవత్సరానికిగాను రూ. 1.30 లక్షల కోట్ల ఆదాయ అంచనాకు రూ. 1.01 లక్షల కోట్లు మాత్రమే సమకూరింది. ఆ ఏడాది రూ. 26,949 కోట్లను అప్పుల రూపంలో తీసుకురాగా మొత్తం ప్రతిపాదిత వార్షిక బడ్జెట్‌లో 92 శాతం నిధులే వచ్చాయి. ఇక ఈ ఏడాది గణాంకాలను పరిశీలిస్తే రూ. 1.13 లక్షల కోట్ల అంచనాకుగాను మూడో త్రైమాసికం ముగిసిన డిసెంబర్ నాటికి రూ. 71,187 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. దీనికి అప్పులు రూ. 21,715 కోట్లను కలిపితే డిసెంబర్ వరకు రావాల్సిన నిధుల్లో 90.74 శాతం నిధులు మాత్రమే సమకూరాయి. ఇక చివరి త్రైమాసికం విషయానికి వస్తే 2017–18లో

మిగతా 2వ పేజీలో ▶



ఉత్తమ దర్శకుడు: బాంగ్ జూన్ హూ (పారసైట్)

**ఆస్కార్ ఉత్తమ చిత్రంగా**

# ఆంగ్లేతర సినిమా

### సత్తా చాటిన దక్షిణ కొరియా చిత్రం పారసైట్

### మొత్తం నాలుగు విభాగాల్లో అవార్డులు సొంతం

92 ఏళ్ల అకాడమీ అవార్డుల చరిత్రలో ఇదే తొలిసారి

ఆస్కార్ 2020

కొరియోత్సవం - ఫ్యామిలీలో



ఉత్తమ నటుడు: ఫీనిక్స్ (జోకర్)



ఉత్తమ నటి: రెనీజెల్ (జూడి)

## మెడికల్ టూరిజంలో 'ప్రైవేటు' వెనకబాటు

- రాష్ట్రంలో ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులు ఎప్పుడైనా వైద్య సదస్సులు పెడితే మెడికల్ టూరిజంలో తాము ఎంతో ఘనత సాధించినట్లు చెప్పుకొంటారు. హైదరాబాద్‌ను మెడికల్ హబ్ అని అభివర్ణిస్తుంటారు. కానీ కేంద్రం సోమవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం మన రాష్ట్రం 15వ స్థానంలో ఉంది. - 3లో

## మీ జాతీయత ఏమిటి..?

- దేశవ్యాప్తంగా జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) నవీకరణ, జనాభా గణన, గృహ ఆస్తుల వివరాల సేకరణ (హౌస్ లిస్టింగ్)కు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. - 5లో


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE · Vencobb CHICKEN

సూచించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్డు రిటైల్ ధర ₹ 60 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 65 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 126 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 87 కిలో | స్కిన్‌లెస్ | 144 కిలో |

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


# చెప్పిందే చేస్తున్నాం...

### ఆంగ్ల పత్రికల ప్రతినిధులతో ఇష్టాగోష్టిలో ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్



- ప్రజల ముందే లబ్ధిదారుల జాబితాలు
- భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఇంగ్లిష్ మీడియం తెస్తున్నాం
- విశాఖ మరో పదేళ్లకైనా హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పోటీ పడుతుంది
- ప్రజలకు మంచి చేయాలని లేనప్పుడు మండలి ఎందుకు?

**"సీఎం స్థానం అంటే రాష్ట్రానికి తండ్రి లాంటిది. దేవుడు మనకు ఈ స్థానం ఇచ్చినప్పుడు ఏ నిర్ణయమైనా తండ్రిలా ఆలోచించి తీసుకోవాలి. తగిన సమయంలో నిర్ణయాలు తీసుకోకపోవడం తప్పే అవుతుంది.**

**నామీద బురద చల్లడం ఇప్పడు మొదలు పెట్టింది కాదు. గతంలో మా పార్టీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను కొనుగోలు చేశారు. ఎన్నికల తర్వాత వారికి వచ్చింది 23 ఎమ్మెల్యే, 3 ఎంపీ సీట్లే. దేవుడు రాసిన గొప్ప స్క్రిప్టు ఇది.**

**సాక్షి, అమరావతి:** ఎన్నికల ముందు ప్రజలకు ఏం చెప్పామో అదే చేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏటా రెవెన్యూ ఎంతో కొంత పెరుగుతుందని, నంబర్లలో కాస్తా అటూ ఇటూ ఉండొచ్చు కానీ పెరుగుదలైతే

మిగతా 2వ పేజీలో ▶



# పాలనపై తీన్‌మార్క్

### పరిపాలనను కొత్త పుంతలు తొక్కించేందుకే ఇద్దరు అదనపు కలెక్టర్లు

### స్థానిక సంస్థలు, రెవెన్యూ వ్యవహారాల బాధ్యత అప్పగింత

### పూర్తిస్థాయి పర్యవేక్షణ కలెక్టర్లదే... నేడు కలెక్టర్లకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

### జాబ్‌చార్ట్ సహా 8 అంశాలపై చర్చ... కీలక ప్రగతి సూచికలపై సమీక్ష

**సాక్షి, హైదరాబాద్:** జిల్లాల పాలనలో కొత్త అధ్యాయానికి తెర లేచింది. పాలనా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం జిల్లా అధికారులకు పని విభజన చేసింది. ప్రస్తుతమున్న జిల్లా కలెక్టర్లకు చేదోడు వాదోడుగా ఉండటంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాలను పూర్తి చేసేందుకు అదనపు కలెక్టర్లను నియమించింది. ప్రస్తుత జాయింట్ కలెక్టర్ (జేసీ) పోస్టును రద్దు చేసి దాని స్థానే ఇద్దరు అడిషనల్ కలెక్టర్లను నియమించి వారికి వేర్వేరు బాధ్యతలను అప్పగించింది. ముఖ్యంగా కొత్తగా తేవాలనుకుంటున్న రెవెన్యూ చట్టంతోపాటు ఇప్పటికే అమల్లోకి వచ్చిన పంచాయతీరాజ్, పుర చట్టాలను సమర్థంగా అమలు చేయడమే ప్రధాన బాధ్యతగా ఈ పోస్టులను తెరపైకి తెచ్చింది. స్థానిక సంస్థలను గాడిన పెట్టడం, రెవెన్యూ వ్యవహారాలను కొలిక్కి తేవడమే ప్రాతిపదికగా కొత్త సారథులను రంగంలోకి దించింది. మొత్తంగా జిల్లా స్థాయిలో ఇకపై కలెక్టర్, ఇద్దరు అదనపు కలెక్టర్లతో 'తీన్‌మార్క్'పడనుంది.

**పల్లె, పట్టణాలకు పెద్దపీట...**

ప్రస్తుతం జేసీలుగా పనిచేస్తున్న వారు ఇక నుంచి అదనపు కలెక్టర్ (సాధారణ) బాధ్యతలు నిర్వహించనున్నారు. వారు రెవెన్యూ

మిగతా 2వ పేజీలో ▶

# సినిమాలో చూసి ఫైరింగ్



సదానందం భూమిలోకి కాల్పులు జరిపిన ప్రాంతం

**అక్కన్నపేట కాల్పుల్లో కొత్తకోణం**

- సదానందానికి ఆయుధాలంటే పిచ్చి
- ఆ పిచ్చితోనే ఠాణాలో చోరీ.. ఖాళీ తుపాకీతో సాధన
- గన్ అదృశ్యం దర్యాప్తుపై కానరాని స్పష్టత

**సాక్షి, హైదరాబాద్:** సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని అక్కన్నపేట కాల్పుల కేసులో కొత్త కోణాలు వెలుగుచూస్తున్నాయి. 2016లో హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి ఏకే–47 చోరీచేసిన సదానందం ఇంతకాలం ఎలా మెయింటైన్ చేశాడన్న విషయంపై పోలీసులు కూపీలాగుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సదానందం విపరీత, సున్నిత మనస్తత్వమున్నవాడు. ఆయుధాలన్నా, తుపాకులన్నా పిచ్చి. ఈ పిచ్చే ఠాణాలో తుపాకులు చోరీచేసే వరకూ తీసుకెళ్లింది. వీటిని దొంగిలించాక ఇంట్లోనే దాచి, ఎవరూలేని సమయంలో చూసుకుని మురిసిపోయేవాడు. సినిమాలు, యూట్యూబ్‌లు చూసి ఏకే–47 ఎలా ఫైర్ చేయాలో తెలుసుకున్నాడు. బుల్లెట్లు, ట్రిగ్గర్ పాడవకుండా కొబ్బరి నూనెతో తుడిచేవాడు. బుల్లెట్లు లేకుండా ఏకే–47 ట్రిగ్గర్ నొక్కుతూ మురిసిపోయేవాడు. ఇలా ఏకే–47 ఫైర్ చేయడం నేర్చుకున్నాడు.

**వెలుగులోకి వచ్చింది ఇలా...**

ఏకే–47 ఆయుధాన్ని తెలంగాణలో జిల్లాల

మిగతా 2వ పేజీలో ▶

## ఇదం జగత్



రోజూ తాగి దాని పుణ్యమా అని ఇంటికి క్షేమంగా చేరుతున్నారట!

# కూరగాయల కత్తితో గొంతు కోసి..

## ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య • కరీంనగర్ నడిబొడ్డున ఘాతుకం

- గతంలో వీరింట్లో అద్దెకు ఉన్న ఓ యువకుడి పనే!
- ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు
- ఇరువురూ స్నేహంగా మెలిగేవారని అనుమానం!
- 24 గంటల్లో నిందితుడిని పట్టుకుంటామన్న సీపీ కమలాసన్‌రెడ్డి

**సాక్షి ప్రతినిధి, కరీంనగర్:** కరీంనగర్ నడిబొడ్డున దారుణం చోటు చేసుకుంది. ఓ ఇంటర్ విద్యార్థినిని గుర్తుతెలియని ఆగంతకుడు గొంతుకోసి హతమార్చాడు. గతంలో స్నేహంగా మెలిగిన యువకుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కరీంనగర్‌లోని విద్యానగర్ పద్మావతి ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో నివసించే ముత్త కొమురయ్య–ఓదెమ్మ దంపతులకు కూతురు రాధిక(19), కుమారుడు వేణు ఉన్నారు. వేణు హైదరాబాద్‌లో ఎంసీఏ చదువుతుండగా, రాధిక కరీంనగర్‌లోని సహస్ర జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఓదెమ్మ భవన నిర్మాణ కూలీగా, కొమురయ్య గోడౌన్‌లో కూలీగా పనిచేస్తున్నారు. రోజు లాగే తల్లిదండ్రులు ఇద్దరు సోమవారం ఉదయం కూలీ పనులకు వెళ్లగా.. ఇంట్లో రాధిక చదువుకుంటోంది. ఈ సమయంలో ఆగంతకుడు ఇంటికి వచ్చి కూరగాయల కత్తితోనే విద్యార్థిని గొంతుకోసి పరారయ్యాడు.

**బాలుడు చూసి చెప్పడంతో..**

వీరి ఇంటి ముందు నివసించే ఓ తొమ్మిదేళ్ల బాలుడు మనోజ్ సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఆడుకొనేందుకు రాధిక ఇంటికి రాగా, ఆమె అప్పటికే రక్తపు మడుగులో పడిఉంది. భయపడిన మనోజ్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూశారు. అప్పటికే రాధిక మృతి చెందడంతో పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. 'పోలియో బారిన పడ్డ కూతురికి లక్షల రూపాయలతో చికిత్స చేయించి ప్రాణానికి ప్రాణంగా చూసుకున్నాం. నా బిడ్డను ఎవడు ఎందుకు చంపాడో తెలియదు'అని రాధిక తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలిసిన వెంటనే అదనపు డీసీపీలు శ్రీనివాస్, చంద్రమోహన్ సంఘటనా స్థలానికి వచ్చి ఘటనపై ఆరా తీశారు. రాధికను హతమార్చిన ఆగంతకుడు ఆధారాలు లేకుండా రక్తపు మరకలను తుడిచి వేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు రాధిక నివాసంలో తనిఖీలు చేశారు. పోలీసు జాగిలాలు కి.మీ. దూరం వరకు వెళ్లి ఆగిపోయాయి. 24 గంటల్లో నిందితుడిని అరెస్టు చేస్తామని పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు.

**తెలిసినవారి పనే!**

రాధిక ఇంట్లో రెండేళ్ల కింద ఓ యువకుడు అద్దెకు ఉండేవాడు. అతడే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇంటి చుట్టూ కాంపౌండ్ గోడ ఉండటం, కొత్త వారు ఇంట్లోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో తెలిసిన వారే ఈ హత్య చేసి ఉంటారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.



రాధిక (ఫైల్)

**పాత పరిచయంతోనే..**

ఆ యువకుడు తన కూతురితో స్నేహంగా ఉండటం నచ్చకపోవడంతో రాధిక తల్లిదండ్రులు అతడిని

మిగతా 2వ పేజీలో ▶

## రాష్ట్రంలో 148 ప్యాక్స్ ఏకగ్రీవం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో 148 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) ఏకగ్రీవమయ్యాయి. వీటిలో దాదాపు అన్ని డైరెక్టర్ పోస్టులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇతర ప్యాక్స్‌ల్లో మరో 3,224 డైరెక్టర్ పోస్టులు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ సోమవారం ప్రకటించింది. ఆదిలాబాద్‌లో 11, మంచిర్యాల 6, నిర్మల్ 1, కుమ్రం భీం ఆసిఫాబాద్ 3, జగిత్యాల 5, కరీంనగర్ 1, పెద్దపల్లి 3, రాజన్న సిరిసిల్ల 3, ఖమ్మం 34, భద్రాద్రి కొత్తగూడెం 2, మహబూబ్‌నగర్ 2, నాగర్‌కర్నూల్ 1, వనపర్తి 1, నారాయణ్‌పేట్ 1, మెదక్ 5, సిద్దిపేట 1, నల్లగొండ 3, సూర్యాపేట 10, కామారెడ్డి 12, నిజామాబాద్ 26, రంగారెడ్డి 1, వికారాబాద్ 3, వరంగల్ అర్బన్, జనగాం, భూపాలపల్లి జిల్లాల్లో 3 చొప్పున మహబూబాబాద్ 2, ములుగు 2 ప్యాక్స్‌లు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 904 ప్యాక్స్‌ల్లోని 11,653 డైరెక్టర్ పోస్టులకు ఎన్నికలు జరుగుతుండగా, మొత్తం 34,109 నామినేషన్లొచ్చాయి. 5,849 డైరెక్టర్ పోస్టులకు 13,642 మంది పోటీ పడుతున్నారు. ఇందులో సోమవారం 13,925 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. వీటికి 15న ఎన్నిక జరగనుంది.

## సీఎం పుట్టినరోజు మొక్కలు నాటుదాం

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17న పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.


కేటీఆర్

దేశంలో ఎక్కడా లేని విధంగా పచ్చదనాన్ని పెంచేందుకు రాష్ట్రంలో హరితహారం చేపట్టడం ద్వారా కేసీఆర్ మొక్కల పట్ల తన ఇష్టాన్ని చాటుకున్నారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు జిల్లా కలెక్టర్లు కూడా చొరవ చూపాలని ఆయన కోరారు.

## హైదరాబాద్‌లో నేడు సేఫ్టీ క్లబ్‌లు ప్రారంభం

**సాక్షి, హైదరాబాద్:** విద్యార్థినులు, మహిళల భద్రతకు స్వచ్ఛందంగా సేవలందించేందుకు కాలేజీల్లో విద్యార్థినులు సభ్యులుగా సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినుల భద్రతకోసం డయల్ 100, హాక్–ఐ, షీ–టీమ్‌లను ప్రవేశపెట్టిన పోలీస్ శాఖ.. ఈ విషయంలో మరో వినూత్న విధానాన్ని ప్రవేశ పెట్టనుంది. తొలిదశలో నగరంలోని ఐదు కాలేజీల్లో ఈ క్లబ్బులను ప్రారంభిస్తున్నట్లు విమెన్ సేఫ్టీవింగ్ ఐజీ స్వాతిలక్రా వెల్లడించారు. ఈ సేఫ్టీ క్లబ్‌లను ముందుగా సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌వీఐటీ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని బ్రిటిష్ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ ప్రారంభిస్తారని ఆమె తెలిపారు.

## 'ఫీవర్'లో మరో కరోనా అనుమానిత కేసు

**హైదరాబాద్:** నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో సోమవారం ఓ కరోనా అనుమానిత కేసు నమోదైంది. ఇటీవల చైనా పర్యటనకు వెళ్లి వచ్చిన సూర్యాపేట మేళ్ల చెరువుకు చెందిన ఓ విద్యార్థి(21) జలుబు, దగ్గుతో అస్వస్థతకు గురయ్యాడు.



కరోనా వైరస్ కారణంగా చైనాలో చాలా మంది మృత్యువాత పడుతున్నారని తెలుసుకున్న ఆ విద్యార్థి కుటుంబ సభ్యులు భయంతో పరీక్షల కోసం కుమారుడిని ఫీవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని నుంచి శాంపిల్ సేకరించి కరోనా నిర్ధారణ పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి పంపించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

## గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తా: జగ్గారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** సంగారెడ్డి నియోజకవర్గంలో 130 అడుగుల గాంధీ విగ్రహాన్ని కచ్చితంగా ఏర్పాటు చేస్తానని, ఇందుకు ఇప్పటికే హరియాణాకు చెందిన యూనివర్సల్ ఇండియా అనే విగ్రహాల తయారీ కంపెనీని సంప్రదించానని కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి తెలిపారు.



విగ్రహ ఏర్పాటు కోసం ఐదెకరాల స్థలాన్ని సేకరిస్తున్నామని, ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసి త్వరలోనే టీపీసీసీ రాష్ట్ర నాయకత్వంతో భూమి పూజ చేయిస్తానని సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు.


సోమవారం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గవర్నర్ తమిళిసై

# వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరం

**విద్యార్థులకు సూచించిన గవర్నర్ తమిళిసై**

**హైదరాబాద్:** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తవని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఆహారం తీసుకునే ముందు, తిన్న తర్వాత చేతులను కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. మార్కెట్‌లో కొనే పండ్లను సైతం కడిగిన తర్వాత మాత్రమే తినాలని తెలిపారు. పరిశుభ్రత విషయంలో పాటించాల్సిన అంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. దానికి వారు చెప్పిన సమాధానాలపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు బుక్స్, పెన్సిళ్లను బహుమతిగా అందజేశారు. పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం గవర్నర్ రూ.1.50 లక్షలను విరాళంగా అందజేశారు.

**తమిళ పాటకు ఫిదా..**

'ఓడి విలయాడు పాపా'అంటూ విద్యార్థులు ఆలపించిన తమిళ గీతానికి గవర్నర్ ఫిదా అయ్యారు. పాఠశాలలోని సంగీత ఉపాధ్యాయుడు వెంకట రమణారెడ్డి సమకూర్చిన బాణీలతో విద్యార్థులు ఈ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో గవర్నర్ సెక్రటరీ సురేంద్ర మోహన్, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకట నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

**గవర్నర్‌ను కలిసిన శాసనసభ స్పీకర్..**

సాక్షి, హైదరాబాద్: శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# చెప్పిందే చేస్తున్నాం..

▶ మొదటి పేజీ తరువాయి

ఉంటుందన్నారు. ఆంగ్ల పత్రికల ప్రతినిధులతో సోమవారం ఆయన ఇష్టాగోష్టి నిర్వహించారు. పెన్షన్లు, ఇంగిష్ మీడియం, రాజధాని, ప్రత్యేక హోదా, మండలి రద్దు, పోలవరం, కియాపై అసత్య ప్రచారం తదితర అంశాలపై ప్రభుత్వ ఉద్దేశాలు, లక్ష్యాలను ఈ సందర్భంగా ఆయన స్పష్టీకరించారు. ఈ సందర్భంగా సీఎం ఇంకా ఏమన్నారంటే..

**సంతృప్త స్థాయిలో లబ్ధి కల్పించాలన్నదే లక్ష్యం**

'మాకు ఓటు వేయని వారికి కూడా పెన్షన్లు ఇవ్వండని చెప్పాం. సామాజిక తనిఖీ కోసం లబ్ధిదారుల జాబితా ప్రజల ముందే ఉంచుతున్నాం. ఈ రోజు ఫోన్ ఆన్ చేస్తే కమ్యూనికేషన్ అంతా ఇంగ్లిషే. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకొస్తున్నాం. రాజధానిపై నేను చెప్పాల్సిందంతా అసెంబ్లీలోనే చెప్పా. మౌలిక వసతుల కోసమే రూ.1,09,000 కోట్లు అవుతుందని గత ప్రభుత్వం అంచనా వేసింది. ఆ డబ్బులో 10వ వంతు విశాఖపట్నంలో పెడితే కచ్చితంగా మార్పు వస్తుంది. మరో 10 ఏళ్లకైనా హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పోటీ పడుతుంది. అందుకే విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా మారుస్తాం. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తాం. అమరావతిని లెజిస్లేచర్ క్యాపిటల్‌గా కొనసాగిస్తామని, అమరావతి రైతులెవ్వరికీ అన్యాయం చేయం అని చెప్పాం. రాజధానిపై బీజేపీ జాతీయ స్థాయి ప్రతినిధులు ఉన్న విషయాలు చెబుతుంటే, రాష్ట్రంలోని ఆ పార్టీ నాయకులు దీనికి భిన్నంగా మాట్లాడుతున్నారు.

**కొద్ది జాప్యమే.. అడ్డుకోలేరు**

రాజధాని కార్యకలాపాల వికేంద్రీకరణకు అసెంబ్లీలో బిల్లులు పెట్టాల్సిన అవసరంలేదు. సీఆర్‌డీఏని ఏఎంఆర్‌డీఏగా మార్చడానికే బిల్లు పెడితే సరిపోతుంది. కానీ రాష్ట్రంలో అందరికీ మంచి చేస్తున్నామని ఒక సంకేతం ఇవ్వడానికే ఈ బిల్లులు పెట్టాం. 3 నెలలు ఆలస్యం చేయగలరు తప్ప.. ఎవరూ అడ్డుకోలేరు. ప్రజలకు మంచి చేయాలని లేనప్పుడు మండలి ఎందుకు? రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలన్న మా ప్రయత్నాలు ఎప్పటికీ కొనసాగుతాయి. తాము ఎక్కడికీ వెళ్లడం లేదని కియా వరుసగా ఖండనలు ఇస్తున్నా వాళ్లు వాస్తవాలు పట్టించుకోవడంలేదు. రాజకీయాల కోసం వ్యవస్థలను మేనేజ్ చేసి ఏ స్థాయికైనా దిగజారే పరిస్థితి చూస్తున్నాం. పరిశ్రమలకు రాయితీల రూపంలో చెల్లించాల్సిన రూ.4 వేల కోట్లను గత ప్రభుత్వం 2014 నుంచి చెల్లించలేదు. ఈ రాయితీలు ఇవ్వకుండా చంద్రబాబు దావోస్ వెళ్లారు.

**ఇది అభివృద్ధి కాదా?**

విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, నీటిపారుదల, గృహ నిర్మాణాన్ని ప్రభుత్వ ప్రాధాన్యతలుగా నిర్ణయించాం. నాడు– నేడు కార్యక్రమం ద్వారా స్కూళ్లు, ఆసుపత్రులను బాగా అభివృద్ధి చేస్తున్నాం. మధ్యాహ్న భోజనం నాణ్యత బాగా పెంచాం. అమ్మఒడి అమలు చేశాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా ఇస్తున్నాం. ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. రైతు భరోసాతో అన్నదాతలను ఆదుకుంటున్నాం. పేదలకు 25 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును 2021 నాటికి పూర్తి చేస్తాం' అని సీఎం వైఎస్ జగన్ వివరించారు.

# కూరగాయల కత్తితో గొంతు కోసి..

▶ మొదటి పేజీ తరువాయి

ఇల్లు ఖాళీ చేయించారు. పాత పరిచయంతో ఆ యువకుడు తరచూ రాధికతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పాత పరిచయంతోనే సోమవారం ఆ యువకుడే ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి వచ్చి హతమార్చి ఉంటాడని భావిస్తున్నారు. రాధిక కాల్‌డేటా, చుట్టుపక్కల వాళ్లు ఇచ్చిన సమాచారం మేరకు ఆ యువకుడే హత్య చేసినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. మరింత స్పష్టత కోసం సీసీటీవీ ఫుటేజీలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. పైగా, ఇది తెలిసిన వారి పనేనని కరీంనగర్ పోలీస్ కమిషనర్ బీవీ.కమలాసన్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. నిందితుడిని పట్టుకునేందుకు ఎనిమిది బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**పరామర్శించిన మంత్రి గంగుల**

రాధిక హత్య విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డీసీపీలు చంద్రమోహన్, శ్రీనివాస్‌ను ఆదేశించారు. పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రాధిక కుటుంబానికి రూ.25 వేలు తక్షణ సాయంగా అందజేశారు.

# సినిమాలో చూసి ఫైరింగ్

▶ మొదటి పేజీ తరువాయి

పునర్విభజనకు ముందే చోరీ చేశాడు. తన పాత కేసుల క్రమంలో తరచూ హుస్నాబాద్ స్టేషన్‌కి వెళ్లివచ్చే సదానందం దృష్టిని అక్కడి ఆయుధాలు ఆకర్షించాయి. ఏకే–47, కార్బైన్‌లను చోరీ చేశాడు. ఆయుధాల చోరీ విషయాన్ని పోలీసులు దాచిపెట్టడంతో చాలాకాలం ఇది వెలుగులోకి రాలేదు. గతంలో హుస్నాబాద్ జిల్లా ఉమ్మడి కరీంనగర్ పరిధిలో ఉండేది. 2016, అక్టోబర్‌లో జిల్లాల పునర్విభజన అనంతరం డిసెంబర్‌లో సిద్దిపేట జిల్లాలోని పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వెళ్లిపోయింది. అదే ఏడాది డిసెంబర్‌లో ఆయుధాలను కమిషనరేట్‌కి లెక్కచూపే క్రమంలో ఏకే–47 మిస్సింగ్ విషయం వెలుగుచూసింది. దీంతో అప్పటి సీఐ గన్‌మెన్‌పై కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అక్కన్నపేట కాల్పుల తరువాతే 9ఎంఎం కార్బన్‌గన్ కూడా పోయిన విషయం వెల్లడికావడం గమనార్హం.

**తుపాకీ పోగొట్టుకుంటే..?**

పోలీసుల తుపాకులు కనిపించకుండా పోతే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వెంటనే రాష్ట్ర పోలీసులు ఈ సందేశాన్ని రేడియో ద్వారా ఇండియాలోని అన్ని స్టేషన్‌లకు పంపుతారు. ఈ విషయంలో స్థానిక ఎస్పీ లేదా కమిషనర్ ఒక డీఎస్పీ స్థాయి అధికారిని విచారణాధికారిగా నియమిస్తారు. సదరు అధికారి ఆయుధం ఎలాంటి పరిస్థితుల్లో పోయిందో దర్యాప్తు చేస్తారు. నిర్లక్ష్యం వహించినట్లు తేలితే వెంటనే కేసు నమోదు చేసి, సస్పెండ్ చేస్తారు. అంతేగాకుండా ఈ విషయాన్ని తరువాత లిఖిత పూర్వకంగా కేంద్రహోంశాఖతోపాటు రాష్ట్రం, దేశంలోని అన్ని పోలీస్ ఠాణాలకు పంపుతారు. కాగా, గతంలో హుస్నాబాద్ ఠాణాలో పనిచేసిన సీఐ భూమయ్య, సీఐ శ్రీనివాస్‌ల హయాంలో ఈ ఆయుధాలు మాయమయ్యాయన్న విషయంలో స్పష్టత కరువైంది. అలాగే కార్బన్ వెపన్ మిస్సింగ్ విషయంలోనూ ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. స్టేషన్ నుంచి 25 రౌండ్ల బుల్లెట్లతో ఉన్న ఏకే–47 వెపన్‌ను ఎత్తుకెళితే ఎందుకు గుర్తించలేకపోయారు. స్టేషన్‌లో సీసీ కెమెరాలు లేవా? సంబంధిత గన్‌మెన్ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఎందుకు చెప్పలేదు? అంతటి మారణాయుధం పోయినా.. తూతూ మంత్రంగా దర్యాప్తు జరపడం ఏంటి? ఇలాంటి అనేక ప్రశ్నలకు పోలీసుల నుంచి సమాధానం లేదు.

**వారంలో రెండు కాల్పుల ఘటనలు..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒకే వారంలో రెండు కాల్పుల ఘటనలు ప్రజలను ఉలిక్కిపడేలా చేశాయి. ఫిబ్రవరి 1న జగిత్యాల సమీపంలోని గొల్లపల్లి మండలం ఎస్రాజ్‌పల్లిలో శ్రీనివాస్ (మాజీ మావోయిస్టు) తుపాకీతో హల్‌చల్ చేశాడు. భార్య కాపురానికి రావడం లేదన్న కారణంతో అత్తగారింటిపై దాడి చేసి, అడ్డుకున్న రాజిరెడ్డిపై రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. అతని పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ఫిబ్రవరి 6న అక్కన్నపేటలో సదానందం కాల్పులు జరపడం కలకలం రేపింది.

# పాలనపై తీన్‌మార్క్

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవహారాలతో పాటు పౌర సరఫరాలు, కొనుగోళ్ల కమిటీ, భూసేకరణ అంశాలను పర్యవేక్షిస్తారు. ఈ పోస్టుకుతోడు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పదవిని ప్రభుత్వం సృష్టించింది. పంచాయతీరాజ్, పురపాలనను వీరి పరిధిలోకి తేనుంది. దీంతో పట్టణ, పంచాయతీల్లో పాలనను పారదర్శకంగా, అవినీతిరహితంగా మలచాలని భావిస్తోంది. ఇప్పటివరకు మున్సిపాలిటీలపై కలెక్టర్లకు అధికారాలుండేవి కావు. యాజమాయిషీ అంతా పురపాలక శాఖ డైరెక్టర్‌దే ఉండేది. సిఫారసుకు మాత్రమే పరిమితం కావాల్సిన పరిస్థితి ఉండేది. మనుగడలోకి వచ్చిన కొత్త పురచట్టంలో ఈ లోటు ను అధిగమించేలా సర్కారు సంస్కరణలు చేపట్టిం ది. పురపాలికలనూ కలెక్టర్ల పరిధిలోకి తెచ్చి వారికి సంపూర్ణ అధికారాలు కట్ట బెట్టింది. ఈ క్రమంలోనే మరో అడుగు ముందుకు వేసింది. పురపాలన పర్యవేక్షణకు ఏకంగా అదనపు కలెక్టర్లను నియమించి పరిపాలనలో సంస్కరణలకు కొత్త బీజం వేసింది. అదనపు కలెక్టర్‌ను మున్సిపల్ వ్యవహారాలకే పరిమితం చేయకుండా పంచాయతీరాజ్ పగ్గాలనూ అప్పగించనుంది. తద్వారా స్థానిక సంస్థలపై పట్టుబిగించేలా జిల్లా పాలనలో కీలక సంస్కరణ తీసుకొచ్చింది. పల్లె ప్రగతి కార్యక్రమాల పర్యవేక్షణ, హరితహారం, నర్సరీల నిర్వహణ వ్యవహారాలను వారు పర్యవేక్షించాల్సి ఉంటుంది. పురపాలనలో పట్టణ ప్రగతి, లే అవుట్ల మంజూరు, భవనాలకు అనుమతులిచ్చే కమిటీలో వారే ప్రధాన పాత్ర పోషించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**నాడు ఏజేసీ.. నేడు జేసీ పోస్టుకు మంగళం**

గతంలో రంగారెడ్డి జిల్లా మినహా అన్ని జిల్లాల్లో అడిషనల్ జాయింట్ కలెక్టర్ (ఏజేసీ) పోస్టు ఉండేది. ఏజేసీకి కూడా కొన్ని శాఖలను కేటాయించడం ద్వారా పని విభజన చేశారు. రంగారెడ్డి జిల్లాకు మాత్రం ఇద్దరు జేసీలు ఉండేవారు. వారికి జిల్లాలోని మండలాలను దాదాపు చెరిసగం పంచారు. అలాగే సంక్షేమం, పౌర సరఫరాలు తదితర శాఖలతో సర్దుబాటు చేశారు. అయితే విధానపరమైన నిర్ణయాల్లో అంతిమ నిర్ణయం మాత్రం కలెక్టర్‌కే ఉండేది. 2016లో జిల్లాల పునర్విభజన అనంతరం ఏజేసీ పోస్టులు సహా రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్–2 పోస్టును కూడా రద్దు చేసి ఒకరితోనే సరిపెట్టారు. తాజాగా అన్ని జిల్లాల్లో జేసీ పోస్టును ఎత్తేసి ఇద్దరేసి అదనపు కలెక్టర్లను నియమించడం ద్వారా పాలనను కొత్త పుంతలు తొక్కించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ శాఖను సంస్కరించాలని భావిస్తున్న సీఎం.. మరిన్ని కొత్త నిర్ణయాలు, పాలనాపరమైన అధికార వికేంద్రీకరణ జరిపే అవకాశం లేకపోలేదు. మరిన్ని అధికార కేంద్రాలను సృష్టించే ఆస్కారమూ లేకపోలేదనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. అయితే రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాలని కేసీఆర్ భావిస్తున్నారని, అందులో భాగంగానే జిల్లా పాలనా కేంద్రాల్లో మార్పులు జరిగి కొత్త పోస్టును సృష్టించారనే ప్రచారాన్ని ప్రభుత్వ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. ప్రజల దైనందిన వ్యవహారాల్లో కీలకమైన రెవెన్యూ వ్యవస్థను పకడ్బందీగా నడిపించే బాధ్యతను అదనపు కలెక్టర్లు చూస్తారని, మిగతా రెవెన్యూ శాఖ స్వరూపంలో ఎలాంటి మార్పులూ ఉండకపోవచ్చని తెలుస్తోంది. గ్రామస్థాయి పోస్టుల్లో కొన్నింటిని మార్చడంతోపాటు భూ రికార్డుల సవరణలు, రిజిస్ట్రేషన్ చట్టాల అమలు బాధ్యతలను ఆర్డీవో, ఆపై స్థాయి అధికారులకు కట్టబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**నేడు కలెక్టర్ల సదస్సులో దిశానిర్దేశం**

జిల్లా కలెక్టర్లతోపాటు కొత్తగా నియమితులైన అదనపు కలెక్టర్లకు సీఎం కేసీఆర్ మంగళవారం ప్రగతి భవన్‌లో జరగనున్న కలెక్టర్ల సదస్సులో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి మొత్తం 8 అంశాలతో ఎజెండా తయారు చేశారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో కలెక్టర్ల పాత్ర, ప్రక్షాళన చేసిన భూ రికార్డుల ఫ్రీజింగ్, అదనపు కలెక్టర్ల జాబ్‌చార్ట్, కీలక ప్రగతి సూచికలు, మత్స్య సంపద, మాంస ఉత్పత్తుల పెంపుపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మానవాభివృద్ధి సూచికలపై సీఎం కేసీఆర్ ఫోకస్ చేయనున్నారని, ఈ విషయంలోనే జిల్లా అధికారులు చేపట్టాల్సిన కీలక చర్యల గురించి వివరిస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# ఆశలన్నీ భూమిపైనే..

▶ మొదటి పేజీ తరువాయి

చివరి మూడు నెలల ఆదాయం రూ. 29 వేల కోట్లు రాగా 2018–19లో రూ. 33,500 కోట్ల వరకు వచ్చింది. ఇక ఈ ఏడాది ఇప్పటికే అంచనాలో 63 శాతం మేరకు ఆదాయం వచ్చింది. చివరి మూడు నెలల్లో పన్నుల రూపంలో రూ. 20 వేల కోట్లు, అప్పుల రూపంలో మరో రూ. 10 వేల కోట్లు... వెరసి రూ. 30 వేల కోట్ల వరకు నిధులు సమకూరుతాయని ఆర్థిక శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ మూడేళ్ల రాబడులు, అప్పులను అంచనా వేస్తే వచ్చే ఏడాది కూడా రాబడులు (అప్పలు కాకుండా) రూ. లక్ష కోట్లు దాటే పరిస్థితులు కనిపించడం లేదు. ఆర్థిక మాంద్యం ప్రభావం మరో ఆరునెలల పాటు కొనసాగుతుందన్న అంచనాల నేపథ్యంలో కేంద్ర పన్నుల వాటాలో తగ్గుదలతో 2020–21 సంవత్సరానికి కూడా రాబడులు అంతంత మాత్రమేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. కరోనా వైరస్ ప్రభావంతో తయారీ, ఫార్మా రంగాల్లో వినియోగించే చైనా ఉత్పత్తులు తగ్గిపోతే వచ్చే ఏడాది పన్నులకు నష్టం వాటిల్లుతుందనే అంచనాలు కూడా ఉన్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయంలో స్థిరత్వం కనిపిస్తుండగా లిక్కర్ ధరలు పెంచడంతో కొంత మేరకు నిధులు సమకూరుతాయనే అంచనాలున్నాయి. ఇక జీఎస్టీ విషయంలో కేంద్రం అనుసరించే వైఖరి, ఇచ్చే పరిహారం ఏ మేరకు ఉంటాయన్నది కూడా సందేహమే కావడంతో ఆ పన్నులపైనా ఆశలు పెట్టుకొనే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో వచ్చే ఏడాది నెట్టుకురావడానికి భూముల అమ్మకాలపై ప్రభుత్వం ఆధారపడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆర్థిక శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**అంతరం పూడ్చేదెలా?**

బడ్జెట్ ప్రతిపాదనలు, వాస్తవిక ఆదాయం మధ్య అంతరాన్ని ఎలా పూడ్చుకోవాలన్నదే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ముందున్న పెద్ద సవాల్‌గా మారనుంది. ఇందుకు ఎఫ్ఆర్‌బీఎం చట్టం అనుమతించిన మేరకు అప్పులు తేవడంతోపాటు భూముల అమ్మకాలే ప్రధాన వనరుగా మార్చుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం కూడా భూమి లెక్క తేల్చే పనిలో బిజీగా ఉంది. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, అటవీ, ఇతర భూముల వివరాలు ఇప్పటికే ఉన్నప్పటికీ అమ్మకానికి అనువుగా ఉన్న భూముల లెక్కను రెవెన్యూ శాఖ ప్రత్యేకంగా తయారుచేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ శివార్లలోని విలువైన భూములను వేలం వేసేందుకు హెచ్ఎండీఏ సిద్ధంగా ఉంది. ఇజ్జత్‌నగర్‌లో 36 ఎకరాలు, తెల్లాపూర్‌లో 46 ఎకరాలు, హైటెక్స్ సెంట్రల్ ఫెసిలిటీ సెంటర్‌లో 8 ఎకరాలు వేలానికి సిద్ధంగా ఉన్నాయి. వాటి అమ్మకం ద్వారా రూ. 3 వేల కోట్లకు పైగా ఆదాయం రానుంది. వాటికితోడు సుప్రీంకోర్టులో కేసులు క్లియర్ అయిన కోకాపేటలో 146 ఎకరాలు అమ్మితే రూ. 4,380 కోట్లు, పుప్పాలగూడలోని 198 ఎకరాలకు రూ. 7 వేల కోట్ల వరకు వచ్చే అవకాశాలున్నాయి. అలాగే మేడ్చల్, శంషాబాద్, రాజేంద్రనగర్‌ల పరిధిలోని ఎవాక్యూ భూములు అమ్మకానికి పెడితే రూ. వేల కోట్ల ఆదాయం రానుంది. వాటన్నింటితోపాటు అసైన్డ్ భూముల విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. అసైన్డ్ భూములకు పరిహారం చెల్లించి పేదల నుంచి తీసుకొని వాటిని అమ్మితే ఎలా ఉంటుందన్న దానిపై బ్లూప్రింట్ తయారవుతోంది. అందులో భాగంగానే శంషాబాద్ మండలంలోని ఆరు గ్రామాల్లో లెక్కకడితే రూ. 5,745 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని తేలింది. దీనికి తోడు ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను రెగ్యులరైజ్ చేయడం ద్వారా కూడా ఆదాయం వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం మీద ఓ ప్రణాళిక ప్రకారం వెళితే రూ. 25–50 వేల కోట్ల వరకు భూముల అమ్మకాల ద్వారా సమీకరించుకునే అవకాశాలున్నా ప్రభుత్వం ఏం చేస్తుందన్నది ఆసక్తిగా మారింది. అయితే పెద్ద ఎత్తున భూముల అమ్మకానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని, వచ్చే ఏడాదికి అవసరమయ్యే వరకు ప్రతిపాదనలు చేసి ఆ తర్వాతి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకొనే యోచనలో ఉందని తెలుస్తోంది.

**2020-21 బడ్జెట్ రూ. 1.55 లక్షల కోట్లు?**


2019–20 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 1.46 లక్షల కోట్లతో ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదించింది. ఈసారి 8 శాతం వృద్ధి అంచనాతో 2020–21 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 1.55 లక్షల కోట్ల వరకు బడ్జెట్‌ను ప్రతిపాదించవచ్చని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఇరిగేషన్‌కు రూ. 20 వేల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గత బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ. 6 వేల కోట్లకుపైగా కేటాయింపులు చూపినా అప్పులతో కలిపి ఈ ఏడాది డిసెంబర్ వరకు రూ. 18 వేల కోట్ల వరకు ఖర్చయింది. ఈ అంచనాల నేపథ్యంలో వచ్చే ఏడాది కూడా రూ. 20 వేల కోట్ల వరకు వ్యయం అవసరమవుతుందని సాగునీటి శాఖ వర్గాలంటున్నాయి.

**రుణమాఫీకి రూ. 18 వేల కోట్లు కేటాయించే చాన్స్**

ఈసారి 2018 ఎన్నికల హామీ అయిన రైతు రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందనే చర్చ జరుగుతోంది. రుణమాఫీకి రూ. 24 వేల కోట్ల వరకు అవసరం అవుతాయని బ్యాంకుల నుంచి వచ్చిన సమాచారం మేరకు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇందుకోసం ఈ ఏడాది బడ్జెట్‌లో పెట్టిన రూ. 6 వేల కోట్లకు తోడు వచ్చే ఏడాది బడ్జెట్‌లో రూ. 18 వేల కోట్లు రుణమాఫీకి కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. వయోపరిమితిని 57 ఏళ్లకు కుదించడంతో అదనంగా చేరిన 12 లక్షల మందికి కూడా పింఛన్లు ఇవ్వాల్సి ఉన్నందున గతేడాది కంటే రూ. 2,500 కోట్లు అదనంగా.. అంటే రూ. 12 వేల కోట్ల వరకు ఖర్చు కానుంది. దీంతోపాటు రైతుబంధు పథకం కోసం రూ. 12 వేల కోట్లు, జీతభత్యాలకు రూ. 23–25 వేల కోట్లు, సబ్సిడీలకు రూ. 9 వేల కోట్లు, అప్పులకు వడ్డీల కోసం రూ. 15 వేల కోట్లు అవసరం అవుతాయి. వాటితోపాటు రైతు బీమా, ఉపకార వేతనాలు, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మికి కలిపి రూ. 8 వేల కోట్ల వరకు కేటాయించాల్సి ఉంటుంది. విద్యుత్ రాయితీల రూపంలో మరో రూ. 9 వేల కోట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమాలకు రూ. 12 వేల కోట్లు, విద్యకు రూ. 10 వేల కోట్లు, హోంశాఖకు రూ. 5 వేల కోట్ల అనివార్య కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది అదనంగా పట్టణ ప్రగతి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అవి కూడా రూ. 1,500 కోట్ల వరకు అవసరమవుతాయి. ఇవన్నీ కలిపి రూ. 1.55 లక్షల కోట్ల వరకు ఈసారి బడ్జెట్ ప్రతిపాదనలకు అవకాశం ఉందనేది ఆర్థిక శాఖ వర్గాల అంచనాగా కనిపిస్తోంది. ఇందులో కొన్ని ఖర్చులు తగ్గించుకున్నా ఇతర అవసరాలకు నిధులు కావాల్సి వస్తుందని, మొత్తం మీద ఆ మేరకు బడ్జెట్ ప్రతిపాదనలు ఉండే అవకాశముందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

## సీఏఏపై మార్చిలో బహిరంగసభ

### హాజరుకానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



సాక్షి, హైదరాబాద్: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై మార్చి మొదటి వారంలో భారీ బహిరంగసభ నిర్వహించేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది. ఈ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సీఏఏపై ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టినా, పెద్ద ఎత్తున సభ నిర్వహించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ విధానాన్ని, ఆలోచనలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భావిస్తోంది. ఇందులో భాగంగా బహిరంగసభ నిర్వహణపై పార్టీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ కసరత్తు చేస్తున్నారు.

## బీజేపీకి దూరంగా రఘునందన్‌రావు

సాక్షి, హైదరాబాద్: లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నాయకుడు రఘునందన్‌రావును పార్టీ దూరంగా పెట్టినట్లు తెలిసింది. వేధింపుల కేసు నేపథ్యంలో పార్టీకి అపవాదు రాకూడదనే ఉద్దేశంతో ఆయనను రాజీనామా చేయాలని అధిష్టానం ఆదేశించినట్లు వదంతులు వచ్చాయి. అయితే కేసు వ్యవహారం తేలేవరకు ఆయన్ను పార్టీకి దూరంగా ఉండాలని స్పష్టం చేసినట్లు సమాచారం. అధిష్టానం ఆదేశాల మేరకు ఆయన కూడా దూరంగా ఉంటానని చెప్పినట్లు తెలిసింది.

## దేశవ్యాప్తంగా ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి

### బడ్జెట్‌పై చర్చలో టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు 50 ఏళ్లుగా ఉద్యమాలు జరిగాయని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా కేసీఆర్ తెలంగాణను పోరాడి సాధించారని వివరించారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన మేరకు తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాల్సిన మౌలిక వసతుల ప్రాజెక్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే, రహదారుల ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని విన్నవించారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల కారణంగా రాష్ట్రానికి పన్నుల వాటా తగ్గిందని, ఫలితంగా తెలంగాణ రూ.2,380 కోట్ల మేర నష్టపోనుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో నష్టపోతున్న తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం పరిహారం చెల్లించాలని విన్నవించారు. జీఎస్టీ బకాయిలను రాష్ట్రానికి విడుదల చేయాలని, రూ.5 వేల కోట్ల మేర జీఎస్టీ బకాయిలు రావాల్సి ఉందని వివరించారు. కేంద్రం ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ కార్యక్రమం తెలంగాణలో మిషన్ భగీరథ ద్వారా ఎప్పుడో అమలు చేశామని వివరించారు. హైదరాబాద్–నాగ్‌పూర్, హైదరాబాద్–వరంగల్ పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేయాలని కోరారు.

## సింగరేణిలో మరింత సౌరవిద్యుదుత్పత్తి



సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో నిర్మించిన మరో 5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ నుంచి సోమవారం ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ ప్లాంట్‌ను శ్రీరాంపూర్ ఏరియా 33 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు అనుసంధానం చేశారు. ఇప్పటికే అక్కడ 5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి జరుగుతుండగా, మరో 5 మెగావాట్ల ఉత్పత్తి జత కావడంతో సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం 10 మెగావాట్లకు పెరిగింది. 33 కేవీ లైన్ ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని భూగర్భ గనుల్లో వాడకం కోసం ఈ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. సత్వరంగా సౌర విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి చేసినందుకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

## పౌరసత్వం లేదని జర్మన్ పత్రాలు చూపండి

### చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వేములవాడ టీఆర్‌ఎస్ శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్ తమ పౌరుడు కాదని జర్మనీ దేశం అధికారికంగా ఇచ్చిన పత్రాలు చూపించాలని హైకోర్టు ఆయన్ను ఆదేశించింది. రమేశ్‌కు జర్మనీ పౌరసత్వం ఉందని, గతేడాది డిసెంబర్ 16 వరకూ జర్మనీ పాస్‌పోర్టుతోనే చెన్నై నుంచి జర్మనీకి వెళ్లారని కేంద్ర ప్రభుత్వం తరపున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ నామవరపు రాజేశ్వరరావు సోమవారం హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ పైవిధంగా రమేశ్‌ను ఆదేశించారు. జర్మనీ పౌరసత్వం ఉంటే అదే దేశం నుంచి వీసా కూడా పొందాల్సి ఉంటుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. రమేశ్‌కు జర్మనీ పౌరసత్వం ఉందని, శాసనసభ్యుడిగా ఆయన ఎన్నిక చెల్లదంటూ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సమీప అభ్యర్థిగా ఉన్న ఆది శ్రీనివాస్ గతంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రమేశ్ భారత పౌరుడు కాదని గత నవంబర్‌లో కేంద్ర హోం శాఖ ఇచ్చిన ఉత్తర్వులపై ఆయన హైకోర్టు నుంచి స్టే ఉత్తర్వులు కొనసాగించుకుంటూ వస్తున్నారు. రెండు దేశాల పౌరసత్వం ఉన్నట్లుగా ప్రాథమిక ఆధారాలున్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. విచారణ ఈ నెల 24కి వాయిదా పడింది.

## వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా ఐఏఎస్‌లా?

### పిల్‌లో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్లుగా ఐఏఎస్ అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చిన ఆఫీస్ నోట్‌ను సవాల్ చేసిన కేసులో హైకోర్టు స్పందించింది. ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశించింది. గతేడాది జూలై 24న సీఎంవో ఇచ్చిన నోట్‌ను సవాల్ చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈమేరకు సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా ఐఏఎస్‌లను నియమించాలని సీఎంవో తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమైందని ప్రకటించాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.కరుణాకర్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను సోమవారం హైకోర్టు మరోసారి విచారించింది. యూజీసీ రెగ్యులేషన్స్–2010లోని సెక్షన్ 7.3.0 (1) ప్రకారం అన్ని యూనివర్సిటీలకు శాశ్వత ప్రాతిపదికపై వీసీలను నియమించాలని, కార్యనిర్వాహక కౌన్సిళ్లను కూడా ఏర్పాటుకు ఉత్తర్వులివ్వాలని ఆయన పిల్‌లో కోరారు. శాశ్వత ప్రాతిపదికపై నియామకాలు చేసే వరకూ సీనియర్ ఫ్యాకల్టీలను ఇన్‌చార్జి వీసీలుగా నియమించాలని కూడా అన్నారు.

## కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు

### వామపక్ష నాయకుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 12 నుంచి 18 వరకు నిరసన ప్రదర్శనలు చేపడతామని, అదేవిధంగా 16న మఖ్దూం భవన్‌లో సదస్సు నిర్వహిస్తామని వామపక్షాల నాయకులు తెలిపారు. సోమవారం మఖ్దూం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నేత గోవర్ధన్, ఆర్‌ఎస్పీ జానకీరామ్, సీపీఐఎంఎల్ నాయకులు ప్రసాద్, దిడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్నార్పీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చిలో హైదరాబాద్‌లో బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించారు.

# మెడికల్ టూరిజంలో ‘ప్రైవేటు’ వెనకబాటు

### మెడికల్ టూరిజంలో 15వ స్థానంలో తెలంగాణ

- రోగులను ఆకర్షించడంలో అనేక కార్పొరేట్ ఆసుపత్రులు విఫలం
- గతేడాది విదేశాల నుంచి వైద్యం కోసం 19 వేల మంది రాక
- తమిళనాడుకు 3.6 లక్షలు.. బిహార్‌నూ ఢీ కొట్టలేని వైనం
- అధిక ఫీజులతో ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారన్న విమర్శ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులు ఎప్పుడైనా వైద్య సదస్సులు పెడితే మెడికల్ టూరిజంలో తాము ఎంతో ఘనత సాధించినట్లు చెప్పుకొంటారు. హైదరాబాద్‌ను మెడికల్ హబ్ అని అభివర్ణిస్తుంటారు. కానీ కేంద్రం సోమవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం మన రాష్ట్రం మెడికల్ టూరిజంలో 15వ స్థానంలో ఉందని పేర్కొంది. మెడికల్ టూరిజాన్ని అత్యధికంగా పెంపొందించే ప్రైవేటు ఆసుపత్రులు.. విదేశీ రోగులను తమవైపు తిప్పుకోవడంలో, వైద్య రంగంలో వచ్చిన మార్పులపై మార్కెటింగ్ చేసుకోవడంలో విఫలమవుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. 2018లో తెలంగాణకు 3.18 లక్షల మంది విదేశీ టూరిస్టులు రాగా, అందులో దాదాపు 19 వేల మంది వరకు వైద్యం కోసం వచ్చినట్లు కేంద్రం అంచనా వేసింది. అయితే అంతకుముందు రెండేళ్లతో పోలిస్తే కాస్తంత పెరిగినా, దేశవ్యాప్త పరిస్థితితో పోలిస్తే అత్యంత తక్కువగా ఉండటం గమనార్హం.

**తమిళనాడు టాప్..**

కేంద్ర పర్యాటక శాఖ దేశంలో ఏ రాష్ట్రాలకు ఎంతమంది పర్యాటకులు వస్తారో వెల్లడించింది. 2018లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి 2.88 కోట్ల మంది విదేశీయులు వచ్చారని కేంద్రం తన నివేదికలో తెలిపింది. అందులో వైద్యం చేయించుకునేందుకు 17.32 లక్షల మంది వచ్చినట్లు అంచనా వేసింది. అంటే విదేశీ పర్యాటకుల్లో 6 శాతం వరకు వైద్యం కోసం మన దేశానికి వచ్చినట్లు కేంద్రం తెలిపింది. అందులో తమిళనాడుకు అత్యధికంగా 60.74 లక్షల మంది పర్యాటకులు రాగా, వైద్యం కోసం వచ్చిన వారు 3.6 లక్షల మంది ఉంటారని అంచనా. విచిత్రమేమంటంటే ఎంతో వెనుకబడి ఉండే బిహార్‌కు 2018లో 10.87 లక్షల మంది పర్యాటకులు వస్తే, వైద్యం కోసం వచ్చిన వారు 65 వేల మంది వరకు ఉంటారని అంచనా. ఇతర రాష్ట్రాలన్నీ కూడా మెడికల్ టూరిజంపై దృష్టి సారించాయి. అయితే కొన్ని రాష్ట్రాలకు సాధారణ పర్యాటకులు వస్తుంటారు. మెడికల్ హబ్‌గా వెలుగొందుతున్న ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, ముంబైలకు పర్యాటకులు వైద్యం కోసం కూడా అధికంగా వస్తుంటారు. మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం సర్వీసు ప్రొవైడర్లకు ఆర్థిక సాయం అందిస్తుంది. మెడికల్ టూరిజం ఫెయిర్స్, మెడికల్ కాన్ఫరెన్స్, వెల్‌నెస్ కాన్ఫరెన్స్, వెల్‌నెస్ ఫెయిర్స్, మెడికల్ రోడ్ షోలకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇస్తుంది. కానీ వీటిని ఉపయోగించుకోవడంలో తెలంగాణ వెనుకబడిందని నివేదిక సారాంశం. మన రాష్ట్రానికి ప్రధానంగా మోకాళ్ల చికిత్స, జాయింట్ రీప్లేస్‌మెంట్, యాంజియోప్లాస్టీ, యూరాలజీ, కేన్సర్ వ్యాధుల నివారణ కోసం వస్తుంటారు. టాంజానియా, సోమాలియా, ఇథియోపియా, నైజీరియా, ఒమన్, ఇరాక్, దుబాయ్ వంటి దేశాల నుంచి రోగులు వస్తుంటారు.

### ప్రచారంలో వెనుకంజ..

హైదరాబాద్ కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు అనేకం మార్కెటింగ్ చేసుకోవడంలో వైఫల్యం చెందుతున్నాయన్న విమర్శలున్నాయి. మార్కెటింగ్‌పై కంటే ఆర్‌ఎంపీలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని కొందరు వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికైనా డిజిటల్ మార్కెటింగ్‌పై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు మంచి పేరు తెచ్చుకోవడంకంటే లాభాలపైనే దృష్టిసారిస్తున్నాయన్న ఆరోపణలూ ఉన్నాయి. దేశంలో అత్యధికంగా మన రాష్ట్రంలో వైద్య ఖర్చులు, ఫీజులు అధికంగా ఉన్నాయన్న భావన విదేశీయుల్లో ఉందని చెబుతున్నారు.





సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో నినాదాలు చేస్తున్న ఆర్.కృష్ణయ్య, విద్యార్థులు

# విద్యార్థుల స్కాలర్‌షిప్ పెంచాలి

- పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా
- హాజరైన ఆర్.కృష్ణయ్య, కోదండరాం

హైదరాబాద్: ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించని పక్షంలో తెలంగాణ వ్యాప్తంగా పరీక్షలు బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫీజు బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు సోమవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఏడాదికి రూ.6,500 నుంచి 20,000కి పెంచాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులకు రూ.20,000 స్కాలర్‌షిప్ ఇస్తున్నారని.. మరి తెలంగాణలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సెక్రటేరియట్, మంత్రుల క్వార్టర్స్ కట్టడానికి నిధులుంటాయి కానీ విద్యార్థుల ఫీజులు చెల్లించడానికి ఉండవా? అని నిలదీశారు. అనంతరం ప్రొ.కోదండరాం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజులు రీయింబర్స్ చేయని కారణంగా కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించమని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు మానసిన ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇదే మాదిరిగా ఫీజు చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నత విద్య బతికే పరిస్థితి ఉండదని వాపోయారు. వేముల రామకృష్ణ, నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ ఎంపీ హనుమంతరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాతరలో కందిరీగల దాడి

**తప్పించుకునేందుకు పరిగెడుతూ గుండెపోటుకు గురై వ్యక్తి మృతి**

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలో నిర్వహిస్తున్న మల్లికార్జున స్వామి జాతరలో అపశ్రుతి చోటు చేసుకుంది. జాతరలో పాల్గొన్న వారిపై కందిరీగలు దాడి చేయగా, వాటి బారినుండి తప్పించుకునేందుకు పరిగెడుతున్న వ్యక్తి కిందపడి గుండెపోటుకు గురై మృత్యువాత పడ్డాడు. ఉద్దెమర్రి గ్రామం మల్లికార్జునస్వామి జాతరలో భాగంగా సోమవారం అగ్నిగుండాల కార్యక్రమం చేపట్టగా, భక్తులు పూజలు చేసి అగ్నిగుండాలు దాటుతున్నారు. ఈ క్రమంలో అగ్ని గుండాల నుంచి వచ్చిన పొగ ఒక్కసారిగా సమీపంలో ఉన్న మర్రి చెట్టుపై ఉన్న కందిరీగల తుట్టెకు తాకింది. దీంతో కందిరీగలు భక్తులపై దాడి చేశాయి. ఒకరినొకరు తోసుకుంటూ భక్తులు పరిగెత్తారు. యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన సొప్పరి శ్రీనివాస్ (50)పై కందిరీగలు విరుచుకుపడడంతో వాటి నుండి తప్పించుకునేందుకు శ్రీనివాస్ పరుగులు తీశాడు. కందిరీగలు అతడిని వదలకపోవడంతో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి శ్రీనివాస్ అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అనంతరం చికిత్స నిమిత్తం నాగారంలోని ఓ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, కందిరీగల దాడిలో గ్రామస్తులు సైతం గాయాల పాలయ్యారు. ఘటనాస్థలిని తహశీల్దార్ గోవర్ధన్ సందర్శించారు. సంఘటన తీరును గ్రామ సర్పంచ్ రవిందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

## రాచకొండ పోలీసులకు డీజీపీ సత్కారం



సాక్షి, హైదరాబాద్: హాజీపూర్‌లో వరుస హత్యలు, లైంగికదాడుల కేసులో రాచకొండ పోలీసుల దర్యాప్తు అభినందనీయమని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. నిందితుడికి అతి తక్కువ సమయంలో మరణశిక్ష పడేలా కృషి చేసిన రాచకొండ పోలీసులను సోమవారం తన కార్యాలయంలో డీజీపీ మహేందర్‌రెడ్డి అభినందించారు. ఈ కేసు దర్యాప్తు, విచారణలో పాలుపంచుకున్న రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్, అడిషనల్ సీపీ సుధీర్‌బాబు, యాదాద్రి డీసీపీ నారాయణరెడ్డి, ఎస్‌వోటీ అడిషనల్ డీసీపీ ఎస్.సురేందర్‌రెడ్డి, భువనగిరి డీసీపీ భుజంగరావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్రశేఖర్, భువనగిరి రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీధర్ రెడ్డి, బొమ్మలరామారం ఎస్సై మధుబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ చంద్రయ్యలను డీజీపీ కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. 2015 నుంచి హాజీపూర్‌లో జరిగిన మిస్సింగ్ కేసులతోపాటు ఇతర కేసులన్నింటినీ తగు ఆధారాలతో ఛేదించిన క్రమాన్ని సీపీ భగవత్ వివరించారు. హాజీపూర్ నిందితుడు ఏ ఏ ఇతర నగరాలు, రాష్ట్రాలకు వెళ్ళాడో ఆ వివరాలను కూడా ఆయా ఎస్పీలకు అందజేశామని, ఆ సమయంలో అక్కడ ఏమైనా నేరాలకు పాల్పడ్డాడా? అన్న విషయాలను కూడా విచారించామని తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు నగదు పురస్కారాన్ని కూడా డీజీపీ అందజేశారు.

## 104 మంది ఇంజనీర్లకు ప్రమోషన్లు

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

సాక్షి, హైదరాబాద్: 104 మంది ఇరిగేషన్ ఇంజనీర్లకు ప్రమోషన్లు ఇస్తూ ప్రభుత్వం సోమవారం వేర్వేరు జీవోలు జారీ చేసింది. కొన్ని రోజుల క్రితమే సీఎం కేసీఆర్ ఇంజనీర్ల ప్రమోషన్ల ఫైల్‌పై సంతకం చేశారు. ఎస్‌ఈలుగా పనిచేస్తూ చీఫ్ ఇంజనీర్లుగా అదనపు బాధ్యతల్లో ఉన్న పది మందికి అదే స్థానంలో ప్రమోషన్ ఇచ్చింది. సీఈలుగా ప్రమోట్ అయిన వారిలో సోమశేఖర్, అనంతరాములు, శ్రీనివాస్‌రావు, అజయ కుమార్, వీరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ హమీద్ ఖాన్, అనంతరెడ్డి, నర్సింహ, రమేశ్ ఉన్నారు. 27 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను ఎస్‌ఈలుగా ప్రమోట్ చేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా (డీఈఈ) పనిచేస్తున్న 67 మందికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ప్రమోషన్ ఇచ్చారు. ఎస్‌ఈలు, ఈఈలకు ప్రమోషన్ ఇస్తూనే ప్రస్తుత స్థానాల నుంచి వారిని ట్రాన్స్‌ఫర్ చేశారు.







| మోడల్ | తిన్నగా వచ్చే ప్రయోజనం (₹) | ఎక్స్ఛేంజ్ ప్రయోజనం (₹) | కార్పొరేట్ ప్రయోజనం (₹ వరకు) | మొత్తం ప్రయోజనం (₹ వరకు) |
|---|---|---|---|---|
| M8 | 1 39 000 | 25 000 | 7 000 | 1 71 000 |
| M6 | 77 000 | 25 000 | 7 000 | 1 09 000 |
| M4 | 36 000 | 15 000 | 7 000 | 58 000 |

## స్పీకర్‌కు గవర్నర్ జన్మదిన శుభాకాంక్షలు



రాజ్‌భవన్‌లో స్పీకర్ పోచారానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గవర్నర్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఆయనకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఉదయం ఫోన్ ద్వారా శుభాకాంక్షలు చెప్పారు. సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలవగా, శాలువాతో పోచారంను సత్కరించారు. అలాగే శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మినిస్టర్ క్వార్టర్స్‌లోని స్పీకర్ నివాసంలో పోచారంను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పోచారానికి ట్విట్టర్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయురారోగ్యాలతో మరింత కాలం ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ తదితరులు స్పీకర్‌కు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

## రైతులకు అండగా పంటల బీమా

### రైతు విమోచన కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు



**సాక్షి, హైదరాబాద్:** ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు తదితర కారణాలతో పంటలు నష్టపోయి అప్పుల పాలవుతున్న రైతులకు పంటల బీమా అండగా నిలుస్తుందని రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషన్ సభ్యులు కవ్వ లక్ష్మారెడ్డి, పాకాల శ్రీహరిరావు, వ్యవసాయ, బీమా కంపెనీల అధికారులు పాల్గొన్నారు. సకాలంలో ప్రీమియం చెల్లిస్తున్నా.. బీమా డబ్బులు ఇవ్వడం లేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు 8 లక్షల మంది రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద ప్రీమియం చెల్లించారని తెలిపారు. అయితే పంట రుణాలిస్తున్న బ్యాంకులు ప్రీమియాన్ని మినహాయించుకుంటున్నా, నష్టంలో రైతులు, బీమా కంపెనీలకు వివరాలివ్వక పోవడంతో రైతులు నష్టపోతున్నారని వెల్లడించారు. పంట నష్టాన్ని గుర్తించేందుకు బీమా పథకంలో కొన్ని మార్పులు చేయాలనే సూచనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. రైతు బీమా పథకంపై మండల స్థాయిలో అవగాహన నిర్వహించాలని, కనీసం 25 లక్షల మంది రైతులు బీమా పథకంలో చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో బీమా కంపెనీల ప్రతినిధులు భారతి, మొహంతి, వ్యవసాయ శాఖ అధికారులు విజయగౌరి, అరుణ, శారదాదేవి పాల్గొన్నారు.

## పవర్ ప్లాంట్లలో భారీ ముడుపులు

### మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి ఆరోపణ



**కొడంగల్:** ముఖ్యమంత్రి కేసీఆర్ కమీషన్లకు కక్కుర్తి పడి రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మల్కాజిగిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన కొడంగల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లలో భారీగా ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు. దీనిపై సీబీఐ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ విషయాలను కేంద్ర ఆర్థిక మంత్రి, హోం మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ కుటుంబం దోపిడీ పెరిగిందని మండిపడ్డారు. భద్రాద్రిలో 1,040 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.7 వేల కోట్లు పెట్టి టెండర్లు వేయకుండా నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్‌ఈఎల్‌ను నిర్వీర్యం చేసి మెగా కంపెనీకి పనులు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఇందులో జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు పాత్ర ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేయడానికి తాను న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. న్యాయమూర్తులు కేసులను విచారణకు తీసుకున్నారని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ వేయడం లేదని చెప్పారు.

## మాకు పదోన్నతులు కల్పించండి

### డైరెక్ట్ వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు రమేశ్ బహుదూర్

**సాక్షి, హైదరాబాద్:** ప్రత్యక్ష పద్ధతిలో నియమితులైన గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్‌ఏ) పదోన్నతులు కల్పించాలని తెలంగాణ డైరెక్ట్ వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు రమేశ్ బహుదూర్ ఓ ప్రకటనలో కోరారు. డివిజనల్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా ఎంపిక చేసిన 3 వేల మంది 2012 నుంచి వీఆర్‌ఏలుగా విధులు నిర్వర్తిస్తున్నా.. ప్రమోషన్లు ఇవ్వకపోవడం ఆవేదనకు గురిచేస్తోందన్నారు. మూడేళ్ల క్రితం ప్రగతిభవన్‌లో వీఆర్‌ఏలతో భేటీ సమయంలో సీఎం కేసీఆర్ ప్రమోషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పుడైనా డైరెక్ట్ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేసి పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

## 'పాలమూరు-రంగారెడ్డి'కి జాతీయ హోదా కల్పించండి

**సాక్షి, హైదరాబాద్:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, దీని కోసం సీఎం కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆరేళ్ల క్రితం ప్రారంభించిన ఈ ప్రాజెక్టు పనులు 10 శాతం కూడా పూర్తి కాలేదని, భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం ఇంకా అందలేదని సోమవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

## పరమేశ్వరన్ మరణం జాతీయవాదానికి తీరని లోటు: మురళీధర్‌రావు


**సాక్షి, హైదరాబాద్:** ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ పి.పరమేశ్వరన్ మరణం జాతీయవాదానికి, జాతీయవాద సిద్ధాంతానికి తీరని లోటని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సైద్ధాంతిక సమస్యలకు పరిష్కారాన్ని ఆయన సూచించారన్నారు. కేరళలోని వివేకానంద కేంద్రం ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని, వివేకానందుని ఆలోచనలను అధ్యయనం చేసి, వారి భావాలకు స్పష్టమైన విశ్లేషణ అందించారన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
"e" NIT No.16/Corenet Plan Works/DCE(R)/EE(CRN)/DEE-10/AEE-6/2019-20, తేది: 08.02.2020
పనిపేరు: E-in-C(R&B), SR & CRN ప్రకారం ప్లాన్ (DMFT) క్రింద పెద్దపల్లి జిల్లాలో రెండు (2) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూలును, తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు చూడవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది: 24.02.2020న లేదా ఆలోగా.
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B) స్టేట్ రోడ్స్ & CRN
DIPR RO.No.2404-DP/CL/Advt/1/2019-20, Dt: 10.02.2020

# ఇటు ముంబై.. అటు చెన్నై!

### మూడేళ్లలో రెండు ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి

- బొల్లారం-బాసర, బీబీనగర్-గుంటూరు డబ్లింగ్‌తో సాక్షాత్కారం
- రూ.9 వేల కోట్ల పనులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి
- ఫలితంగా ఆయా మార్గాల్లో పెరగనున్న రైళ్ల సంఖ్య, వేగం
- రాష్ట్రంలో ప్రధాన ట్రంక్‌లైన్లకు తొలగనున్న 'సింగిల్ లైన్' సమస్య



**సాక్షి, హైదరాబాద్:** రైళ్ల సంఖ్య పెరగాలన్నా, వాటి వేగం పెంచాలన్నా ప్రతి మార్గంలో కనీసం రెండు లైన్ల మార్గం అవసరం. ఇంతకాలం రెండు లైన్ల మార్గాలు పూర్తిగా అందుబాటులోకి రాక తెలంగాణ పరిధిలో రైళ్ల సంఖ్య.. ఉన్న రైళ్ల వేగం పెరగని పరిస్థితి ఉంది. ఇప్పుడు ఆ కొరత తీరిపోతోంది. కొత్తగా రెండు ప్రధాన మార్గాలను రెండు లైన్లు (డబ్లింగ్)గా మార్చబోతుండటంతో, షిర్డీ మీదుగా ముంబై, తిరుపతి మీదుగా చెన్నై.. ఈ రెండు ప్రధాన మార్గాలకు ప్రత్యామ్నాయ రూట్లు అందుబాటులోకి రాబోతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఒకే రూట్‌పై పడుతున్న భారాన్ని తగ్గిస్తూ రెండు మార్గాల్లో రైళ్లను నడిపే వెసులుబాటు అందుబాటులోకి రాబోతోంది. దీనివల్ల దూరాభారం తగ్గడమే కాకుండా, ఆ ప్రాంతాలకు వెళ్లే రైళ్ల సంఖ్యను పెంచేందుకు అవకాశం కలగబోతోంది. మరోవైపు, ప్రధాన ట్రంక్ రూట్లలో ఇక తెలంగాణవ్యాప్తంగా సింగిల్ లైన్లు ఉండవు. అన్నీ డబుల్ లైన్లుగానే ఉండనున్నాయి. ఈ ఘనతను మరో మూడేళ్లలో సాధించే అవకాశముంది. దీనికి సంబంధించి ఈ ఏడాది దాదాపు రూ.9 వేల కోట్లతో పనులు మొదలవుతున్నాయి.

### ముంబైకి మరో మార్గం..

ప్రస్తుతం తెలంగాణ మీదుగా ముంబైకి ప్రధాన మార్గం వికారాబాద్-వాడీ లైను. ప్రధాన రైళ్లన్నీ ఈ మార్గం గుండానే వెళ్తున్నాయి. ముంబైకి నిజామాబాద్-బాసర మీదుగా సాగే ముద్ఖేడ్ లైన్ ఉన్నప్పటికీ ఇది సింగిల్ లైన్ కావటంతో ప్రధాన రైళ్లను నడిపే అవకాశం లేకుండా పోయింది. షిర్డీకి కూడా ఇదే ప్రధాన మార్గం అయినా, సింగిల్ లైన్ కారణంగా ఎక్కువ రైళ్లను నడిపే అవకాశం లేకుండా పోయింది. తాజాగా కేంద్రప్రభుత్వం అకోలా-డోన్ మార్గాన్ని రెండు లైన్లుగా మార్చాలని నిర్ణయించింది. 626 కి.మీ. మేర రెండో మార్గం నిర్మాణానికి రూ.6,260 కోట్లను మంజూరుచేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర పరిధిలో నగర శివారులోని బొల్లారం నుంచి నిజామాబాద్ మీదుగా బాసర దాటే వరకు డబుల్ లైన్లు అందుబాటులోకి వస్తాయి. దీంతో హైదరాబాద్ నుంచి ముంబైకి రెండో ప్రధాన లైన్ అందుబాటులోకి వస్తుంది. ఫలితంగా వాడీ రూట్‌పై భారం తగ్గుతుంది. డిమాండ్ అధికంగా ఉన్నందున ముంబైకి అదనంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సెమీ హైస్పీడ్ రైళ్లు నడిపే వెసులుబాటు కలుగుతుంది. షిర్డీకి కూడా రైళ్ల సంఖ్య పెరుగుతుంది. ఇదే డబ్లింగ్ ప్రాజెక్టులో మహబూబ్‌నగర్ నుంచి కర్నూలు వరకు (డోన్ వరకు కొనసాగుతుంది) కూడా రెండో లైను అందుబాటులోకి వస్తున్నందున ఆ మార్గంలో కూడా రైళ్ల సంఖ్య పెరుగుతుంది. బెంగళూరుకు అదనంగా రైళ్లు నడిపే అవకాశం కలుగుతుంది.

### తిరుపతి, చెన్నైకి దగ్గరి దారి..

ఇక రెండో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడే ప్రధాన రూట్ తిరుపతి, చెన్నై. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లాలంటే వరంగల్-విజయవాడ మీదుగా తిప్పుతున్నారు. ఇప్పుడు దీనికి ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రాబోతోంది. బీబీనగర్-నల్లపాడు-నడికుడి-గుంటూరు మార్గాన్ని కూడా రెండు లైన్లుగా మార్చబోతున్నారు. 248 కి.మీ. మేర ఉండే ఈ మార్గంలో డబ్లింగ్ కోసం రూ.2,480 కోట్లు మంజూరయ్యాయి. హైదరాబాద్-వరంగల్ మార్గంలో బీబీనగర్ వరకు రెండు లైన్లున్నాయి. అక్కడి నుంచి నడికుడి మీదుగా గుంటూరు వెళ్లే మార్గంలో మాత్రం సింగిల్ లైన్ మాత్రమే ఉంది. ఫలితంగా ఈ మార్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఎక్కువగా నడిపే అవకాశం లేకుండా పోయింది. చెన్నై వైపు వెళ్లే రైళ్లను గత్యంతరం లేక వరంగల్ మీదుగా నడుపుతున్నారు. ఆ మార్గంలో ఇప్పటికే ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో డిమాండ్ ఉన్నా.. కొత్త రైళ్లను వేయలేకపోతున్నారు. ఇప్పుడు బీబీనగర్-నల్లపాడు మీదుగా ఉన్న సింగిల్ లైన్‌ను రెండుగా మారిస్తే చెన్నై, తిరుపతి వైపు ఇదో ప్రధాన మార్గం అవుతుంది. నిజానికి ఈ మార్గంలో వెళ్తే దాదాపు 70 కి.మీ. దూరం కూడా తగ్గుతుంది.

### సింగిల్ లైన్‌తో ఇదే సమస్య..

సింగిల్ లైన్ మీదుగా వెళ్లేప్పుడు రైళ్ల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఒక ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తుంటే దాని ముందు వెళ్లే, వచ్చే ఇతర రైళ్లను ముందు స్టేషన్లలో నిలిపి దారి ఇవ్వాల్సి వస్తోంది. ఈ రైలు దాటిపోతేగాని అవి తిరిగి కదిలే పరిస్థితి ఉండదు. దీంతో నిలిచిపోయే రైళ్ల ప్రయాణ సమయం పెరుగుతుంది. ఇలా ఆపాల్సి రావటంతో రైళ్ల సంఖ్య పెంచటం కుదరదు. ప్రస్తుతం బొల్లారం నుంచి నిజామాబాద్ మీదుగా మహారాష్ట్ర వైపు, బీబీనగర్ నుంచి గుంటూరు మీదుగా తిరుపతి, చెన్నై వైపు ఇదే సమస్య ఉంది. ఇప్పుడు దాన్ని దూరం చేసే ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ఆ పనులు వచ్చే మూడేళ్లలో పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.



సోమవారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో సినీ నటులు నాగార్జున, చిరంజీవి తదితరులతో సమావేశమై చర్చిస్తున్న మంత్రి తలసాని

# అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్

- పైరసీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం
- సింగిల్ విండో విధానంలో సినిమా షూటింగ్ అనుమతులు
- సినీ, టీవీ కళాకారులకు మంత్రి తలసాని హామీ

**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు శంషాబాద్‌లో అవసరమైన స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం అన్నపూర్ణ స్టూడియోలో సీనియర్ సినీనటులు చిరంజీవి, నాగార్జునలతో మంత్రి సమావేశమయ్యారు. చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి, కళాకారుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం కోసం అన్ని విధాలుగా అందుబాటులో ఉండేలా స్థలం కేటాయించాలని చిరంజీవి, నాగార్జున మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రాజేంద్రనగర్ ఆర్‌డీవో చంద్రకళను అవసరమైన స్థలాన్ని వెంటనే సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సినీ, టీవీ కళాకారుల ఇళ్ల నిర్మాణం కోసం చిత్రపురి కాలనీ తరహాలో పరిసర ప్రాంతాలలో మరో 10 ఎకరాల స్థలం కేటాయించాలని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు, 24 విభాగాల సినీ కళాకారులకు సాంకేతిక నైపుణ్యం పెంపు కోసం అవసరమైన శిక్షణా కేంద్రం నిర్మాణానికి జూబ్లీహిల్స్, నానక్‌రాంగూడ ప్రాంతాలలో స్థలాలు కేటాయించాలని సినీనటులు ప్రతిపాదించారు. రూ.కోట్లతో సినిమాలు నిర్మిస్తే పైరసీతో నిర్మాతలు భారీగా నష్టపోవాల్సి వస్తుందని, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పైరసీని అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు. కొత్త సినిమాల విడుదల సమయంలో టికెట్ల ధరలను పెంచి, తగ్గించుకునే అవకాశాన్ని థియేటర్ల యాజమాన్యాలకు కల్పించాలని వారు కోరగా, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. సినిమా షూటింగుల అనుమతుల కోసం వివిధ శాఖల నుండి అనుమతులు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకురాగా, సింగిల్ విండో విధానంలో ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో షూటింగ్ అనుమతులు ఇచ్చేలా వివిధ శాఖల సమన్వయంతో ఇప్పటికే అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి చెప్పారు. చలనచిత్ర రంగంలో పనిచేస్తున్న సుమారు 28 వేల మంది కళాకారులకు ఎఫ్‌డీసీ ద్వారా గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు అవసరమైన ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని సినీనటులు విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడేవారు ఎవరైనా ఉంటే వారి వివరాలు ఇస్తే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటామని మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ రాంమోహన్‌రావు, నిర్మాత నిరంజన్, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్‌బాబు, హోంశాఖ డిప్యూటీ సెక్రెటరీ ప్రసాద్, న్యాయ శాఖ డిప్యూటి సెక్రెటరీ మన్నన్ ఫారూఖీ, సికింద్రాబాద్ ఆర్‌డీవో వసంత, ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# 8 నుంచి జేఈఈ దరఖాస్తుల్లో తప్పుల సవరణ

- మార్చి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 7వ తేదీ వరకు ఫీజు చెల్లింపు
- జేఈఈ మెయిన్ సమాచార బులెటిన్ విడుదల

**సాక్షి, హైదరాబాద్:** ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్‌లో నిర్వహించనున్న జేఈఈ మెయిన్‌కు సంబంధించిన సమాచార బులెటిన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం విడుదల చేసింది. ఈ నెల 7 నుంచి దరఖాస్తుల స్వీకరణను చేపట్టిన ఎన్‌టీఏ మార్చి 6 వరకు విద్యార్థులు సబ్మిట్ చేయవచ్చని తెలిపింది. మార్చి 7 వరకు ఫీజు చెల్లించవచ్చని స్పష్టం చేసింది. దరఖాస్తుల్లో ఏమైనా పొరపాట్లు దొర్లితే మార్చి 8 నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో సరిదిద్దుకోవచ్చని పేర్కొంది. జనవరిలో జేఈఈ మెయిన్‌కు హాజరు కాని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షలను ఏప్రిల్ 5, 7, 9, 11 తేదీల్లో నిర్వహిస్తామని ప్రకటించింది. పరీక్షలు ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఉదయం షిఫ్ట్ పరీక్షలను 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, మధ్యాహ్నం పరీక్షలను 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు నిర్వహిస్తామని తెలిపింది. ఉదయం పరీక్షలకు హాజరయ్యే వారిని ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి 2 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని వెల్లడించింది. పరీక్షల నిర్వహణ కోసం తెలంగాణలోని హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్‌లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. జనవరి జేఈఈ మెయిన్ తరహాలోనే ఏప్రిల్ పరీక్షల్లో ఒక్కో సబ్జెక్టులో 25 ప్రశ్నలు ఉంటాయని తెలిపింది. అందులో 5 న్యూమరికల్ వ్యాల్యూ ప్రశ్నలు, 20 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయని, మొత్తంగా 75 ప్రశ్నలతో 300 మార్కులకు పరీక్ష ఉంటుందని వివరించింది.

# యూనివర్సిటీ యూనిట్‌గానే రిజర్వేషన్ల అమలు

- యూజీసీ నిబంధనల ప్రకారమే నియామకాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియలో అమలు చేయనున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానం దాదాపుగా ఖరారైంది. యూనివర్సిటీ యూనిట్‌గానే రిజర్వేషన్లు అమలు చేయాలన్న నిర్ణయానికి ఉన్నత విద్యా మండలి నియమించిన ఏడుగురితో కూడిన అధికారుల కమిటీ నిర్ణయానికి వచ్చింది. సోమవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయానికి వచ్చారు. త్వరలోనే దీనిపై ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నారు. అధ్యాపక నియామకాల్లో యూజీసీ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని నిర్ణయించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు రాష్ట్రంలో రాత పరీక్షను నిర్వహించాలన్న అంశంపైనా సమావేశంలో చర్చించారు. రాత పరీక్ష నిర్వహిస్తే ఎలాంటి అవకతవకలు జరగవన్న అభిప్రాయానికి కమిటీ వచ్చింది. మరోవైపు 2021 నుంచి యూనివర్సిటీల్లో నియమితులయ్యే అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తప్పనిసరిగా పీహెచ్‌డీ ఉండాలని యూజీసీ ఇప్పటికే నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నిర్వహించబోయే నియామకాల్లో పీహెచ్‌డీని అమలు చేయాలా? వద్దా? అనే అంశంపైనా చర్చించారు. సోమవారం జరిగిన సమావేశంలో కమిటీ ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు తెలిసింది. రిజర్వేషన్లను యూనివర్సిటీ యూనిట్‌గా కొనసాగిస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరుగుతుందని, డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా చేస్తే అన్యాయం జరిగే ప్రమాదం ఉందని కమిటీ అభిప్రాయపడింది. అందుకే గతంలో అనుసరించిన పాత విధానాన్నే అమలు చేయాలని నిర్ణయానికి వచ్చింది. వీటిపై కమిటీ త్వరలో మరోసారి సమావేశమై ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేయాలని నిర్ణయించింది. ఈలోగా యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్ల నియామకం జరుగుతుందని, ఆ తరువాత అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వస్తాయని ఉన్నత విద్యా మండలి అధికారి ఒకరు పేర్కొన్నారు.

## నిర్వహణ మండలిని ఏర్పాటు చేశారా?: హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ మండలిని ఏర్పాటు చేశారో లేదో తెలియజేయాలని, ఒకవేళ ఏర్పాటు చేయకపోతే ఎప్పటిలోగా చేస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం 2016లో జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా మండలిని ఏర్పాటు చేయాల్సి ఉందని గుర్తు చేసింది. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ వల్ల ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పత్రికల్లో వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకుని నగరానికి చెందిన సీతారామరాజు అనే వ్యక్తి రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఈ పిల్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. డంపింగ్ యార్డ్ సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ దాఖలు చేసిన కౌంటర్‌లో వివరాలు సంతృప్తికరంగా లేవని ధర్మసనం అభిప్రాయపడింది. పూర్తి వివరాలతో మార్చి 2 నాటికి కౌంటర్ వేయాలని ప్రభుత్వంతోపాటు జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది.

## 'బ్యాంకు ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయాలి'

**సాక్షి, హైదరాబాద్:** బ్యాంకు ఉద్యోగులకు న్యాయమైన వేతన సవరణను సత్వరమే అమలుపరిచేలా ఇండియన్ బ్యాంక్స్ యూనియన్ (ఐబీఏ)పై ఒత్తిడి తేవాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీఏ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం నాయకులు సోమవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. 2017 నవంబర్ నుంచి బ్యాంకు ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయాల్సి ఉండగా, ఐబీఏ తాత్సారం చేస్తోందని గవర్నర్‌కు వివరించారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు.

## బీఎస్‌ఎన్‌ఎల్ పోర్టల్ ద్వారా చెల్లిస్తే బిల్లుపై డిస్కౌంట్

**సాక్షి, హైదరాబాద్:** బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు తమ బిల్లులను మై బీఎస్‌ఎన్‌ఎల్ యాప్/ బీఎస్‌ఎన్‌ఎల్ పోర్టల్ ద్వారా చెల్లిస్తే బిల్లు మొత్తంపై 1 శాతం డిస్కౌంట్ లభిస్తుందని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఆ డిస్కౌంట్ మొత్తాన్ని తదుపరి బిల్లులో సర్దుబాటు చేస్తామని పేర్కొంది. ఈ వెసులుబాటును బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించింది.

# టెన్త్ విద్యార్థులకు వయసు తిప్పలు

- వేయి మందికిపైగా 1–6 రోజులు తక్కువున్న వారే
- మొత్తంగా దరఖాస్తు చేసుకున్న వారు 1,394 మంది
- చివరి క్షణంలో అధికారుల చుట్టూ తిరిగితే అనుమతులు

**సాక్షి, హైదరాబాద్:** తల్లిదండ్రులకు తెలియకో, టీచర్ల అలసత్వమో.. నిర్దేశిత వయసు రాకముందే బడిలో చేర్పించే ఆతృత వల్లనో... వెరసి పదో తరగతి పరీక్షల సమయం వచ్చేసరికి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. టెన్త్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవసరమైన నిర్దేశిత వయసు లేకపోవడంతో వారిని పరీక్షలకు అనుమతించలేని పరిస్థితి వస్తోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ ప్రధానోపాధ్యాయులు, డీఈవో కార్యాలయాలు, ప్రభుత్వ పరీక్షల విభాగం (ఎస్సెస్సీ బోర్డు) చుట్టూ తిరిగి అనుమతులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఏటా ఇలాంటి వారి సంఖ్య వేలల్లో ఉంటోంది. ఈసారి మాత్రం ఆ సంఖ్య 1,394 ఉన్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ.సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. వారందరికి అనుమతులు లభించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

### వేయి మందికిపైగా ఆరు రోజులు తక్కువున్న వారే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2019 ఆగస్టు 30వ తేదీ నాటికి 14 ఏళ్లు పూర్తయితేనే ఆ విద్యార్థి 2020 మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు అర్హులు. ఆ నిబంధనల ప్రకారం వయసు తక్కువ ఉన్న పిల్లలు రాష్ట్రంలో 1,394 మంది ఉన్నారు. వారిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏడాదిన్నర వరకు ప్రధానోపాధ్యాయుడు, రెండేళ్లు తక్కువగా ఉంటే ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ అనుమతి పొందాల్సి ఉంటుంది. అదే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఏడాదిన్నర తక్కువగా ఉంటే డీఈవో, రెండేళ్లు తక్కువగా ఉంటే ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ నుంచి అనుమతి పొందాలి. రెండేళ్లకంటే ఎక్కువ మినహాయింపు పొందాలంటే విద్యాశాఖ కార్యదర్శి అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే ఇలా ప్రత్యేక అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అత్యధికంగా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులే ఉన్నారు. అందులోనూ గరిష్టంగా 24 రోజులు మాత్రమే తక్కువ ఉన్న వారు ఉన్నారు. అందులో 1 నుంచి 6 రోజులు తక్కువ ఉన్న వారు 1000 మందికిపైగా ఉండగా, మిగతా వారు 7 నుంచి 27 రోజులు తక్కువ ఉన్న వారు ఉన్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం లెక్కలు వేసింది. వారందరిని కూడా పరీక్షలకు అనుమతిస్తున్నట్లు వెల్లడించింది.



గర్భిణిని జోలీలో మోస్తున్న ఎమ్మెల్యే రొంధారి

# గర్భిణిని 5 కి.మీ. జోలీలో మోసిన ఎమ్మెల్యే

### మానవత్వాన్ని చాటుకున్న ఒడిశా ప్రజాప్రతినిధి

**జయపురం:** ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కాకితో కబురంపితే చాలు.. వచ్చి ఆదుకుంటానని మాట ఇచ్చిన ఎమ్మెల్యే అదే మాటపై నిలబడ్డారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 5 కి.మీ. దూరం జోలీలో మోసుకుంటూ తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్చి మానవత్వాన్ని, తన బాధ్యతను చాటుకున్నారు. ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ జిల్లా పపడహండి సమితి కుసుముగుడకు చెందిన జెమ బెహర నిండు గర్భిణి. ఆమె సోమవారం ఉదయం నుంచి పురిటి నొప్పులతో బాధపడుతోంది. అయితే ఆ గ్రామానికి రహదారి లేనందున అంబులెన్స్ రాలేని పరిస్థితి. ఈ విషయం తెలిసిన డాబుగాం ఎమ్మెల్యే మనోహర రొంధారి వెంటనే గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులు ఏర్పాటు చేసిన జోలీలో గర్భిణిని ఉంచి వారితో పాటు జోలీని మోసుకుంటూ తీసుకెళ్లి ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. తమ కోసం దిగొచ్చి జోలీ మోసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు చెప్పారు.

# మీ జాతీయత ఏమిటి?



## దేశవ్యాప్తంగా ఎన్‌పీఆర్ అమలుకు రంగం సిద్ధం

- ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఇంటింటికీ ఎన్యూమరేటర్లు
- దేశంలో ఉంటున్న ప్రజలందరి నుంచి వివరాల సేకరణ
- విద్యార్హతలు, వృత్తి, శాశ్వత చిరునామాతోపాటు తల్లిదండ్రుల పుట్టుపూర్వోత్తరాల సమాచారం నమోదు

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) నవీకరణ, జనాభా గణన, గృహ ఆస్తుల వివరాల సేకరణ (హౌస్ లిస్టింగ్)కు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ప్రభుత్వం శిక్షణ ఇచ్చి నియమించిన ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి వివిధ వివరాలు సేకరించనున్నారు. 'మీరు, మీ తల్లిదండ్రుల పుట్టిన తేదీ, పుట్టిన ప్రాంతం ఏమిటి?.. మీరు భారతీయులేనా? మీ ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, మొబైల్ నంబర్ ఏమిటి?. మీకు చట్టబద్ధంగా, సంప్రదాయబద్ధంగా పెళ్లైందా లేక సహజీవనం చేస్తున్నారా? వంటి వివరాలను అడిగి తెలుసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన రుజువులను ప్రజలు స్వచ్ఛందంగా ఇస్తే ఎన్యూమరేటర్లు తీసుకోనున్నారు. అయితే సర్వేకు వచ్చినప్పుడు ఈ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఎన్యూమరేటర్లు కుటుంబ పెద్దను కోరనున్నట్లు ఎన్‌పీఆర్–2020 యూజర్ మాన్యువల్‌లో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పౌరసత్వ చట్టం–1955, పౌరసత్వ నిబంధనలు–2013 కింద ఎన్‌పీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. దేశ పౌరులతోపాటు దేశంలో నివాసముంటున్న విదేశీయుల సమాచారాన్ని ఈ కార్యక్రమంలో భాగంగా సేకరించనుంది.

### ఎన్‌పీఆర్ కింద అడిగే ప్రశ్నలు....

1. ఎన్‌పీఆర్ బుక్‌లెట్‌పై ముద్రించిన పేరు సరైనదేనా? (ఒకవేళ తప్పులుంటే పేరును బుక్‌లెట్‌లో సరిచేస్తారు. ప్రతి వ్యక్తి పేరును కరెక్టుగా నమోదు చేయడం కీలకమని ఎన్‌పీఆర్ నియమావళి పేర్కొంటోంది)
2. ఇంట్లో అందుబాటులో ఉన్న వ్యక్తులు ఎంత మంది? (కుటుంబ సభ్యులు ఎవరైనా వలస వెళ్లినా, చనిపోయినా నమోదు చేసుకుంటారు)
3. కుటుంబ పెద్దతో ఇతర సభ్యుల బంధుత్వం.
4. పురుషులా.. మహిళలా లేక ఇతరులా?
5. వివాహ స్థితిగతులు. (అవివాహితులు, వివాహితులు, వితంతువు/భార్య చనిపోయిన వ్యక్తి, విడిపోయిన వారు, విడాకులు పొందిన వారు వంటి వివరాలు సేకరిస్తారు. రెండోసారి పెళ్లి చేసుకున్నా లేక సహజీవనం చేస్తున్నా పెళ్లయిన వ్యక్తుల కిందే లెక్కగట్టనున్నారు)
6. కుటుంబ సభ్యుల పుట్టిన తేదీ ఏమిటి? (తప్పుగా ఉంటే సరిచేస్తారు. ఒకవేళ ఎవరైనా తమ పుట్టిన తేదీ, నెల వివరాలు అందించలేని స్థితిలో ఉంటే కేవలం పుట్టిన సంవత్సరాన్ని మాత్రమే నమోదు చేస్తారు. ఎన్‌పీఆర్ డేటాబేస్‌లో పుట్టిన తేదీ కీలకం. ఒకవేళ పుట్టిన తేదీ సమాచారం అందించలేని పరిస్థితిలో ఉంటే సంబంధిత వ్యక్తుల స్కూల్ సర్టిఫికెట్లు, ఇతర పత్రాలు, ఆధార్, ఓటర్ ఐడీ, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, ఇతర పత్రాల ఆధారంగా పుట్టిన తేదీని సేకరిస్తారు. అవి కూడా లేకపోతే సభ్యుల జాతక చక్రాన్ని పరిగణలోకి తీసుకోనున్నారు. జాతకచక్రం కూడా లేకుంటే ఎన్యూమరేటర్లే వయసును అంచనా వేసి నమోదు చేసుకోనున్నారు)

- కేవలం పుట్టిన సంవత్సరం మాత్రమే తెలిసి ఉంటే పుట్టిన తేదీని అంచనా వేసేందుకు ఎన్యూమరేటర్లు పలు ప్రశ్నలు అడగనున్నారు. వర్షాకాలంలో పుట్టారా లేదా తర్వాత? పుట్టిన నెలలో దసరా, దీపావళి, సంక్రాంతి, క్రిస్మస్ వంటి ఏమైనా పండుగలు వచ్చాయా? గాంధీ జయంతి, స్వాతంత్య్ర దినోత్సవం వంటి సెలవులు వచ్చాయా? వంటి ప్రశ్నలను సంధించడం ద్వారా పుట్టిన తేదీని అంచనా వేయనున్నారు.
- పుట్టిన తేదీ, సంవత్సరం రెండూ తెలియని పక్షంలో ఎప్పుడు పుట్టారో తెలుసుకోవడానికి దేశ చరిత్రలో కీలక ఘట్టాలుగా నిలిచిన సంఘటనల ఆధారంగా వ్యక్తుల వయసును ఎన్యూమరేటర్లు అంచనా వేయనున్నారు. తొలి ప్రపంచ యుద్ధం (1914–18), దండి యాత్ర (1930), క్విట్ ఇండియా ఉద్యమం (1942), స్వాతంత్య్ర దినోత్సవం (1947), చైనాతో యుద్ధం (1962), పాకిస్తాన్‌తో యుద్ధం (1965), బంగ్లాదేశ్‌కు స్వాతంత్య్రం (1971), ఏసియాడ్ క్రీడలు (1982), భారత్ తొలి క్రికెట్ ప్రపంచకప్ విజయం (1983) సాధించినప్పుడు పుట్టారా? అని అడిగి తెలుసుకోనున్నారు.

7. మీరు పుట్టిన ప్రాంతం ఏమిటి? (దేశంలో పుడితే రాష్ట్రం, జిల్లా వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది)
8. మీ జాతీయత ఏమిటి? భారతీయులేనా? (మీరు పాస్‌పోర్టు నంబర్ స్వచ్ఛందంగా ఇస్తే స్వీకరించనున్నారు)
9. మీ విద్యార్హతలు ఏమిటి? (ప్రీ ప్రైమరీ, ప్రాథమిక, 1–12 తరగతులు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ డిప్లొమా, టీటీసీ, ఇతర డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ డిప్లొమా, పీజీ, ఎంఫిల్, పీజీ ఆపై, సరైన విద్య లేని, నిరక్షరాస్యులా? వంటి వివరాలను అడిగి తెలుసుకోనున్నారు)
10. మీ వృత్తి ఏమిటి? (వ్యవసాయం, రోజుకూలీ, స్వయం ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగి, ఉద్యోగి యజమాని, ప్రైవేటు ఉద్యోగి, డొమెస్టిక్ హెల్పర్, నాన్ వర్కరా? అని ఆరా తీయనున్నారు)
11. తల్లి మాతృ భాష ఏమిటి?
12. మీ శాశ్వత చిరునామా చెప్పండి
13. ప్రస్తుత చిరునామాలో ఓ సభ్యుడు పుట్టినప్పటి నుంచి ఉంటున్నాడా? (ఒకవేళ లేకుంటే ఇప్పుడు ఎన్నేళ్ల నుంచి ఇక్కడ ఉన్నాడు? అంతకు ముందు ఎక్కడ ఉన్నాడో తెలపాలి)
14. తండ్రి, తల్లి, భాగస్వామి వివరాలు (తల్లిదండ్రుల గణన ఈ ఇంట్లో జరగని పక్షంలో వారి పేర్లు, పుట్టిన తేదీ వివరాలు సేకరిస్తారు. భాగస్వామి అయితే కేవలం పేరు మాత్రమే రాస్తారు. అదే ఇంట్లో తల్లిదండ్రులు, భాగస్వామి గణన నిర్వహిస్తే వారి పేర్లు, దేశం/విదేశంలో పుట్టిన ప్రాంతం, పుట్టిన తేదీ వివరాలు సేకరిస్తారు. తల్లిదండ్రుల పుట్టిన తేదీ వివరాలు రూఢీ కాకపోతే సంబంధిత కాలమ్‌లో '–'అని పెడతారు.
15. ఆధార్, మొబైల్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ నంబర్లు అందుబాటులో ఉంటే తీసుకుంటారు.

### జనాభా గణనకు అర్హులైన వారు..

- ఎన్యూమరేటర్ వచ్చిన సమయంలో ఇంట్లో అందుబాటులో ఉన్న వ్యక్తులు.
- జనాభా గణన నిర్వహించే సమయంలో అక్కడ ప్రత్యక్షంగా ఉన్న ఇంటి సాధారణ నివాసితులు.
- ఇంటి సాధారణ నివాసితులై ఉండి ఎన్యూమరేటర్ సందర్శనకు వచ్చిన సమయంలో ఇంట్లో లేని వ్యక్తులు జనాభా గణన ముగిసేలోగా తిరిగి వస్తే వారి వివరాలను సైతం సేకరించనున్నారు.
- సందర్శకులు, పనిమనుషులు, అద్దెకు ఉండే వ్యక్తులు, డ్రైవర్లు లేదా అలాంటి వ్యక్తులు ఓ గృహ పరివారంతో కలిసి ఉండటంతోపాటు పైన పేర్కొన్న మూడు అర్హతలను కలిగి ఉంటే వారి వివరాలను సైతం సేకరిస్తారు.

### ఎన్‌పీఆర్ డేటాబేస్-2010 ఆధారంగా...

దేశంలో నివాసముంటున్న ప్రజలందరికీ సంబంధించిన ఎన్‌పీఆర్ డేటాబేస్‌ను తొలిసారిగా 2010లో తయారు చేశారు. జనగణన–2011 కార్యక్రమంలో భాగంగా 2010లో నిర్వహించిన సర్వేలో సేకరించిన సమాచారం ఆధారంగా ఎన్‌పీఆర్ డేటాను రూపొందించారు. ఆ వివరాలతో 'ఎన్‌పీఆర్ డేటా బుక్‌లెట్'ను ముద్రించనున్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ పెద్ద నుంచి జనాభా గణనతోపాటు ఎన్‌పీఆర్‌కు సంబంధించి తాజా సమాచారాన్ని సేకరించనున్నారు. ఈ క్రమంలో ఎన్‌పీఆర్ బుక్‌లెట్స్‌లో సంబంధిత కుటుంబం/వ్యక్తులకు సంబంధించి ముద్రించి ఉన్న సమాచారాన్ని సరిపోల్చి చూడనున్నారు. ఇందుకు అవసరమైతే ఆధార్, ఓటర్ ఐడీ కార్డు వంటి రుజువులను చూపాలని కోరనున్నారు. పాత ఎన్పీఆర్ డేటాబేస్‌లో ఎవైనా తప్పులుంటే సరిచేయడంతోపాటు అవసరమైన కొత్త సమాచారాన్ని నమోదు చేసుకోనున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా పాత ఎన్‌పీఆర్ డేటాబేస్‌లో ఉన్న కుటుంబాల్లో కొత్త సభ్యులున్నట్లుగానీ, కొత్త కుటుంబాలున్నట్లుగానీ గుర్తిస్తే వారికి సంబంధించిన సమాచారాన్ని నమోదు చేసేందుకు ఎన్యూమరేటర్లకు 'ఖాళీ ఎన్‌పీఆర్ ఫారాలను'కేంద్రం అందించనుంది. ఓ కుటుంబానికి సంబంధించిన ఎన్‌పీఆర్ బుక్‌లెట్‌లో ఆ కుటుంబానికి సంబంధించిన కొత్త సభ్యుల వివరాలను నమోదు చేసేందుకు అవసరమైన ఖాళీ పేజీలుంటే అదే బుక్‌లెట్‌లో నమోదు చేయనున్నారు.

- కుటుంబంలోని ప్రతి వ్యక్తికి సంబంధించిన ఎన్‌పీఆర్ డేటాబేస్‌ను నవీకరిస్తారు.
- నవీకరించిన ఎన్‌పీఆర్ డేటాబేస్‌ను కుటుంబ పెద్దకు చూపించడంతోపాటు బుక్‌లెట్‌పై అతడి/ఆమె సంతకం/వేలిముద్రను సేకరించనున్నారు.
- కుటుంబ సభ్యుల పేర్లు, సంఖ్య, ఇతర అంశాలకు సంబంధించిన సరైన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత కుటుంబ పెద్దది అని ఎన్‌పీఆర్ నిబంధనలు పేర్కొంటున్నాయి.
- ఒకే గృహంలో నివాసముంటూ ఉమ్మడి కిచెన్‌పై ఆధారపడిన రక్తసంబంధికులతోపాటు ఏ సంబంధం లేని వ్యక్తుల ఎన్‌పీఆర్ డేటాను 'సాధారణ గృహాల'విభాగం కింద స్వీకరించనున్నారు.
- బోర్డింగ్ గృహాలు, మెస్‌లు, హాస్టళ్లు, హోటళ్లు, రెస్క్యూ గృహాలు, అబ్జర్వేషన్ హోంలు, బెగ్గర్ హోంలు, జైళ్లు, ఆశ్రమాలు, వద్ధాశ్రమాలు, బాల గృహాలు, అనాథాశ్రమాలు వంటి భవనాల్లో నివాసముండే ఏ బంధుత్వం లేని వ్యక్తుల ఎన్‌పీఆర్ డేటాను వ్యవస్థాగత గృహాల విభాగం కింద సమీకరించనున్నారు.
- ఎన్‌పీఆర్ బుక్‌లెట్‌పై రాష్ట్రం/జిల్లా/తహసీల్/తాలుకా/పోలీస్ స్టేషన్/డివిజన్ బ్లాక్/సర్కిల్ బ్లాక్/మండలం/పట్టణం/గ్రామం పేర్లతో వాటికి సంబంధించిన కోడ్‌లు ముద్రించి ఉండనున్నాయి. వార్డు, హౌస్‌హోల్డ్ బ్లాక్ నంబర్, సబ్‌బ్లాక్ నంబర్, పిన్‌కోడ్ వంటి వివరాలు సైతం ఉండనున్నాయి.

# కరోనా వీఐపీ వార్డు

- గాంధీ ఆస్పత్రి ప్రధాన భవనంలోని ఏడో అంతస్తులో అందుబాటులోకి..
- మిగతా రోగులతోపాటు చికిత్స అందించడంపై వీఐపీల అసంతృప్తి
- టీవీ, ఏసీ, ప్రత్యేక బాత్రూంసహా ఇతర సౌకర్యాలు



**హైదరాబాద్:** ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న కరోనా వైరస్ అనుమానితులకు ఇకపై సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వీఐపీ ట్రీట్‌మెంట్ లభిస్తుంది. గాంధీ ఆస్పత్రి ప్రధాన భవనంలోని ఏడవ అంతస్తులోని పేయింగ్ రూం విభాగంలో ఏడు పడకలతో కరోనా వీఐపీ వార్డును అందుబాటులోకి తెచ్చారు. వీఐపీ కేటగిరీకి చెందిన కరోనా అనుమానితులు ఎక్కువ సంఖ్యలో వస్తే దానికి అనుగుణంగా పడకల సంఖ్య పెంచేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గాంధీ అత్యవసర విభాగంలో కరోనా ఎక్యూట్ మెడికల్ కేర్ (ఏసీయూ)లో పది, ప్రధాన భవనంలో 20 పడకలతో రెండు ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖకు చెందిన ఉన్నతాధికారి కుటుంబసభ్యులు, ఎయిర్‌హోస్టెస్‌లు ఇటీవల కరోనా అనుమానంతో గాంధీ ఆస్పత్రికి రాగా, వారిని ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ చేశారు. మిగిలిన రోగులతో పాటు తమను అక్కడే అడ్మిట్ చేయడం, తమ హోదాకు తగ్గట్టుగా వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో వారంతా డబ్బులు ఖర్చు చేసేందుకు వెనుకాడమని, మరింత మెరుగైన వసతులు, వైద్యసేవలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో పేయింగ్‌రూంలు అందుబాటులో ఉన్నాయి. ఆయా రూమ్‌లను కరోనా వీఐపీ వార్డులుగా ఏర్పాటు చేయాలని భావించిన ఆస్పత్రి పాలనా యంత్రాంగం ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసి సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చింది. వినోదం కోసం టీవీ, ఏసీ, ప్రత్యేక బాత్‌రూం తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ వార్డులో చికిత్స పొందేందుకు నామమాత్రంగా చార్జీలు వసూలు చేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ వివరించారు.

### 'కరోనా'పై కీలక నిర్ణయాలు


కరోనా అనుమానితులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని కరోనా నోడల్ కేంద్రమైన గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మైక్రోబయోలజీ, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, రేడియోలజీ విభాగాధిపతులు నాగమణి, కృష్ణమూర్తి, వినయశేఖర్, శాంతిశ్రీ, నోడల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌ఎంఓలు జయకృష్ణ, శేషాద్రిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. హెల్ప్‌డెస్క్ సహకారంతో ప్రత్యేక లిఫ్ట్‌లో కరోనా అనుమానితులను ఐసోలేషన్ వార్డుకు తీసుకువెళ్లేందుకు పక్కా ఏర్పాట్లు చేపట్టామని, ఐసోలేషన్ వార్డులో నమూనాల సేకరణలో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించి, అనుమానితులు వచ్చిన వెంటనే నమూనాలు సేకరించేందుకు ల్యాబ్ టెక్నీషియన్లను వార్డులో నియమించామన్నారు. ఎక్స్‌రే తీసి వెంటనే ఫిల్మ్ అందించేందుకు పోర్టబుల్ ఎక్స్‌రే మిషన్, రేడియోగ్రాఫర్, నర్సింగ్ సిబ్బంది, పేషెంట్ కేర్‌టేకర్‌లను ఆయా వార్డులో రౌండ్ ది క్లాక్ సేవలు అందించేలా ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌ఎంఓలు, స్పెషలిస్ట్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సీనియర్ రెసిడెంట్స్, పేషెంట్ కేర్‌టేకర్లు, హెల్ప్‌డెస్క్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించామన్నారు. గాంధీ ఐసోలేషన్ వార్డుల్లో ఇప్పటివరకు 43 మంది అనుమానితులు చేరగా నిర్ధారణ పరీక్షల్లో అందరికీ కరోనా నెగటివ్ రావడంతో డిశ్చార్జి చేశామన్నారు. కరోనా అనుమానితులు వైద్యులకు చెప్పకుండా ఇంటికి వెళ్లిపోతున్నారని, ఇకపై అటువంటి ఘటనలు జరగకుండా చిలకలగూడ సీఐ బాలగంగిరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ సిబ్బందిని నియమించామని వివరించారు. ఐసోలేషన్ వార్డులో సోమవారం ఇద్దరు అడ్మిట్ అయ్యారని, వారి నమూనాలు సేకరించి నిర్ధారణకు పంపినట్లు తెలిపారు. గాంధీ డిజాస్టర్ వార్డులో చికిత్స పొందుతున్న ఒక స్వైన్‌ఫ్లూ బాధితున్ని సోమవారం డిశ్చార్జి చేశామని, మరో నలుగురు స్వైన్‌ఫ్లూ బాధితులకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

# ఐదుగురు సమాచార కమిషనర్ల నియామకం

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**సాక్షి, హైదరాబాద్:** సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా కొత్తగా ఐదుగురిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. నమస్తే తెలంగాణ పత్రిక సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి, టీ–న్యూస్ సీఈఓ మైదా నారాయణరెడ్డి, టీఆర్‌ఎస్ నేత డాక్టర్ గుగులోతు శంకర్‌నాయక్, న్యాయవాదులు మహమ్మద్ అమీర్ హుస్సేన్, సయ్యద్ ఖలీలుల్లా సమాచార కమిషనర్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం మూడేళ్ల పాటు లేదా 65 ఏళ్ల వయసు వచ్చే వరకు.. ఈ రెండింటిలో ఏది ముందు వస్తే అప్పటి వరకు వీరు ఈ పదవిలో కొనసాగనున్నారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు మరో కమిషనర్ పనిచేస్తున్నారు. కొత్తగా మరో ఐదుగురు కమిషనర్లను ప్రభుత్వం నియమించింది. కొత్త సమాచార కమిషనర్ల గురించి క్లుప్తంగా..

**కట్టా శేఖర్ రెడ్డి..**



నల్లగొండ జిల్లా మాడుగులపల్లి గ్రామంలో పుట్టిన శేఖర్‌రెడ్డి ఎంఏ, ఎంఫిల్ చేశారు. 33 ఏళ్లుగా వివిధ పత్రికలు, చానళ్లలో జర్నలిస్టుగా పని చేస్తున్నారు.

**మైదా నారాయణ రెడ్డి..**




సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ముబారస్పూర్‌కు చెందిన నారాయణరెడ్డి గత 24 ఏళ్లుగా జర్నలిస్టుగా వివిధ పత్రికలు, చానళ్లలో పనిచేశారు. ఉస్మానియా నుంచి గ్రాడ్యుయేషన్ చేశారు.

**శంకర్‌నాయక్..**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భోజ్యతండాకు చెందిన శంకర్‌నాయక్ హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఎంఏ, తెలుగు వర్సిటీలో ఎంఫిల్, ఉస్మానియా వర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

**మహమ్మద్ అమీర్..**



హైదరాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన మహమ్మద్ అమీర్ ఎంబీఏ, ఎల్‌ఎల్‌బీ, పీహెచ్‌డీ చేశారు. 11 ఏళ్లుగా నగరంలో న్యాయవాదిగా సేవలందిస్తున్నారు.

**సయ్యద్ ఖలీలుల్లా**



హైదరాబాద్‌లోని ఆగాపురాకు చెందిన ఖలీలుల్లా గుల్బర్గా వర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ చేసి సిటీ క్రిమినల్ కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

# గోదావరిపై మరో మూడు ఎత్తిపోతలు

- చెన్నూరు నియోజకవర్గంలో 1.35 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చేలా నిర్మాణం

**సాక్షి, హైదరాబాద్:** గోదావరి జలాల సమర్థ వినియోగం లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల బ్యాక్‌వాటర్ జలాలపై ఆధారపడి మూడు ఎత్తిపోతల పథకాలు చేపట్టాలని నిర్ణయించింది. చెన్నూరు నియోజకవర్గంలో 1.35 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా వీటిని చేపట్టేందుకు అవసరమైన సమగ్ర సర్వే చేసేందుకు రూ.6.88 కోట్లు విడుదల చేస్తూ నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాళేశ్వరంలో భాగంగా ఇప్పటికే నిర్మించిన బ్యారేజీలపై లిఫ్టులను ఏర్పాటు చేసి సమీప నియోజకవర్గాల్లో నీరందని ఆయకట్టుకు సాగుజలాలు పారించాలని సీఎం కేసీఆర్ గతంలోనే నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇంజనీర్లు ఒక్కో బ్యారేజీ ఫోర్‌షోర్ నుంచి ఒక్కో లిఫ్టు ప్రతిపాదించారు. మొదటి లిఫ్టును వేమునిపల్లి మండల పరిధిలోని వెంచపల్లి వద్ద, రెండో లిఫ్టును అన్నారం ఫోర్‌షోర్‌లో నిర్మించి మద్దికల్ చెరువుకు నీటిని తరలించేలా ప్రతిపాదించగా, మూడో లిఫ్టును సుందిళ్ల వద్ద ఏర్పాటుచేసి 31 కి.మీ.ల దూరంలోని లింగాపూర్ చెరువుకు నీటిని తరలించేలా ప్రతిపాదించారు. సమగ్ర సర్వే నివేదికలు అందిన అనంతరం ఈ ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను చేపట్టనున్నారు.

# చిట్‌ఫండ్స్ పర్యవేక్షణకు 'టి చిట్స్'

- బ్లాక్‌చెయిన్ ఐటీ టెక్నాలజీ ఆధారంగా కొత్త స్టార్టప్
- పది లక్షలకు పైగా చిట్‌ఫండ్స్ సభ్యులకు ప్రయోజనం

**సాక్షి, హైదరాబాద్ :** పొదుపు ద్వారా తక్షణ, భవిష్యత్తు ఆర్థిక అవసరాలను తీర్చుకునే విధానం దేశంలో చిట్‌ఫండ్స్ వ్యాపారానికి పునాది వేసింది. ఈ వ్యాపారం దశాబ్దాలుగా ఆచరణలో ఉండగా, ఇది క్రమంగా కార్పొరేట్ స్థాయికి చేరుకుంది. దీంతో చిట్‌ఫండ్స్ నిర్వహణ సంస్థల కార్యకలాపాల పర్యవేక్షణకు ప్రభుత్వాలు పలు చట్టాలను రూపొందించాయి. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టానికి అనుగుణంగా 1982 నుంచి చిట్‌ఫండ్ సంస్థలు తమ వివరాలను ప్రభుత్వం వద్ద నమోదు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉంటే ఈ వ్యాపారాన్ని నియంత్రించే బాధ్యతను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 778 రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీలు 1511 బ్రాంచీల ద్వారా వ్యాపారం నిర్వహిస్తున్నాయి. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే 10.08 లక్షల మంది అల్పాదాయ వర్గాలకు చెందిన వారు రూ.18,549 కోట్లు ఏటా పొదుపు చేస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశంలో జరుగుతున్న చిట్ వ్యాపారంలో తెలంగాణ వాటా 20 నుంచి 25 శాతం ఉన్నట్లు సమాచారం.

**చిట్‌ఫండ్ల నియంత్రణకు 'టి చిట్స్'**



అల్పాదాయ, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు రాష్ట్రంలో 24,831 గ్రూపులుగా ఏర్పడి ప్రతి నెలా రూ.వేల కోట్ల వేలం పాడుతుండటంతో, చిట్‌ఫండ్ సంస్థలు అవకతవకలకు పాల్పడకుండా రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఐటీ సాంకేతికత సాయాన్ని తీసుకుంటోంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న 'టి హబ్'సాయంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ 'టి చిట్స్'పేరిట ఒక స్టార్టప్‌ను సిద్ధం చేసింది. ఈ ఐటీ సాంకేతికత 'బ్లాక్‌చెయిన్'వేదికగా రూపొందించిన ఈ స్టార్టప్ చిట్‌ఫండ్ కంపెనీలు తమ కార్యకలాపాలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుంది. చిట్‌ఫండ్ కంపెనీల రిజిస్ట్రేషన్ మొదలుకుని, వాటి ఆర్థిక లావాదేవీల నిర్వహణ వరకు 'టి చిట్స్ 'ద్వారా పర్యవేక్షించడం సాధ్యమవుతుంది. ఈ కంపెనీల నిర్వహణలో ఎదురవుతున్న అనేక సవాళ్లకు ఈ స్టార్టప్ పరిష్కారం చూపుతోందని ఐటీ శాఖ అధికారులు చెప్తున్నారు. ఆర్థిక లావాదేవీల్లో జరిగే అవకతవకలను పసిగట్టడంతో పాటు, సభ్యుల ప్రయోజనాలను రక్షించేందుకు 'టి చిట్స్ 'ఉపయోగపడుతోంది. చిట్‌ఫండ్ సంస్థల ఆర్థిక లావాదేవీల వివరాలు సురక్షితంగా ఉంచడంలో బ్లాక్‌చెయిన్ ఐటీ సాంకేతికత ఉపయోగపడుతుంది. 'టి చిట్స్'లో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వినియోగానికి గాను ఇటీవల ముంబైలో జరిగిన ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వానికి బంగారు పతకం కూడా లభించింది.

## భైంసా బాధితులకు పరిహారం చెల్లించాలి

**జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రజ్ఞా పరాండే**

**సాక్షి, హైదరాబాద్:** భైంసా ఘటనలో నిరాశ్రయులై, భయభ్రాంతులకు గురైన పిల్లలు, బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించి నష్టపరిహారం చెల్లించాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రజ్ఞా పరాండే డిమాండ్ చేశారు. నగరంలోని దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ.. భైంసాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, బాధితులు ఇంకా భయంతోనే బతుకుతున్నారని వాపోయారు. ఆ ఘటనకు కారకులైన వారిని వదిలేసి, అమాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. ఒక వర్గం వాళ్లు మరో వర్గం వారిపై కావాలనే దాడి చేసినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. పూరి గుడిసెలు, పెంకుటిళ్లలో పెట్రోబాంబులు వేయడం, రాళ్లు వేయడం చూస్తుంటే పథకం ప్రకారం చేసినట్లే కనిపిస్తోందన్నారు. భైంసా ఘటనపై కేంద్రానికి నివేదిక ఇస్తానన్నారు. భైంసా గురించి ప్రపంచానికి తెలియకుండా చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోందని.. అందుకే అక్కడకు ఎవరినీ వెళ్లనీయకుండా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అక్కడి పరిస్థితులను దాచిపెట్టే ప్రయత్నం చేయడానికి మీడియాపై ఆంక్షలు విధించినా, సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి తెలుస్తుందన్నారు.



సోమవారం నిర్మల్ జిల్లా భైంసాలోని కోర్బగల్లిలో ఇటీవల అల్లరి మూకలు దహనం చేసిన ఇంటిని పరిశీలిస్తున్న జాతీయ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ప్రజ్ఞా పరాండే

సాక్షి ఉద్యోగ అవకాశాలు

SANTHIRAM MEDICAL COLLEGE & GENERAL HOSPITAL
(Estd.:2005) NH-40, NANDYAL-518 501, Kurnool Dist. A.P.
(Recognized by Govt. of India & Medical Council of India, New Delhi)
Ph:08514-222480 Mobile:7702999391. Email:srmc.hospital@gmail.com
Applications are invited from the eligible candidates for the following posts
Professors : General Medicine, General Surgery and Paediatrics Depts.
Assoc. Professors : Physiology, Pathology, Microbiology, Forensic Medicine, General Medicine, Pulmonary Medicine, Pediatrics, Psychiatry, General Surgery, Orthopaedics, Obstetrics & Gynaecology Depts.
Asst. Professors : Anatomy, Physiology, Bio Chemistry, Pathology, Microbiology, General Medicine, Pediatrics, General Surgery, Orthopaedics, Obstetrics & Gynaecology Depts.
Sr. Residents : General Medicine, Pediatrics, General Surgery, Orthopaedics, Obstetrics & Gynaecology Depts.
Note: 1) Accommodation will be provided in the campus itself and all are required to reside inside the campus. 2) All the teaching faculty will be selected as per the M.C.I. norms. 3) Salary will be fixed based on experience, expertise and dedication.
Send Bio-data by mail within 20 days from the date of publication.
PRINCIPAL

సాక్షి

మంగళవారం, ఫిబ్రవరి, 11

# మాటలు కాదు...చేతలు ముఖ్యం

పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేసే అంశంలో ప్రభుత్వాల్లో దశాబ్దాలుగా నెలకొన్న అస్పష్టత ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రయోజనాలు దెబ్బతినే స్థితికి చేర్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆ కోటాను ప్రాథమిక హక్కుగా పరిగణించడం లేదా వాటిని వర్తింపజేయమని ప్రభుత్వాలను ఆదేశించడం సాధ్యంకాదని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది. ఈ విషయమై వున్న సందిగ్ధతను తొలగించడానికి తగిన చర్యలు తీసుకోమంటూ చాన్నాళ్లుగా దళిత సంఘాలు కోరుతూనే వున్నాయి. కానీ కదిలికేది? తీరా ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు వెలువరించాక కారణం మీరంటే మీరని ఆ పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. పార్లమెంటులో వాదోపవాదాలు హోరెత్తుతున్నాయి. కుల వివక్ష అంతం కావడానికి... సమాజ పురోగతిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు నిజమైన భాగస్వామ్యం దక్కడానికి, వివక్ష పోవడానికి ఆ వర్గాలకు చదువుల్లో, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు కల్పించడం ఒక్కటే మార్గమని మన రాజ్యాంగ నిర్మాతలు విశ్వసించారు. కానీ స్వాతంత్ర్యం వచ్చి 73 ఏళ్లవుతున్నా వివక్ష అంతరించలేదు. అది కొత్త కొత్త రూపాల్లో తలెత్తుతున్నది. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలొచ్చినవారు సైతం పదోన్నతుల్లో అన్యాయానికి గురవుతున్న సందర్భాలు కోకొల్లలుగా వుంటున్నాయి. తొలిసారి 1957లోనే అప్పటి రైల్వే మంత్రి జగ్జీవన్‌రామ్ దీన్ని గుర్తించారు. పదోన్నతుల్లో సైతం కోటా అమలు చేయడానికి వీలుగా ఆ శాఖలో విధానం రూపొందించారు. అయితే ఈ మాదిరి నిర్ణయాలు తరచు వివాదాస్పదంగా మారుతున్నా ప్రభుత్వాలు మౌనం పాటిస్తున్నాయి.

ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించడం వరకూ అంగీకరిస్తున్నవారు కూడా పదోన్నతుల్లో పని తీరు, సర్వీసు ప్రామాణికం కావాలి తప్ప రిజర్వేషన్లు ఎందుకివ్వాలన్న ప్రశ్న లేవనెత్తుతున్నారు. కానీ ఉద్యోగ నియామకాల్లో అడ్డుతగులుతున్న కులం పదోన్నతుల్లో అడ్డుతగలదని ఎందుకనుకోవాలన్నది దళిత సంఘాల ప్రశ్న. సమాజంలో అడుగడుగునా అసమానతలు, వివక్ష గూడుకట్టుకుని ఉన్నప్పుడు పదోన్నతుల సమయంలో వాటి ప్రభావం పడదని, పడటం లేదని ఎలా చెప్పగలం? కనుకనే ఈ రెండు వాదాలూ అప్పట్లోనే కోర్టుకెక్కాయి. జగ్జీవన్ రామ్ తీసుకొచ్చిన విధానం సరికాదని, రాజ్యాంగ విరుద్ధమని మద్రాసు హైకోర్టు 1959లో కొట్టేసింది. దానిపై కేంద్రం సుప్రీంకోర్టు కెక్కినప్పుడు అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గజేంద్ర గాడ్కర్ నేతృత్వంలోని ధర్మాసనం రైల్వే మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయం సరైనదేనని 1961లో 3–2 మెజారిటీతో తీర్పునిచ్చింది. కానీ వెనకబాటుతనాన్ని నిర్ధారించే అనేకానేక అంశాల్లో కులం ఒకటి మాత్రమేనని, అదే ఏకైక గీటురాయి కారాదని 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో పరిస్థితి మొదటికొచ్చింది. మధ్యలో కొన్ని రాష్ట్రాలు పదోన్నతులు అమలు చేసిన సందర్భాలున్నాయి. కానీ వాటి రాజ్యాంగ బద్ధతను ప్రశ్నించినచోట అవి నిలిచిపోయాయి. దీన్ని సరిదిద్దడానికి 1995లో కేంద్రంలోని పీవీ నరసింహారావు ప్రభుత్వం రాజ్యాంగంలోని 16 వ అధికరణలో 4ఏ క్లాజును చేరుస్తూ 77వ రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకొచ్చింది. అయితే ఈ మార్గంలో పదోన్నతులు పొందుతున్నవారు అంతవరకూ సీనియర్లుగా వున్న తమకు సీనియర్లుగా మారుతున్నారని కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో సుప్రీంకోర్టు 1999లో 'క్యాచ్ అప్' నిబంధన తీసుకొచ్చింది. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీ సిబ్బందికి పదోన్నతి వచ్చి, సాధారణ కేటగిరీకి చెందిన తమ సీనియర్లకు వారు సీనియర్లుగా మారితే, తక్షణం ఆ సాధారణ కేటగిరీ వారికి కూడా పదోన్నతి లభిస్తుంది. దీనిపై వినతులు వెల్లువెత్తాక, ఆ ఉత్తర్వును అధిగమించడం కోసం 2001లో అప్పటి వాజపేయి ప్రభుత్వం 85వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చింది. 16వ అధికరణలోని 4ఏ క్లాజులో వున్న అస్పష్టతను తొలగించడం దీని ఉద్దేశం. కానీ ఆ తర్వాత వివిధ హైకోర్టులు తమ ముందుకొచ్చే కేసుల్లో వివిధ రకాల తీర్పులిస్తూ వచ్చాయి. వాటిని ఎవరైనా సుప్రీంకోర్టులో సవాలు చేసినప్పుడల్లా 'యధాతథ స్థితి' కొనసాగించాలంటూ ఉత్తర్వులివ్వడంతో సమస్యకు తాత్కాలిక ఉపశమనం దొరికేది. 2001లోనూ, అంతకుముందు తీసుకొచ్చిన సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అనుమతిస్తూ 2006లో సుప్రీంకోర్టు ఒక కీలకమైన తీర్పునిచ్చింది. పదోన్నతుల విషయంలో నిదర్శనాపూర్వకమైన గణాంకాలు అందజేస్తే తప్ప కోటాను అమలు చేయడానికి వీల్లేదని చెప్పింది. ఎస్సీ, ఎస్టీల పదోన్నతుల్లో రిజర్వేషన్లు పాటించాలని కేంద్రం రాష్ట్రాలను కోరడం సాధ్యంకాదని తెలిపింది. ఆ తర్వాత 2012లో ఉత్తరాఖండ్‌లో రిజర్వేషన్ల ప్రమేయం లేకుండా అక్కడి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు అది చెల్లదని రాష్ట్ర హైకోర్టు కొట్టేసింది. కానీ సుప్రీంకోర్టు మాత్రం నోటిఫికేషన్ సరైందేనని స్పష్టం చేసింది. 2006లో ఇచ్చిన తీర్పునే పునరుద్ఘాటించింది.


దళిత వర్గాల ప్రయోజనాలకు భంగం కలగనీయరాదన్న సంకల్పం వుంటే భిన్న సందర్భాల్లో వెలువడిన ఈ తీర్పుల్ని ప్రభుత్వాలు శ్రద్ధగా అధ్యయనం చేసి, రాజ్యాంగాన్ని తగువిధంగా సవరించేవి. కానీ అందుకు విరుద్ధంగా అవి మౌనంగా వుండిపోయాయి. తాజాగా వెలువరించిన తీర్పులో పదోన్నతుల్లో కోటా కల్పించవద్దని సుప్రీంకోర్టు చెప్పలేదు. కాకపోతే పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు తగినంత ప్రాతినిధ్యం లభించడంలేదని, ఆ విషయంలో వారికి అన్యాయం జరుగుతున్నదని లేదా అందులోనూ వెనకబాటుతనం తప్పడం లేదని నిరూపించడానికి అవసరమైన సమాచారాన్ని చూపాలని చెప్పింది. కనుక పదోన్నతుల్లో కోటా ప్రాథమిక హక్కుగా మార్చడమో లేక సర్వోన్నత న్యాయస్థానం చెప్పిన విధంగా పకడ్బందీ సమాచారం ఆధారంగా ఆ పదోన్నతులు కల్పించే విధానానికి రూపకల్పన చేయడమో జరగాలి. అంతేతప్ప రాజకీయ ప్రయోజనాలనాశించి పరస్పరారోపణలు చేసుకోవడం కాలహరణమే అవుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి బ.విదియ ఉ.9.34 వరకు, తదుపరి తదియ
నక్షత్రం పుబ్బ సా.6.04 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం రా.12.44
నుంచి 2.14 వరకు, దుర్ముహూర్తం ఉ.8.48 నుంచి 9.33 వరకు
తదుపరి రా.10.57 నుంచి 11.47 వరకు
అమృతఘడియలు... ప.12.01 నుంచి 1.33 వరకు.

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం: 5.56
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# బాబు 'వలస' బంధం 'రాయిటర్స్'




ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'అత్యధిక పాఠకలోకం ఆదరణ పొందడం అందుకు అనుగుణంగా పాఠకులకు అబద్ధాలతో కాకుండా వాస్తవాలతో కూడిన సరైన సమాచారం అందించడమే వార్తా సర్వీసుల (న్యూస్ సర్వీసెస్) లక్ష్యం. వార్తల్ని బట్వాడా చేసే సంస్థలు ఆ వార్తల్ని అందించడంలో తమ సొంత తీర్పుల్ని చొప్పించకూడదు. అది పాటించినప్పుడే ఆ వార్తలను అందించే సర్వీసులు తమపై పాఠకులలో అనుమానాలూ, అస్పష్టతా రేకెత్తకుండా జాగ్రత్త పడగలుగుతాయి. అలా అయితేనే వార్తలు అందించే న్యూస్ సర్వీసుల లక్ష్యానికి తాత్విక పునాది ఉంటుంది. లేదా అది పాఠకులకు స్థూలంగా ఆమోదయోగ్యమైన వార్తగానైనా ఉండాలి'.
– ప్రపంచ వార్తా సర్వీసుల తాత్విక పునాది పట్ల సుప్రసిద్ధ పాత్రికేయ చరిత్రకారుడు జొనాథన్ ఫెన్‌బీ నిర్వచనం.

'ఉభయ భ్రష్టత్వం ఉపరి సన్యాసం' అన్న దశలో పతనావస్థకు చేరుకున్న టీడీపీ నాయకుడు చంద్రబాబు, ప్రస్తుతం పాత వలసపాలన అవశేషాలకు చిహ్నాలుగా మిగిలి ఉన్న కొన్ని విదేశీ న్యూస్ సర్వీసులను ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారానికి వాడుకునే స్థితికి దిగజారిపోయారు. వ్యక్తులు సమాజ సంపదను పోగేసుకోవడానికి స్వేచ్ఛను కాపాడుతున్నది 1935 నాటి బ్రిటిష్ ఇండియా సామ్రాజ్యవాద ప్రభుత్వం రూపొందించిన చట్టం. దాని ఆధారంగా స్వతంత్ర భారత రాజ్యాంగంలో చేరిన 31వ అధికరణ చంద్రబాబు చేతిలో ఇప్పుడు బినామీ ఆస్తుల కేంద్రీకరణకు ఎలా యథేచ్ఛగా దోహదపడుతున్నదీ ఆంధ్రప్రదేశ్ రాజధాని ముసుగులో 'అమరావతి' బినామీ కథలు వినిపిస్తున్నాయి. వీటికి తోడు ఇప్పుడు ఈ బినామీ ఆస్తుల రక్షణలో తాడూ బొంగరంలేని అమరావతి రాజధానికి ముక్కూముఖం ఏర్పరిచే మిష పైన ప్రపంచ వార్తా సర్వీసుగా బ్రిటిష్ ఇండియా నుంచి నేటిదాకా ఉనికిలో ఉన్న రాయిటర్స్ వార్తా సంస్థ సేవలను తన అధికార దాహంకొద్దీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించిన తర్వాత కూడా చంద్రబాబు వాడుకోదలిచారు. స్థానికంగా తన 'ఉంపుడు పత్రికలు'గా తయారైన రెండు తెలుగు దినపత్రికలను తన ప్రభుత్వ పతనం తర్వాత మరింతగా వినియోగించడంతో సంతృప్తిపడని బాబు మరికొన్ని అడ్డదారులు తొక్కడానికి సాహసించారు. ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా అశేష ప్రజాదరణతో, రాష్ట్ర చరిత్రలో అరుదైన అఖండ మెజారిటీతో పరిపాలనా పగ్గాలు అందుకున్న యువనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో సంస్కరణవాద సంక్షేమ పథకాల అమలు జరుగుతుంటే అడుగడుగునా చంద్రబాబు అడ్డుతగలడాన్ని ప్రజలు గమనిస్తున్నారు.

ఈ క్రమంలో తాజా పరిణామం.. అనంతపురం జిల్లాలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో ఒక రూపు తొడిగి భారీ పరిశ్రమగా దక్షిణ కొరియా 'కియా' మోటారుకార్ల యూనిట్ ఎదుగుతూ వేలసంఖ్యలో స్థానికుల ఉపాధి కల్పనకు శరవేగాన ముందడుగు వేస్తోంది. అమరావతి పేరిట రాజధాని నిర్మాణం లేకుండా పేద మధ్యతరగతి ప్రజల భూముల్ని ముందుగానే అన్యాక్రాంతం చేసి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉత్తి చేతులు చూపిన వ్యక్తి బాబు. ఇప్పుడు కియా మోటార్ కార్ల పరిశ్రమ యాజమాన్యానికి దిగులు కలిగించే సరికొత్త ప్రచారానికి బాబు గజ్జె కట్టారు. వైఎస్ జగన్ ప్రభుత్వ విధానాల వల్ల అనంతపురం నుంచి కియా మోటార్ భారీ పరిశ్రమ తమిళనాడుకు తరలిపోతోందన్న నీలివార్తల్ని బాబు, అతని రెండు అనుకూల పత్రికలు వ్యాపింపచేశాయి. రాష్ట్ర ప్రజలు బాబు నీలివార్తల్ని ఎక్కడ నమ్మరోనని భావించి బాబు కొత్త ఎత్తుకు దిగారు. దేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచీ భారతప్రజలను, నాయకుల్ని వంచిస్తూ సామ్రాజ్యవాద పాలనకు అనుకూలంగా, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వ్యతిరేకంగా వార్తలు గుప్పిస్తూ వచ్చినవి– రాయిటర్స్ (బ్రిటన్), ఎ.ఎఫ్.పి. (ఫ్రాన్స్), అసోసియేటెడ్ ప్రెస్ (ఎ.పి. అమెరికా). భారతదేశంలోని పెట్టుబడిదారీ పత్రికలు కొన్ని మినహాయింపులతో వార్తల కోసం ఈ విదేశీ సంస్థలపై ఆది నుంచీ ఆధారపడుతూ మన దేశ పాఠకులకు వార్తలు అందిస్తూ వస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా పెక్కు పత్రికల, నాయకుల బానిస మనస్తత్వమూ, బుద్ధులూ పెద్దగా మారిందేమీ లేదు. పైగా చంద్రబాబు లాంటి 'తిమ్మిని బమ్మిని' చేయగల అక్రమ సంపాదనాపరుల చేతుల్లో 'రాయిటర్స్' లాంటి పెద్ద సంస్థ కూడా ఇరుక్కుపోవడం విశేషం– ఎందుకంటే సర్వత్రా వ్యాపార ధోరణి కావటంవల్ల!

### రెండో మాట




అసలు రాయిటర్స్‌కు, బాబు పాత సర్కారుకు 'లంకె' ఎలా కుదిరింది? బాబు పాలనలో విశాఖ, హైదరాబాద్‌లలో 'డిజిటల్ డెవలప్‌మెంట్' కార్యక్రమాల పథకాన్ని తలపెట్టి ఎన్నికలలో ప్రయోజనాలు పొందే టెక్నాలజీ మతలబుకు అంకురార్పణ జరిగింది. 2018–2019 ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షాన్ని ఎన్నికలలో విజయం సాధించకుండా అడ్డుకోగల నానా అడ్డగోలు ప్రయత్నాలకు పాల్పడిన బాబు వర్గం డిజిటల్ యంత్రాల్ని వినియోగించి దొరికిపోయింది. అలా డిజిటల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఆధారంగా 2017లో రాయిటర్స్ సంస్థకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తూ టీడీపీ నాయకత్వం రెండు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల సారాంశం– డిజిటల్ కంటెంట్స్ మార్పిడి పేరిట, టెండర్లు పిలవకుండానే (ఇతర ప్రపంచ సంస్థలేవీ పోటీకి రాకుండా) చంద్రబాబు హయాంలో ఒక్క రాయిటర్స్‌కే ప్రయోజనం కల్పిస్తూ ఒప్పందం చేసుకుంది. ఇదీ– ఇప్పుడు ఇందుకు ముదరాగా రాయిటర్స్, నేటి వైసీపీ ప్రభుత్వం తలపెట్టిన రాజధాని వికేంద్రీకరణ సహా ఆచరణలోకి తెస్తున్న సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే దిశగా చంద్రబాబు పన్నిన వలలో చిక్కుకుంది. అయితే బాబు రాయిటర్స్ సంస్థ ద్వారా కియా సంస్థ మేనేజ్‌మెంట్‌పైన, జగన్ ప్రభుత్వంపైన వ్యాపింపజేసిన తప్పుడు ప్రచారానికి తాళం పడిపోయింది. అటునుంచి తమిళనాడు ప్రభుత్వమూ ఖండన పరంపర ద్వారా బాబు, రాయిటర్స్ జమిలిగా తలపెట్టిన కుట్రను భగ్నం చేయవలసి వచ్చింది.

విడిపోయిన నూతన ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని కోసం వెతుకులాటలో సుదీర్ఘ పర్యటనానంతరం ఉన్నతస్థాయి కేంద్ర విచారణ సంఘం (శ్రీరామకృష్ణన్ కమిటీ) అన్ని పరిస్థితులను బేరీజు వేసుకుని, మూడు పంటలు పండే అమరావతి ఏరియా మాగాణి సుక్షేత్రాలను పొరపాటున కూడా రాజధాని పేరిట పాడుచేయవద్దని హెచ్చరించింది. అంతేగాదు, అమరావతి ప్రాంతంలో పర్యావరణ ప్రమాణాల దృష్ట్యా తక్కువ లోతునుంచే నీరు ఉబికివచ్చే ప్రమాదం ఉన్నందున, భారీ నిర్మాణాలకు అది అనువైనది కాదని కూడా నివేదికలో హెచ్చరించింది. అయినా ఆ నివేదికను అసెంబ్లీ ఛాయలకు కూడా రానివ్వకుండా, ప్రవేశపెట్టకుండా, చర్చించకుండానే విద్యా వ్యాపారవేత్త చేత రాజధానిగా అమరావతికి అనుకూలంగా నివేదికను గిలిగించి దాంతోనే భూములపైన స్పెక్యులేషన్ వ్యాపారం చేసింది బాబు ప్రభుత్వం. బినామీ భూముల కోసమే అమరావతిని బాబు బలి చేశాడు. అయిదేళ్లయినా అవసరమైన రాజధానిని నిర్మించడంలో విఫలమయ్యారు. ఈ తరుణంలో కేంద్ర పర్యావరణ సాధికార సంస్థ, నిర్ణయాధికార సంస్థ రాజధానిగా అమరావతి నిర్మాణం తగదని సూచనప్రాయంగానూ, లిఖితపూర్వకంగానూ స్పష్టంగా హెచ్చరించినా బాబు పెడచెవిన పెట్టడానికి కారణం– కేవలం బినామీ ఆస్తుల్ని పోగేసుకోవడానికేనని తరువాతి పరిణామాలు రుజువు చేశాయి.

ఇదే సమయంలో మన కోస్తాలో మాదిరే తీర ప్రాంతాల పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భారీ అక్రమ కట్టడాలను కూల్చివేయాలని 2019 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశిస్తూ అందుకు 138 రోజుల వ్యవధినిస్తూ తీర్పు చెప్పవలసి వచ్చిందని మరచిపోరాదు. ఆ కారణంగానే కేరళలోని మరడు ప్రాంతంలో నిర్మించిన భవంతులను క్షణాలలో కూల్చివేయించిన ఘటననూ మనం మరవరాదు. ఈ సాధికారికమైన హెచ్చరికలను సహితం ఖాతరు చేయకుండా, ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా వికేంద్రీకరణను ఇప్పటికీ బాబు మొండిగా వ్యతిరేకించడమంటే నదిలో మునిగిపోతున్నవాడు ఆఖరి ప్రయత్నంగా 'గడ్డిపోచ'ను పట్టుకుని బయటపడదామన్న వృథా తాపత్రయమే అవుతుంది.

భారతదేశంలోని అరడజను రాష్ట్రాలు, ప్రపంచంలో పన్నెండు దేశాలు– పరిపాలనా విభాగాలుగా, శాసన వేదికలుగా, న్యాయస్థాన కేంద్రాలుగా రెండేసి, మూడేసి రాష్ట్రాలలో వేర్వేరుగా ఏర్పరచుకుని పాలనా సౌలభ్యాన్ని, ప్రాంతాల మధ్య అసమానతలను క్రమంగా తొలగిస్తూ అభివృద్ధినీ సాధించాయి. ఈ దేశీయ, అంతర్జాతీయ పాఠాల నుంచే జగన్ ప్రభుత్వం పాలనా, ప్రాంతీయ స్థాయి అభివృద్ధికి అనుగుణంగా వికేంద్రీకరణ పథకాన్ని తలపెట్టడం ఒక ప్రయోగంగా వినూత్నమేగాదు, అవశ్యం, అవసరం కూడా అని మరవరాదు. గత చరిత్రను తవ్విచూసుకున్నా– శాతవాహనుల కాలం నుంచి కాకతీయుల దాకా కోటి లింగాల, బోధన్‌ల నుంచి అమరావతి వరకూ, రెండేసి, మూడేసి రాజధానులను పాలనా కేంద్రాలుగా మలచుకున్న వారే. అంతేగాదు, పల్లవులు, విష్ణుకుండినులు కూడా పాలనా సౌలభ్యం కోసం రెండేసి, మూడేసి ప్రాంతాలలో రాజధానులు నిర్వహించారు. ఆంధ్రుల చరిత్రలో విష్ణుకుండినుల పాలకులకు వేములవాడ, నాగార్జునకొండ రాజధానులుగా ఉండేవని కొందరు చారిత్రికుల భావన. నాడూ, నేడూ, ఏనాటికైనా పాలన ఎక్కడినుంచి సాగిందని కాదు, ఎంత మంచిగా ప్రజానురంజకంగా ఎంతకాలం సాగిందన్నదే ప్రజల జ్ఞాపకంలో ఉండేదీ, లెక్కల్లో నిలిచేదీ!!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### సర్దార్



"న్యూఢిల్లీలోని షహీన్ బాగ్ దగ్గర సీఏఏ తదితర కేంద్ర ప్రభుత్వ నిరంకుశ చట్టాలకు, విధానాలకు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొంటున్న ముస్లిం మహిళలకు నిరంతరం ఉచిత ఆహారం అందించడానికి డీఎస్ బాంద్రా అనే వ్యక్తి తన సొంత ఫ్లాట్‌ను అమ్మేసుకున్నాడట. సమాజ సేవకు కంకణం కట్టుకున్న సర్దార్‌లను మించిన మరో సమూహం ఎక్కడా ఉండదేమో. చాలా ఆశ్చర్యం వేస్తుంది. మీరు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారిపై పూర్తిగా విశ్వాసం ఉంచొచ్చు. ఎంత మాత్రం వీలున్నా మీకు సహాయం చేయడానికి వాళ్లు ముందుంటారు"

– శంకర్ శర్మ, వ్యాపారవేత్త

### హిందూయిజం



"మీరు విమానంలో ఒకరిని ఎగతాళిచేస్తే మంత్రులు పళ్లు పటపట కొరుకుతారు. చర్య తీసుకోవాలని హుంకరిస్తారు. కానీ, కొంతమంది మగ దుండగులు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తుంటే వారు నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుంటూ ఉండిపోతారు. ఇదేనా హిందూయిజాన్ని కాపాడటం అంటే?"

– దేవ్‌దత్ పట్నాయిక్, కాలమిస్ట్

### ఇంటర్వ్యూ



"మీరు యూపీఎస్సీ ఇంటర్వ్యూకు వెళుతుంటే మీకు తెలిసినదంతా చెప్పాల్సిన అవసరం లేదనే విషయం దృష్టిలో పెట్టుకోండి. ఖచ్చితంగా ఉండండి. ఏది అడిగారో దానికి మాత్రమే సమాధానం చెప్పండి. కొన్నిసార్లు అవతలివారి ముందు మన జ్ఞానాన్ని ప్రదర్శించాలనుకుంటాం కదా. అది అవసరం లేదు"

– ప్రవీణ్ కశ్వాన్, ఐఎఫ్ఎస్

### దాడులు



"అంతర్జాతీయ ఉగ్రవాద ముఠాలు ఆర్ఎస్ఎస్ కార్యాలయాలు, నాయకులపై దాడులు జరపడానికి యత్నిస్తున్నట్టు ఇంటెలిజెన్స్ నివేదికలను బట్టి తెలుస్తోంది. భారత సైన్యం దేశానికి కాపలా కాస్తోంది. అందుకే ఉగ్రవాదులు వారిపై దాడి చేస్తారు. ఆర్ఎస్ఎస్ కూడా సైన్యంలాగే దేశానికి రక్షణగా నిలుస్తోందని ఉగ్రవాదులకు అర్థమైంది. అందుకే వారు ఆర్ఎస్ఎస్ నేతలపై దాడులకు కుట్రపన్నుతున్నారు"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### నిరసన



"జామియా యూనివర్సిటీ దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. విద్యార్థులు దూసుకు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుఖ్‌దేవ్ విహార్ మెట్రోస్టేషన్, హోలీ ఫ్యామిలీ ఆసుపత్రి దగ్గర కూడా పోలీసులు మోహరించారు. అయినా, విద్యార్థులు నిరసన తెలుపుతూనే ఉన్నారు. కొంతమంది విద్యార్థులను అదుపులోకి తీసుకుని బాదర్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు"

– జెబావర్సీ, జర్నలిస్ట్

### సస్పెన్షన్



"ఫీజులు పెంచడాన్ని నిరసిస్తూ ఆందోళన చేసిన విద్యార్థులను ఐఐఎంసీ సస్పెండ్ చేయడం సిగ్గుచేటు. విద్యార్థుల గొంతు నొక్కడం అధికారంలో ఉన్నవారికి సాధారణ విషయంగా మారిపోతోందా? జామియాలో దురాగతాలు, గార్గిలో వేధింపులు, ఇప్పుడు ఇది"

– వరుణ్ చౌదరి, ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి

# దీన్‌దయాళ్ అడుగుజాడలు అనుసరణీయం

సందర్భం



పురిఘళ్ల రఘురాం

కొందరు మరణించేవరకు జీవిస్తారు. కొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారు. రెండవ కోవకు చెందిన వారు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ. ఉత్తరప్రదేశ్‌లోని మొగల్ సరాయ్ రైల్వే స్టేషన్‌లో ఒక గుర్తు తెలియని మృతదేహం రైలు పట్టాలపై ఉంది. పోలీసులు ఆయన పెట్టెలోని వస్తువులను బట్టి అందులో సంఘ్ నిక్కరుని చూసి గుర్తుపట్టారు తాను జనసంఘ్ వ్యవస్థాపకులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని. నిత్యం ఉదయం సంఘ ప్రార్థన, రాత్రి పడుకునే ముందు సంఘ ప్రతిజ్ఞను మననం చేసుకొని జీవించేవారు. ప్రార్థన, ప్రతిజ్ఞ రెండు కళ్లు అని సంఘ్ ప్రచారకులు భావిస్తారు. అలా ఆచరణలో భాగంగానే ఎప్పటిలానే రెండు జతల బట్టలతో పాటు సంఘ్ నిక్కరును తన పెట్టెలో పెట్టుకుని బయలుదేరారు. ఆ సంఘ్ నిక్కర్ వలననే అసామాన్యమైన ఆ వ్యక్తిని గుర్తు పట్టగలిగారు.

భారతీయ జనసంఘ్ స్థాపనకు ముందు జరిగిన అఖిలపక్ష సమావేశంలో జనసంఘ్‌కు సిద్ధాంతాలు లేవు అన్న వారి నోళ్ళు మూయించడానికి ఏకాత్మతా మానవతావాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడి ఉన్న మానవుడు జీవితంలో సుఖంగా వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవ సేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించారు. కేవలం భారతీయులను ఉద్దేశించి మాత్రమే కాకుండా విశ్వమానవాళిని దృష్టిలో పెట్టుకుని చెప్పిన సిద్ధాంతం ఏకాత్మతా మానవతావాదం. వ్యక్తి శీలం గొప్పది, సమాజ శీలం ఇంకా గొప్పది అని ఆయన చెప్పేవారు.

జాతి, జాతీయత, భారతీయ సంస్కృతి, ధర్మం వంటి విషయాలపై తన అభిప్రాయాలు, మౌలిక సిద్ధాంతాలు తదితరాలపై ఆయన రచనా వ్యాసంగం కొనసాగింది. ఆనాడు దేశవ్యాప్తంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాని నెహ్రూ అనుసరిస్తున్న ముస్లిం సంతుష్టీకరణ, హిందూ ధర్మ వ్యతిరేక విధానాలను ఎదుర్కొనడానికి భారతీయ సంస్కృతి సభ్యులతో, జాతీయ భావాలతో కూడుకున్న రాజకీయ పార్టీని స్థాపించాలనే ఉద్దేశంతో ఆనాటి ఆరెస్సెస్ సర్ సంఘ చాలకులు పూజ్య గురూజీ సహాయం అర్థించగా ఆ పనిని వారికే అప్పగించారు. అలా పురుడు పోసుకున్నది భారతీయ జనసంఘ్. ఆదర్శవంతమైన వ్యక్తిత్వం నిరాడంబర జీవితాన్ని గడుపుతున్న వారికి తోడుగా అప్పటికే యువకులుగా పనిచేస్తున్న అటల్ బిహారీ వాజ్‌పేయి, సుందర్ సింగ్ భండారి, జగన్నాథరావు గార్లను వారికి అప్పగించారు. ప్రేరణనిచ్చే ఆదర్శ మహాపురుషులలో పండిత దీన్‌ద యాళ్‌జీ ఒకరు. మహా పురుషుడు అని ఆయన విరోధులు కూడా అనేవారు. ఆనాడు ప్రజా సోషలిస్టు పార్టీ నాయకులు నాదపాయ్ గాంధీ, దీన్‌దయాళ్‌ను తిలక్, బోసుల పరంపరలో ఒకరిగా అభివర్ణించారు. ఆనాటి కమ్యూనిస్టు నాయకులు హీరేన్ గారు అజాత శత్రువుగా పేర్కొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ యువకుడిగా ఉన్నప్పుడే వ్యక్తి, సమాజం, స్వదేశీ, స్వధర్మం, పరంపర, సంస్కృతి లాంటి విషయాలపై ఆకర్షితులయ్యారు. వీటిపై లోతుగా అధ్యయనం చేశారు కూడా. భారతీయ జనసంఘం వ్యవస్థాపకులు వారే అయినప్పటికీ 1951లో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల నుండి బయటకు వచ్చిన డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. జాతీయ ఉపాధ్యక్షులుగా 1967 వరకు దీన్‌దయాళ్‌జీ బాధ్యతలు నిర్వహించారు. డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణం తరువాత జాతీయ అధ్యక్షులుగా పార్టీ పనిని తన భుజాలపై వేసుకుని నడిపించారు. జాతి సమగ్ర ఉన్నతిని సాధించడంలో సమర్థంకాగల ఒక రాజనీతి సిద్ధాంతాన్ని వికసింపచేయాలని కోరుకునేవారు. అదే ఏకాత్మతా మానవతావాదం.



నేడు పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి

ఈ అంశంపై తొలిసారిగా 1964 గ్వాలియర్ మహాసభలో చర్చకు ప్రతిపాదించారు. ఆ తర్వాత 1965లో విజయవాడలో జరిగిన జనసంఘ్ మహాసభలలో ఇది ఆమోదం పొందింది. అదే ఏడాది పుణేలో 4 రోజుల పాటు జరిగిన ఉపన్యాస మాలలో విస్తృతమైన వివరణ ఇచ్చారు. సంపదను ఒకేచోట కేంద్రీకృతం చేయకూడదు అన్నారు దీన్‌దయాళ్‌జీ. ఏకాత్మక రాజ్యం అంటే సంపూర్ణమైన శక్తి లేదా అధికారాల కేంద్రీకరణ కాదు. ఏకాత్మక రాజ్యం అంటే కేంద్రీకృత నిరంకుశత్వం కాదు. అలాగే ప్రాంతాలను పరిసమాప్తం చేయాలని కూడా దాని అర్థం కాదు. ప్రాంతాలకు అధికారాలు ఉండాలి. ఈ ప్రాంతాల కింద మిగిలిన సంస్థలు, జిల్లాలు ఉంటాయి వాటికి కూడా అధికారాలు ఉంటాయి అదేవిధంగా పంచాయతీలు కూడా. ఈవిధంగా అధికార వికేంద్రీకరణ జరిగినప్పుడు శక్తి కింద వరకు విస్తరిస్తుంది. ఈ మాదిరిగా అనేక శక్తి స్థానాలు ఏర్పడి వీటన్నిటి కేంద్రంగా ఏకాత్మక రాజ్యం ఉంటుంది. అది మన ధర్మానికి అనుగుణం కాగలదు. వసతులు, రవాణా వ్యవస్థలు, సామాజిక వ్యవస్థలు ఇప్పటిలాగా లేకపోయినా జనసంఘ్ విస్తరణలో నిష్ణాతులైన కార్యకర్తలను దేశానికి అందించడంలో ఆయన కార్యదీక్ష ఎనలేనిది.

అతి సామాన్య కుటుంబంలో 1916 సెప్టెంబర్ 25న జన్మించిన దీన్‌దయాళ్‌జీ అసామాన్య వ్యక్తిగా ఎదిగారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో మేనమామ ఇంట్లోనే పెరిగారు. 1925 ప్రాథమిక విద్యకు శ్రీకారం చుట్టిన కాన్పూర్‌లో ఉన్నప్పుడు ఆర్ఎస్ఎస్‌తో పరిచయం ఏర్పడింది. సంఘంలో పనిచేస్తూనే బీఏ డిగ్రీ, ఉపాధ్యాయ శిక్షణ, ఎంఏ ప్రథమ సంవత్సరం పూర్తి చేశారు. సంఘ కార్య విస్తరణ కోసం చదువుకు స్వస్తి పలికి ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ ప్రాంతానికి ప్రచారకులుగా వెళ్లి కొన్ని సంవత్సరాలకే సంఘ కార్యాన్ని, విస్తరణను వికసింపచేశారు. తరువాత సహ ప్రాంత ప్రచారకర్తగా నియమితులయ్యారు. గాంధీ హత్యానంతరం హిందూ మహాసభతోపాటు ఆర్ఎస్ఎస్‌ను ప్రభుత్వం నిషేధించింది. ఆ సమయంలో ఉత్తరప్రదేశ్‌లో గణనీయమైన పాత్ర పోషించారు దీన్‌దయాళ్‌జీ. మరోపక్క ఆర్ఎస్ఎస్ వార పత్రిక అయిన 'పాంచజన్య', లక్నో దినపత్రిక 'స్వదేశ'లకు దీన్‌దయాళ్‌జీ సంపాదకులుగా ఉన్నారు. నేడు కొత్తగా భారతీయ జనతా పార్టీలోకి చేరిన, చేరుతున్నటువంటి ప్రతి ఒక్కరూ పండిట్ దీన్‌దయాళ్‌జీ చరిత్రను చదివి అభ్యసించి తెలుసుకుని పరి పూర్ణమైనటువంటి బీజేపీ కార్యకర్తగా ఎదగాలి. ఇప్పుడు బీజేపీలో పని చేస్తున్నటువంటి అనేకమంది నాయకులు, కార్యకర్తలు పండిత దీన్‌దయాళ్ అడుగుజాడల్లో నడవడమే ఆయనకు నిజమైన నివాళి.

వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త, అధికార ప్రతినిధి
ఈ–మెయిల్ : raghuram.bjp@gmail.com

# ఆశలకు హద్దులు

ఈ ప్రపంచంలో మనం పాపాత్ములుగా ఉండడానికి ఇష్టపడం. కానీ పాపకార్యాలు చేయడానికి ఏమాత్రం ఆలోచించం. తెలిసి కొన్ని, తెలియక కొన్ని చేస్తుంటాం. మనమందరం పుణ్యం వల్ల కలిగే ప్రయోజనాలను ఆశిస్తాం. తెగ ఇష్టపడతాం. కానీ పుణ్యకార్యాలు చేయం. ఒకటీ అరా చేసినా వాటి గురించి పది మందితో చెప్పుకుంటాం. ఆ పని నేనే చేశాను, ఈ పని నేనే చేశాను అని చెప్పుకుని మెప్పు పొందడానికి ఆసక్తి చూపుతాం. ''పాపాలను ఎవరూ కోరి కోరి చేయరు. కానీ కృష్ణా, అతనిని ఏదో ఒకటి పాపం చేయడానికి బలవంతంగా రెచ్చగొడుతుంటుంది కదా, అది ఏమిటీ'' అని అర్జునుడు ఓమారు పరమాత్మను అడిగాడు. 'అదే అర్జునా, ఆశ. ఆశే అన్ని పనులూ చేయిస్తుంటుంది' అన్నాడు కృష్ణభగవానుడు.

ఆశతో ఏదో ఒకటి పొందాలనుకుంటాం. దానిని ఎలాగైనాసరే పొందడం కోసం ధర్మాధర్మాల సంగతి ఆలోచించం. అనుకున్న ఆ ఆశ నెరవేరితే దానితో తృప్తి పొందుతామా.. లేదు. అక్కడితో ఆగం. ఓ ఆశ తీరిన వెంటనే మనసులో మరొక ఆశ పుట్టుకొస్తుంది. ఆశ నెరవేరకపోవడమే మంచిదనుకుందామా అంటే అదీనూ కాదు. ఆశ నెరవేరకుంటే మనకు ఆవేశం వస్తుంది. మనలో అహం పెరిగిపోతుంది. అనుకున్నది ఎందుకు జరగలేదని ఉగ్రరూపం దాలుస్తాం. నెరవేరని ఆశ మనలో కోపావేశాలు పెంచి పాపంలోకి నెడుతుంది. ఆశ తర్వాతి అంశం క్రోధమనే కృష్ణభగవానుడు భగవద్గీతలో చెప్పాడు. అది కూడా ఆశ వల్ల కలిగిన పరిణామమే. అలాగైతే పాపం చెయ్యకుండా ఉండటానికి ఉన్న ఏకైక మార్గం.. ఆశలను వదులుకోవడమే.



జ్యోతిర్మయం

సాధారణంగా మనం స్వీయ ఆశలకోసం పనులు చేస్తుంటాం. ఈ స్థితిని మార్చి మనకు లౌకికమైన లాభాలు ఇవ్వని పనులు చేయాలి. లోకోపకారంతోపాటు మనకు ఆత్మార్థంగా ఫలితాన్నిచ్చే కార్యాలు చేయాలి. ఇటువంటి కార్యాలకు మనల్ని మనం అంకితం చేసుకుంటే ఆశలు క్రమంగా తగ్గుతాయి. పాపాలూ తగ్గుతూ వస్తాయి. పుణ్యం పెరుగుతుంది. అంటే ఇప్పుడిక మనం ఆశలంటని కార్యాలు చేయడాన్ని అలవాటు చేసుకోవాలి. ఆశ అనేది లేకుండా చేయడమే పుణ్యకార్యం. మనసు అనేది భగవంతుడు ఉండే చోటు. దాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ధ్యానం చేయాలి. సత్కార్యాలు చేయాలి. పాపపు పనులకు దూరంగా ఉండాలి.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 11-2-2020

ఆస్కార్ 2020

ప్రపంచ సినిమాల తీర్థస్థలి - ఆస్కార్ వేడుకలో- ఈసారి మన గాలి వీచింది. మన ఖండపు దేశానికి అభిషేకం జరిగింది. హాలీవుడ్ పండితులు దక్షిణ కొరియా సినిమా 'పారసైట్'కు మరో మాట లేనట్టుగా టెంకాయ్ కొట్టి దండం పెట్టారు. నాలుగు అవార్డులు సమర్పించుకున్నారు. హాలీవుడ్ పెత్తనాన్ని కొరియన్ సినిమా ఓడించిన సందర్భం ఇది. కొరియా భాష గెలిచిన సన్నివేశం ఇది. నిజంగా ఇది ఆసియావాసుల గెలుపు. మన గెలుపు.

# కొరియోత్సవం


● ఒక్విన్ ఫీనిక్స్
● రెనీజెల్ వెగర్



● 'పారసైట్' సినిమాలో ఓ దృశ్యం



● బాంగ్ జూన్ హూ

## మళ్లీ దక్కింది

**ఉత్తమ నటి: రెనీజెల్ వెగర్**

ఒక్విన్ ఫీనిక్స్ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకుంటారని అందరూ ఊహించినట్టే ఉత్తమ నటిగా రెనీజెల్ వెగర్ గెలుస్తారని కూడా ఊహించారు. ఆస్కార్‌కు ముందు జరిగిన 'బాఫ్తా, గోల్డెన్ గ్లోబ్స్, క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్స్, ఎస్ఏజీ (స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్) ల్లో 'జూడి' చిత్రానికిగాను అవార్డును అందుకున్నారు రెనీజెల్ వెగర్. హాలీవుడ్ ఐకాన్ జూడి గార్లాండ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'జూడి'. జూడి పాత్రను పోషించినందుకుగాను నటి రెనీజెల్ వెగర్ ఆస్కార్‌ను అందుకున్నారు. ఈ అవార్డును అందుకుంటూ తనకు స్ఫూర్తిగా నిలిచిన హీరోలందర్నీ గుర్తు చేసుకున్నారు రెనీజెల్. "జూడి గార్లాండ్ ఆస్కార్‌ను అందుకోలేకపోయారు. ఆమె వారసత్వాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికే ఈ అవార్డు లభించిందని అనుకుంటున్నాను. మనకు స్ఫూర్తిగా నిలిచిన హీరోలే మనలోని అత్యుత్తమ ప్రతిభను బయటకు తీసుకురాగలరు. మనల్ని ఏకం చేయగలరు" అన్నారు రెనీజెల్. ఆమెకు ఇది రెండో ఆస్కార్. గతంలో 'కోల్డ్ మౌంటేన్' చిత్రానికి సహాయ నటిగా అవార్డు అందుకున్నారు.

'తలచినదే జరిగినదా? జరిగేదే తలచితిమా?' అని పాడుతున్నారు ఆస్కార్ అవార్డులను తీక్షణంగా అనుసరించేవాళ్లు. అవును.. ఈ ఏడాది ఆస్కార్‌లో ఆశ్చర్యాలు పెద్దగా లేవు. అన్నీ అనుకున్నట్టుగానే జరిగాయి. గెలుస్తారు అనుకున్న విజేతల పేర్లే ప్రకటించబడ్డాయి. 'పారసైట్' హవా ఉంటుంది అనుకున్నారు. అదే జరిగింది. ఉత్తమ నటుడిగా ఒక్విన్ ఫీనిక్స్ స్పీచ్ వినబోతున్నాం అనుకున్నారు. అలాగే అయింది. ఇలా ఆస్కార్ వేడుక జరగక ముందు జరిగిన చర్చల్లో ఊహించినవి ఊహించినట్టే ఎక్కువ శాతం జరగడం ఓ విశేషం. మరి విషయానికి వస్తే... 92వ అకాడమీ అవార్డుల వేడుక ఆదివారం సాయంత్రం లాస్ ఏంజెల్స్, కాలిఫోర్నియాలోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరిగింది. గత ఏడాది జరిగిన 91వ ఆస్కార్ వేడుకలానే ఈసారి కూడా వ్యాఖ్యాత లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది అత్యధికంగా 11 నామినేషన్లు దక్కించుకున్న 'జోకర్' కేవలం రెండు అవార్డులతో సరిపెట్టుకుంది. 'ది ఐరిష్ మేన్', '1917', 'వన్సపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్' సినిమాలు ఒక్కోటి పది నామినేషన్లు చొప్పున దక్కించుకుంటే '1917' మూడు అవార్డులు, 'వన్సపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్' రెండు అవార్డులు, 'ది ఐరిష్ మేన్' ఒక్క అవార్డు గెలుచుకున్నాయి. ఆరు విభాగాల్లో నామినేషన్లు పొందిన 'పారసైట్' ఈ ఏడాది అత్యధికంగా నాలుగు అవార్డులు గెలుపొందింది. ఇంగ్లిష్‌లో తెరకెక్కించని ఒక సినిమాకు 'ఉత్తమ చిత్రం' అవార్డు రావడం 92 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో మొదటిసారి జరిగింది. ఆ విధంగా 'పారసైట్' చరిత్ర సృష్టించింది. అంతేకాదు.. సౌత్ కొరియాకి తొలి ఆస్కార్ తీసుకెళ్లిన ఘనత కూడా ఈ సినిమాదే.


● బ్రాడ్ పిట్
● రోజర్ డీకిన్స్
● లారా డెర్న్

ఉత్తమ సహాయనటిగా తొలిసారి ఆస్కార్ అవార్డును అందుకున్నారు లారా డెర్న్. నెట్‌ఫ్లిక్స్ నిర్మించిన 'మ్యారేజ్ స్టోరీ' సినిమాలో కీలక పాత్ర చేశారామె. ఆస్కార్ అవార్డు ఆమెకు బర్త్‌డే గిఫ్ట్‌గా మారింది. లారా ఫిబ్రవరి 10న జన్మించారు. ఆస్కార్ వేడుక ఫిబ్రవరి 9న జరిగింది. "బర్త్‌డే వేడుకలు కొంచెం ముందస్తుగా మొదలయ్యాయి" అని పేర్కొన్నారు లారా తోటి నటులు. ఉత్తమ సహాయ నటుడిగా బ్రాడ్ పిట్ తన తొలి ఆస్కార్ అందు కున్నారు. ఉత్తమ సినిమాటోగ్రాఫర్‌గా '1917' చిత్రానికిగాను రోజర్ డీకిన్స్ అవార్డు అందుకున్నారు. 'బ్లేడ్ రన్నర్ 2049' (2017) చిత్రానికి ఆయన తొలి ఆస్కార్ దక్కించుకున్నారు.

## విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం:
**పారసైట్**
ఉత్తమ నటుడు:
**ఒక్విన్ ఫీనిక్స్** (జోకర్)
ఉత్తమ నటి:
**రెనీజెల్ వెగర్** (జూడి)
ఉత్తమ సహాయ నటుడు:
**బ్రాడ్ పిట్** (వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్)
ఉత్తమ సహాయనటి:
**లారా డెర్న్** (మ్యారేజ్ స్టోరీ)
ఉత్తమ దర్శకుడు:
**బాంగ్ జూన్ హూ** (పారసైట్)
ఉత్తమ సంగీతం:
**హిల్డర్** (జోకర్)
బెస్ట్‌మ్యూజిక్ ఒరిజినల్ సాంగ్:
**ఐయామ్ గాన్నా లవ్ మీ ఎగైన్** (రాకెట్ మ్యాన్)
ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్:
**పారసైట్**
మేకప్ అండ్ హెయిర్ స్టైలిస్ట్:
**బాంబ్ షెల్**
ఉత్తమ డాక్యుమెంటరీ:
**అమెరికన్ ఫ్యాక్టరీ**
బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే:
**టైకా వైటిటి** (జోజో ర్యాబిట్)
బెస్ట్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్:
**టాయ్‌స్టోరీ 4**
బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్:
**ది నైబర్స్ విండో**
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే:
**బాంగ్ జూన్** (పారసైట్)
ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్:
**లెర్నింగ్ టు స్కేర్‌బోర్డ్ ఇన్ ఏ వార్ జోన్** (ఇఫ్ యు ఆర్ ఏ గర్ల్)
బెస్ట్ యానిమేటెడ్ షార్ట్:
**హెయిర్ లవ్**
బెస్ట్ ఫిల్మ్ ఎడిటింగ్:
**ఫోర్డ్ వర్సెస్ ఫెరారీ**
బెస్ట్ సౌండ్ మిక్సింగ్:
**1917**
బెస్ట్ సినిమాటోగ్రఫీ:
**1917**
బెస్ట్ సౌండ్ ఎడిటింగ్:
**ఫోర్డ్ వర్సెస్ ఫెరారీ**
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్:
**వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్**
బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ :
**ది నైబర్స్ విండో**
బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్
**లిటిల్ ఉమెన్**

## సాహో బాంగ్ జూన్ హూ

**ఉత్తమ దర్శకుడు: బాంగ్ జూన్ హూ**

ఒక కల నెరవేరింది. చరిత్ర సృష్టింపబడింది. ఆస్కార్ అవార్డు కోసం కొరియా ప్రయత్నం ఫలించింది. ఆస్కార్ నుంచి ప్రశంసగా చిన్న జల్లు కోరుకుంటే జడివానే కురిపించింది. ఇటీవలే కొరియన్ సినిమా నూరేళ్ల వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకుంది. ఎన్నో ప్రపంచ స్థాయి సినిమాలను, ప్రపంచ స్థాయి ప్రతిభను ఇంతకాలంగా ప్రదర్శిస్తూనే ఉంది. అయినప్పటికీ కొరియన్ కళామతల్లికి నైవేద్యంగా పెట్టడానికి ఆస్కార్ లేకుండా పోయింది. ఆ దేశపు దర్శకులు పార్క్ చాన్ ఊక్, జాంగ్ హూన్, కిమ్ జీ ఊన్, లీ జూ-ఇక్ ఆస్కార్ తీసుకొస్తారనుకున్నా గతంలో నిరాశే మిగిలింది. కానీ ఆ లోటుని బాంగ్ జూన్ హూ తీర్చేశారు. ప్రస్తుతం కొరియా అంతా బాంగ్ జూన్ హూను 'సాహో' అని కీర్తిస్తోంది. ఆయన స్వీయదర్శకత్వంలో నిర్మించిన 'పారసైట్' చిత్రం ఈ ఏడాది నాలుగు ఆస్కార్లను గెలుచుకుంది. మొత్తం 6 విభాగాల్లో (ఉత్తమ చిత్రం, విదేశీ చిత్రం, దర్శకుడు, ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ప్రొడక్షన్ డిజైన్, ఎడిటింగ్) నామినేషన్ దక్కించుకున్న ఈ చిత్రం 4 అవార్డులు (ఉత్తమ చిత్రం, దర్శకుడు, విదేశీ చిత్రం, స్క్రీన్‌ప్లే విభాగల్లో) కైవసం చేసుకుంది.

సుమారు 50 మిలియన్ల జనాభా ఉండే దేశం సౌత్ కొరియా. విస్తీర్ణంలో చూసుకుంటే చాలా చిన్నది. ఇరుకైనది. చోటు కోసమే అందరి పోటీ అంతా. నీకు మరింత చోటు కావాలంటే మరింత ధనికుడివై ఉండాలన్నది అక్కడి సిద్ధాంతం. సినిమా ఎప్పుడూ సమాజానికి అద్దమే అంటారు. అవును.. 'పారసైట్' కూడా అద్దమే. కొరియన్‌లో తయారైన అద్దం. కొరియాలో జరుగుతున్న వర్గ వివక్షను చూపెట్టిన అద్దం. 'పారసైట్'లో కిమ్ కుటుంబం చాలా పేదది. ఆకలి తీర్చుకోవడానికి కూడా ఇబ్బంది పడేంత. మరోవైపు పార్క్ కుటుంబం చాలా డబ్బున్నది. అవసరమైన ప్రతీ పనికి పనివాళ్లను నియమించుకునేంత. చాలా తెలివిగా పార్క్ ఫ్యామిలీలోకి ప్రవేశిస్తారు కిమ్ కుటుంబ సభ్యులు. ఆ తర్వాత జరిగే కథాంశమే 'పారసైట్'. రెండు భిన్న జాతులకు చెందిన జీవుల మధ్య సావాసం ఏర్పడినప్పుడు, ఒక జీవి రెండోదానికి నష్టం కలిగిస్తూ లాభం పొందుతూ జీవిస్తుంది. లాభం పొందే దాన్నే పరాన్న జీవి (పారసైట్) అంటారు. క్లుప్తంగా కథనంతా టైటిల్‌లోనే చెప్పారు దర్శకుడు బాంగ్ జూన్ హూ. "కొరియా పరిస్థితులను ఆధారం చేసుకుని తయారు చేసిన కథ ఇది. కానీ ప్రపంచవ్యాప్తంగా అందరూ కనెక్ట్ అవుతున్నారు. అంటే ఇది కేవలం కొరియన్ సమస్య కాదు ప్రపంచంలో అందరూ ఎదుర్కొంటున్న సమస్య" అంటారు బాంగ్. ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నాక "ఉత్తమ విదేశీ చిత్రానికి అవార్డు అందుకున్నప్పుడే ఈసారికి మన కోటా అయిపోయిందిలే అనుకున్నాను. కానీ థ్యాంక్యూ. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, స్క్రీన్‌ప్లేకి అవార్డులు వచ్చాయి. నేను సినిమా గురించి నేర్చుకుంటున్న సమయంలో 'మన పని ఎంత వ్యక్తిగతమైనది అయితే అంత సృజనాత్మకంగా ఉంటుంది' అని మార్టిన్ స్కోర్సీస్ చెప్పిన మాటలు నాలో ఉండిపోయాయి. నేను మార్టిన్ సినిమాల ద్వారా చాలా నేర్చుకున్నా. గెలవడం సంగతి పక్కన పెట్టండి, ఆయనతో కలిసి నామినేషన్ పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఒకవేళ అకాడమీ వాళ్లు అనుమతి ఇస్తే ఈ అవార్డుని ఐదు భాగాలు చేసి ఈ విభాగంలో (దర్శకులు) నామినేట్ అయిన అందరికీ వాటా ఇవ్వాలనుకుంటున్నాను. ఈ రాత్రంతా తాగుతూనే కూర్చుంటాను" అని ప్రసంగాన్ని ముగించారు బాంగ్.



## ఒబామాకి ఆస్కార్

బరాక్ ఒబామా, ఆయన భార్య మిచెల్లీ ఒబామా నిర్మాణ సంస్థలో రూపొందిన 'అమెరికన్ ఫ్యాక్టరీ' ఉత్తమ డాక్యుమెంటరీగా అవార్డు గెలుచుకుంది. వాళ్ల నిర్మాణ సంస్థ 'హయ్యర్ గ్రౌండ్' నిర్మించిన తొలి డాక్యుమెంటరీ ఇది. "ఉత్తమ కథలన్నీ చాలా తక్కువ సందర్భాల్లోనే శుభ్రంగా, పర్ఫెక్ట్‌గా ఉంటాయి. నిజాలన్నీ అలాంటి కథల్లోనే దాగుంటాయి" అని ట్వీట్ చేశారు ఒబామా. ఈ అవార్డు ఫంక్షన్‌కి ఒబామా హాజరు కాకపోవడంతో ఈ సినిమా కో డైరెక్టర్ అవార్డును అందుకున్నారు.

## జోకర్ బన్ గయా హీరో

**ఉత్తమ నటుడు: ఒక్విన్ ఫీనిక్స్**

'ప్రతిభకు పట్టాభిషేకం జరగడం ఆలస్యం అవుతుందేమో కానీ జరక్కుండా మాత్రం ఉండదు'... ఉత్తమ నటుడిగా ఒక్విన్ ఫీనిక్స్ పేరుని ప్రకటించినప్పుడు ఎంతో మంది అనుకున్న మాట ఇది. గతంలో 'ది మాస్టర్', 'వాక్ ది లైన్', 'గ్లాడియేటర్' చిత్రాలకుగానూ ఉత్తమ నటుడిగా నామినేట్ అయ్యారు ఒక్విన్. ఆస్కార్ తనదే అని ఆశగా ఎదురుచూశారు. నిరాశే ఎదురయింది. ఈసారి మాత్రం ఉత్తమ నటుడు ఒక్విన్ ఫీనిక్సే అని ముక్తకంఠంతో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కారణం 'జోకర్'గా ఆయన నటన ముగ్ధుల్ని చేయడమే. ముఖానికి రంగేసుకుని కామెడీ చేసేవాడే మనందరికీ తెలిసిన జోకర్. కానీ తనలోని ట్రాజెడీని తెలియజెప్పిన చిత్రం 'జోకర్'.

కామిక్ బుక్స్‌లో బ్యాట్‌మేన్ ఎదుర్కొన్న విలన్ జోకర్. బ్యాట్‌మేన్ చిత్రాల్లో చాలా ఏళ్లుగా ఈ పాత్రను చూస్తూనే ఉన్నారు ప్రేక్షకులు. అసలెవరీ జోకర్? అతని పుట్టుపూర్వోత్తరాలేంటి? అతను అలా మారడానికి (తయారవడానికి) కారణాలేంటి? అనే విషయాలను ప్రస్తావిస్తూ 'జోకర్' సినిమాను రూపొందించారు దర్శకుడు టాడ్ ఫిలిప్ (ఉత్తమ దర్శకుడిగా నామినేషన్ పొందారు కూడా). 'జోకర్' కథ విషయానికొస్తే...

సందర్భంతో పనిలేకుండా పగలబడి నవ్వుతుండే విచిత్రమైన డిజార్డర్‌తో బాధపడుతుంటాడు ఆర్థర్ ఫ్లెక్ (ఒక్విన్ ఫీనిక్స్). స్టాండప్ కమేడియన్ అవ్వాలన్నది అతని ఆశ. కానీ అతను నివసిస్తున్న గోథమ్ సిటీలో అప్పటికే నిరుద్యోగం, క్రైమ్ పెరిగిపోయి ఉంటుంది. ఈ క్రమంలో తన చుట్టూ ఉన్న పరిస్థితులు, తన మానసిక స్థితి తనని ఎలాంటిగా మనిషిగా మార్చాయి? తను ఎంచుకున్న మార్గమేంటి? అనే కథాంశంతో 'జోకర్' సినిమా తెరకెక్కింది. చట్ట విరుద్ధమైన పనులు చేసేందుకు ప్రేరేపించేలా ఉందని కొద్దిపాటి కాంట్రవర్సీ కూడా ఈ సినిమాను చుట్టుకుంది. అయినప్పటికీ విపరీతమైన జనాదరణ లభించింది. ఒక్విన్ నటనకు ఆస్కార్ అతని ఇంటికొస్తుంది అనే ప్రశంసల జల్లు కురిసింది. ఈ మధ్య జరిగిన 'బాఫ్తా', 'క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్స్', 'ఎస్ఏజీ అవార్డ్స్', 'గోల్డెన్ గ్లోబ్స్ అవార్డ్స్' అవార్డు వేడుకల్లో ఉత్తమ నటుడి అవార్డు ఎన్వలప్స్‌లో కూడా ఒక్విన్ ఫీనిక్స్ పేరే ఉంది.

### కొత్త ప్రపంచం తయారు చేద్దాం

ఒక్విన్ తన ప్రసంగంలో ప్రస్తుతం ప్రపంచమంతా ఎదుర్కొంటున్న కొన్ని సీరియస్ సమస్యలను చర్చించారు. "ప్రస్తుతం మనందరం లింగ వివక్ష, వర్ణ వివక్ష, జంతు హక్కులు వంటి సమస్యలపై పోరాడుతున్నాం. ఒక జాతి (అది దేశం అయినా, వర్ణం అయినా, వర్గం అయినా సరే) మరో జాతిని కంట్రోల్ చేయొచ్చు, వాళ్లను దోచుకోవచ్చు అనే నమ్మకానికి విరుద్ధంగా పోరాడుతున్నాం. మనం చేసే ప్రతీ పనిలో ప్రేమ, కరుణ అనేవి ముఖ్య ఉద్దేశాలైతే మనందరం కలిసి అందరికీ ఉపయోగపడే ఓ కొత్త ప్రపంచాన్ని తయారు చేయవచ్చు. గతంలో నేను చాలా సార్లు స్వార్థంగా ప్రవర్తించాను. కానీ ఈ హాల్లో (ఆస్కార్ థియేటర్‌లో వాళ్లను ఉద్దేశిస్తూ) ఉన్నవాళ్లు నాకు రెండో అవకాశం ఇచ్చారు. మనం తిరిగి పుంజుకోవడానికే ఈ రెండో అవకాశం" అని పేర్కొన్నారు ఫీనిక్స్.

### సూట్‌గా చెప్పారు

అవార్డు ఫంక్షన్ జరిగేది ప్రతిభను పురస్కరించుకోవడానికే అయినా హంగూ ఆర్భాటాలను ప్రదర్శించడానికి కూడా. కాని ఒక్విన్ ఆ హంగు లేకుండా గత అవార్డు ఫంక్షన్‌లకు వేసుకున్న సూట్‌నే వేసుకొచ్చారు. ఏం అని అడిగితే ఎందుకూ... అనవసర ఖర్చు అని తేల్చేశారు.


● సింథియా ఎరివో

## తెల్ల రంగు ఆధిపత్యం

ఆస్కార్ అవార్డ్స్ విజేతల ఎంపికలో జరుగుతున్న 'వర్ణ వివక్ష'పై ఐదేళ్లుగా 'ఆస్కార్ సో వైట్' అంటూ అవార్డు కమిటీ వివాదాలు ఎదుర్కొంటోంది. మహిళా డైరెక్టర్ల నామినేషన్ విషయంలోనూ వివాదం జరుగుతోంది. అందుకే ఈసారి 'వెరీ మేల్.. వెరీ వైట్' అంటూ పలువురు బాహాటంగానే విమర్శనాస్త్రాలు సంధించారు. డైరెక్టర్ల విభాగంలో పురుషాధిక్య ధోరణి కనబడుతోందని, మొత్తం అవార్డుల ఎంపిక పరంగా తెల్ల జాతీయుల ఆధిక్యం కనబడుతోందని సోషల్ మీడియాలోనూ విమర్శలు వచ్చాయి. 2017లో 18, 2018లో 13, 2019లో 15 మంది నల్ల జాతీయులకు నామినేషన్ దక్కింది. ఈసారి సంఖ్య బాగా తగ్గింది. జస్ట్ ఐదుగురు మాత్రమే నామినేషన్ దక్కించుకున్నారు. ఉత్తమ నటి విభాగంలో ఒకే ఒక్క నల్ల జాతీయురాలికే నామినేషన్ దక్కడం బాధాకరం అని నామినేట్ అయిన 'సింథియా ఎరివో' ఆవేదన వ్యక్తం చేశారు. అవార్డుల విషయంలోనే కాదు.. రెడ్ కార్పెట్ దగ్గర కూడా వర్ణ వివక్ష ఉందని, తెల్ల రిపోర్టర్ల హవానే ఉందన్నారామె. బ్లాక్ రిపోర్టర్స్‌కి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని కూడా పేర్కొన్నారు. ప్రతిభకు పట్టం కట్టాల్సిన అవసరం ఉందని, రంగుకి కాదని అన్న సింథియా 'వైట్ రిపోర్టర్స్'కి ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. లోలా అనే బ్లాక్ ఫిమేల్ రిపోర్టర్‌ని పలకరించి, 'నేను మాట్లాడాలి' అంటూ చిన్న చాట్ సెషన్‌లో పాల్గొన్నారు.


● నటాలీ

## మహిళా దర్శకులు ఎక్కడ?

హాలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్... ఇలా ఏ భాషలో అయినా ఇరవై ముప్పై మంది మేల్ డైరెక్టర్లు ఉంటే నలుగురైదుగురు ఫిమేల్ డైరెక్టర్లు ఉంటారు. ఆ ఉన్న తక్కువమందికి ప్రోత్సాహం దక్కకపోతే? ఇదే విషయాన్ని సూచిస్తూ నటి, దర్శక-నిర్మాత నటాలీ పోర్ట్‌మేన్ ఆస్కార్ అవార్డుల జాబితాలో నామినేట్ కాని మహిళా దర్శకుల పేర్లను తన డ్రెస్ మీద కుట్టించుకున్నారు. ఆమె డ్రెస్ మీద ఎంబ్రాయిడరీ చేసిన పేర్లలో 'హస్లర్స్' చిత్రదర్శకురాలు లోరెనీ స్కఫారియా, 'ది ఫేర్‌వెల్' దర్శకురాలు లులు వ్యాంగ్, 'లిటిల్ ఉమన్' దర్శకురాలు గ్రెటి గెర్‌విగ్ తదితరులవి ఉన్నాయి. ఆస్కార్ చరిత్ర చూస్తే ఇప్పటివరకూ కాత్రిన్ బిజెలో, లీనా వెర్ట్‌ముల్లర్, జేన్ కాంపియన్, సోఫియా కొప్పోలా, గ్రెటి గెర్‌విగ్.. ఈ ఐదుగురు మాత్రమే నామినేషన్ దక్కించుకున్నారు. వీళ్లల్లో 82వ ఆస్కార్ అవార్డ్స్ (2010)లో 'ది హర్ట్ లాకర్' చిత్రానికి గాను కాత్రిన్ బిజెలో ఉత్తమ దర్శకురాలిగా ఆస్కార్‌ని సొంతం చేసుకున్నారు. లేడీ డైరెక్టర్ల విభాగంలో తొలి ఆస్కార్ అందుకున్న దర్శకురాలు ఆమే కావడం విశేషం. ఈ రికార్డ్ భవిష్యత్తులో వేరే లేడీ డైరెక్టర్‌కి దక్కే ఆస్కారం లేదని, ఎందుకంటే అకాడమీ కమిటీ వివక్ష చూపిస్తోందని అర్థమవుతోందనే విమర్శలు ఉన్నాయి. అసలు ఫిమేల్ డైరెక్టర్స్‌కి నామినేషన్ దక్కడమే గగనం అనే పరిస్థితి. గడచిన పదేళ్లల్లో 2018లో 'లేడీ బర్డ్' సినిమాకిగాను గ్రెటా గెర్‌విగ్ నామినేషన్ దక్కించుకున్నారు.. అంతే.



## జాలీ బిల్లీ

నటుడు, గాయకుడు బిల్లీ పోర్టర్ కొంచెం జాలీ టైప్. అమ్మాయిలా డ్రెస్ చేసుకుని సరదాపడేంత జాలీ మేన్. గతేడాది ఆస్కార్ అవార్డ్ వేడుకకు బిల్ నలుపు రంగు గౌనులో హాజరయ్యారు. ఈ ఏడాది కూడా అమ్మాయిలా డ్రెసప్ అయి వచ్చారు.


● చార్లెస్ థెరాన్
● స్కార్లెట్ జోహాన్‌సన్
● బ్రీ లార్సెన్
● పెనిలోప్ క్రూజ్

## గ్లామర్ గౌన్లు

ఆస్కార్ వేడుకలో సెంటరాఫ్ ఎట్రాక్షన్ అంటే.. రెడ్ కార్పెట్‌పై స్టార్స్ 'క్యాట్‌వాక్'. డిజైనర్ గౌన్లు, నగలతో చూడ్డానికి రెండు కళ్లూ చాలవన్నట్లుగా తయారై వస్తారు. ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న సింథియా ఎరివో తెలుపు రంగులో మెరిశారు. నగలేవీ ధరించకుండా సింపుల్‌గా వచ్చేశారామె. సిల్క్ గౌనులో నటి, గాయని స్కార్లెట్ జోహాన్‌సన్ అందరి కళ్లూ తనవైపు తిప్పుకున్నారు. ఆమె ధరించిన 27 క్యారెట్ల వజ్రపు చెవి దుద్దులు ఓ ఎట్రాక్షన్. లైట్ పింక్ కలర్‌లో తళుకులీనుతున్న బ్రీ లార్సన్ గౌన్ చూశారు కదా. పూసలు, రాళ్లతో ఈ గౌనుని డిజైన్ చేశారు. మొత్తం 1200 గంటలు పట్టిందట. అంటే.. ఈ గౌను తయారీకి 50 రోజులు పట్టింది. ఇంకా నటి పెనిలోప్ క్రూజ్ నలుపు రంగు గౌను, నడుముకి ముత్యాల బెల్ట్‌తో, ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న చార్లెస్ థెరాన్ నలుపు రంగు గౌనులో.. ఇలా తారలందరూ రెడ్ కార్పెట్‌పై వయ్యారంగా నడిచి వచ్చిన వేళ కాలం స్తంభించిపోతే బాగుండు అనిపించే చిలిపి ఆలోచన రానివాళ్లు ఉండరేమో.


● జూలియా బటర్స్

### విశేషాలు

- యాంగ్ లీ (2012, లైఫ్ ఆఫ్ పై) తర్వాత ఆసియా నుంచి ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్ అందుకున్నది బాంగ్ జూన్ హూ మాత్రమే.
- గతంలో 'జోకర్' పాత్రను పోషించినందుకు ఉత్తమ నటుడిగా (2008) హీత్ లెడ్జర్ ఆస్కార్ అందుకున్నారు. ఇప్పుడు ఒక్విన్ ఫీనిక్స్.
- 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్'తో ఆకట్టుకున్న బాల నటి జూలియా బటర్స్ ఆస్కార్స్ వేడుకకు సాండ్‌విచ్ తెచ్చుకుంది. "కొన్నిసార్లు అవార్డు ఫంక్షన్‌లో ఏమీ పెట్టరు లేదా నాకు నచ్చేవి ఏమీ ఉండవు. అందుకే సాడ్‌విచ్ తెచ్చుకున్నాను" అని చెప్పింది జూలియా.

- గౌతమ్ మల్లాది, డి.జి. భవాని

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
మంగళవారం 11-2-2020

# నేను సిక్స్ కొట్టాలనే దిగుతా

- విజయ్ దేవరకొండ



● కేఎస్ రామారావు, ఇజబెల్లా, ఐశ్వర్యా రాజేష్, విజయ్ దేవరకొండ, రాశీఖన్నా, కేథరిన్, క్రాంతిమాధవ్, వల్లభ

‘‘చాలామంది దగ్గర తెలివితేటలు, ప్రతిభ ఉంటాయి. కానీ స్వచ్ఛమైన ప్రతిభ, మంచితనం, తెలివితేటలు కలిపి ఉన్న మనిషి విజయ్. అతని ప్రయాణం ప్రారంభ దశలోనే ఉంది. భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదుగుతాడని ఆశిస్తున్నా’’ అన్నారు నిర్మాత అల్లు అరవింద్. విజయ్ దేవరకొండ హీరోగా క్రాంతిమాధవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘వరల్డ్ ఫేమస్ లవర్’. రాశీఖన్నా, ఐశ్వర్యా రాజేష్, కేథరిన్, ఇజాబెల్లా లెయితే హీరోయిన్లు. కె.ఎస్. రామారావు సమర్పణలో కె.ఎ. వల్లభ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో అల్లు అరవింద్ మాట్లాడుతూ– ‘‘ఒకనాడు నేను ఈర్ష్య పడేంత ప్రొడ్యూసర్ కేఎస్ రామారావు. సినిమాని ఆయన ప్రేమించినంతగా నేను ప్రేమిస్తానా? అని నాకే ఒక్కోసారి సందేహం వస్తుంటుంది’’ అన్నారు. నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ– ‘‘అప్పట్లో చిరంజీవితో ఎన్నో సూపర్ హిట్స్ సినిమాలని తీశారు రామారావుగారు. మళ్లీ అంతకు మించిన హిట్ ఈ సినిమా ఇవ్వాలని కోరుకుంటున్నా’’ అన్నారు. ‘‘నేను, కేఎస్ రామారావు విజయవాడ నుంచి ఒకేసారి ఇండస్ట్రీకి వచ్చాం. ఒక నిర్మాతగా ఆయనతో పోటీపడేవాణ్ని. మా సంస్థ నుంచి వచ్చిన ఒక ఆణిముత్యం విజయ్’’ అన్నారు నిర్మాత సి. అశ్వినీదత్. ‘‘ఈ సినిమాతో విజయ్ మరోసారి అందర్నీ అలరిస్తాడని ఆశిస్తున్నా’’ అన్నారు నిర్మాత డి. సురేష్ బాబు. ‘‘అర్జున్ రెడ్డి’కి ముందు, ‘అర్జున్ రెడ్డి’కి తర్వాత అనేలా విజయ్ కెరీర్ నడుస్తోంది. తన ఫ్యాన్స్, ప్రేక్షకులకు వినోదం కావాలని కోరుకుంటాడు. దాన్ని దృష్టిలో పెట్టుకొని ‘వరల్డ్ ఫేమస్ లవర్’ కథ రాశా’’ అన్నారు క్రాంతిమాధవ్. ‘‘విజయ్ ఎనర్జీ ప్రతి ఫ్రేములో కనిపిస్తుంది. విజయ్, రాశీ ఖన్నా పోటాపోటీగా నటించారు’’ అన్నారు కేఎస్ రామారావు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ‘‘2016లో ‘పెళ్ళిచూపులు’ సినిమాతో ఒక లీడ్ యాక్టర్‌గా మీ ముందుకు వచ్చా. ఈ నాలుగేళ్లలో హిట్లు కొట్టినం.. చేతి నుంచి జారిపోయిన సినిమాలూ ఉన్నాయి. ఈ జర్నీలో స్థిరమైన వాటిలో మీరు (ఫ్యాన్స్) ఉన్నారు. నేను సిక్స్ కొట్టాలనే దిగుతా. ఈ సింగిల్, డబుల్ నాకు ఓపిక లేదు. ఇక నుంచి సిక్సులు కొట్టడానికే చూస్తా’’ అన్నారు. అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ నామా, ఇజాబెల్లా, కేథరిన్, రాశీ ఖన్నా, ఐశ్వర్యా రాజేష్ మాట్లాడారు.

# రాజమండ్రి ప్రయాణం



● చిరంజీవి

చిరంజీవి హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు ‘ఆచార్య’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ కోసం చిత్రబృందం ఈ నెల 24న రాజమండ్రి ప్రయాణం కానున్నారని సమాచారం. రామ్‌చరణ్, నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. రాజమండ్రిలో ఓ కీలక షెడ్యూల్ ప్లాన్ చేశారట చిత్రబృందం. ఈ షెడ్యూల్‌లో కొన్ని యాక్షన్ ఎపిసోడ్‌లు, కీలక సన్నివేశాలు ప్లాన్ చేశారని టాక్. ఈ షెడ్యూల్‌లోనే త్రిష షూటింగ్‌లో జాయిన్ అవుతారట. ఆల్రెడీ ఒక పాట కొన్ని యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేశారు. 80–90 రోజుల మధ్యలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసి, ఆగస్ట్‌లో విడుదల చేయాలనుకుంటున్నారట.

# ఉగాదికి రెడీ



● నాని, సుధీర్‌బాబు

నానీతో ‘అష్టాచమ్మా, జెంటిల్‌మన్’, సుధీర్‌బాబుతో ‘సమ్మోహనం’ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటి వారిద్దరి కలయికలో తాజాగా తెరకెక్కించిన చిత్రం ‘వి’. అదితీరావు హైదరీ, నివేదా థామస్ కథానాయికలుగా నటించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ‘దిల్’ రాజు, శిరీష్, హర్షిత్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 17న విడుదల చేస్తున్నారు. సినిమాను ఉగాది సందర్భంగా మార్చి 25న రిలీజ్ చేస్తున్నారు. నాని 25వ చిత్రం ‘వి’. ఇందులో నాని రాక్షసుడి తరహా పాత్రలో కనిపించనున్నారు. ఆయన బారి నుంచి అందర్నీ కాపాడే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో సుధీర్‌బాబు నటించారు. ఇటీవల వీరిద్దరి పాత్రల లుక్స్‌ను విడివిడిగా విడుదల చేసిన చిత్రబృందం ఇప్పుడు వీరిద్దరూ కలిసి ఉన్న పోస్టర్‌ను విడుదల చేసింది. సుధీర్‌బాబు స్టైలిష్ లుక్‌తో కనబడుతుంటే.. నాని మెలితిప్పిన మీసాలతో రగ్డ్ లుక్‌లో కనబడుతున్నారు. ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు త్వరలో పూర్తి కానున్నాయి. ఈ చిత్రానికి సంగీతం: అమిత్ త్రివేది, నేపథ్య సంగీతం: తమన్, కెమెరా: పి.జి.విందా.

# క్లైమ్యాక్స్ చూసి కన్నీళ్లు పెట్టుకున్నాను

- కె. రాఘవేంద్రరావు



● ‘దిల్’ రాజు, సమంత, రాఘవేంద్ర రావు, శర్వానంద్

‘‘సరిలేరు నీకెవ్వరు, ‘అల.. వైకుంఠపురములో, జాను’ చిత్రాలతో ఈ ఏడాది అప్పుడే ‘దిల్’ రాజు గారు హ్యాట్రిక్ కొట్టారు. ‘జాను’ అందమైన ప్రేమ కథ. క్లైమ్యాక్స్ చూసి కన్నీళ్లు పెట్టుకున్నాను. నేను చూసిన ‘గీతాంజలి’, నేను డైరెక్ట్ చేసిన ‘పదహారేళ్ల వయసు’ సినిమాల క్లైమ్యాక్స్ తర్వాత ‘జాను’ చిత్రం అంతలా కదిలించింది’’ అన్నారు దర్శకుడు కె. రాఘవేంద్రరావు. శర్వానంద్, సమంత జంటగా సి. ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘జాను’. ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం థ్యాంక్స్ మీట్‌ను నిర్వహించింది. ‘దిల్’ రాజు మాట్లాడుతూ– ‘‘తొలి రోజు నుంచి ఇటు ఇండస్ట్రీ నుండి అటు మీడియా, సోషల్ మీడియా, ప్రేక్షకుల నుండి మా ‘జాను’కి అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రేమ్, ఇతర సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు. శర్వానంద్, సమంత కళ్లతోనే నటించారు. మా బ్యానర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీస్ అని చెబుతున్నారు. జనరల్‌గా సినిమాలు తీసేటప్పుడు లెక్కలు వేసుకుంటాను.. కానీ ‘జాను’కి లెక్కలు వేసుకోలేదు. ఇలాంటి సినిమాను ప్రోత్సహిస్తేనే మరిన్ని మంచి సినిమాలు చేయగలం’’ అన్నారు. ‘‘సినిమాని చూసిన వారందరూ చాలా పాజిటివ్‌గా స్పందించారు’’ అన్నారు సమంత. శర్వానంద్ మాట్లాడుతూ– ‘‘నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా ‘జాను’. హిట్స్ కొడుతున్నా కానీ... నటుడిగా ఏదో మిస్ అయ్యాననే భావన మనసులో ఉండిపోయింది.. అది ‘జాను’తో తీరింది. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను’’ అన్నారు. దర్శకులు బి.వి.ఎస్. రవి, నందినీ రెడ్డి, పాటల రచయిత శ్రీమణి, రచయిత ‘మిర్చి’ కిరణ్ మాట్లాడారు.

# విలన్ విజయ్



● విజయ్ సేతుపతి

హీరో సాయిధరమ్ తేజ్ సోదరుడు వైష్ణవ్ తేజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం ‘ఉప్పెన’. దర్శకుడు సుకుమార్ దగ్గర అసోసియేట్‌గా పని చేసిన బుచ్చిబాబు సానా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కథానాయికగా కృతీ శెట్టి నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 2న విడుదల కానుంది. ఈ చిత్రంలో తమిళ నటుడు విజయ్ సేతుపతి ఒక కీలక పాత్ర పోషిస్తుండగా, ఆయన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. మెలి తిప్పిన మీసాలతో, తీక్షణమైన చూపులతో అంబాసిడర్ కారుకు ఆనుకొని నిలబడి ఓ లుక్ ఉండగా, సిగరెట్ తాగుతూ దీర్ఘాలోచనలో ఉన్న మరో లుక్‌లో విజయ్ సేతుపతి కనిపిస్తున్నారు. హీరోగా తమిళంలో వరుస విజయాలతో దూసుకెళుతోన్న విజయ్ సేతుపతిది ఇందులో విలన్ పాత్ర కావడం విశేషం. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: అనిల్ వై., అశోక్ బి, సీఈవో: చెర్రీ, కెమెరా: శ్యామ్‌దత్ సైనుద్దీన్, సంగీత దర్శకుడు: దేవి శ్రీప్రసాద్.

# వేసవిలో రొమాంటిక్



● ఆకాష్, కేతికా

‘ఇస్మార్ట్ శంకర్’ వంటి బ్లాక్ బస్టర్ సినిమా తర్వాత పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మించిన చిత్రం ‘రొమాంటిక్’. ఆకాష్ పూరి, కేతికా శర్మ జంటగా, రమ్యకృష్ణ కీలక పాత్రలో నటించారు. అనిల్ పాడూరి దర్శకుడు. ఈ చిత్రాన్ని మే 29న విడుదల చేయనున్నట్లు చిత్రవర్గాలు పేర్కొన్నాయి. అనిల్ పాడూరి మాట్లాడుతూ– ‘‘ఇంటెన్స్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. వేసవి సెలవుల్లో కాలక్షేపాన్ని ఆశించేవాళ్లు మా సినిమాను చూడొచ్చు. ఇటీవల విడుదల చేసిన రెండు పాటలకు మంచి స్పందన వచ్చింది. మా సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది’’ అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: లావణ్య

# సూపర్ కాంబినేషన్



● నయనతార



● సమంత

లేడీ సూపర్‌స్టార్ నయనతార, సూపర్‌స్టార్ సమంత కలసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారనే వార్త కోలీవుడ్‌లో బాగా వినిపిస్తోంది. వీళ్లద్దరూ కలసి లేడీ ఓరియంటెడ్ సినిమా ఏమైనా చేస్తున్నారా? అంటే కాదు. విజయ్ సేతుపతి నటించనున్న తమిళ సినిమాలో సమంత, నయనతార హీరోయిన్లుగా నటిస్తారట. దర్శకుడు, నయనతార బాయ్‌ఫ్రెండ్ విఘ్నేష్ శివన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ‘కాదు వాక్కుల రెండు కాదల్’ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాను సెవన్ స్క్రీన్ బ్యానర్‌పై లలిత్ కుమార్ నిర్మించనున్నారట. సమంత, నయనతార కలసి నటించే వార్త నిజమైతే కచ్చితంగా ఇది సూపర్ కాంబినేషన్.

# ఒక అమ్మ ప్రయాణం



● బొమ్మక్ మురళి, అల్లు అరవింద్, ఉమా మహేశ్వర రావు, రేవతి

రేవతి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం ‘ఇట్లు అమ్మ’. ‘మదర్స్ ఆఫ్ ద వరల్డ్ యునైట్’ అనేది ఉపశీర్షిక. ‘అంకురం’ చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకు జాతీయ పురస్కారం అందించిన సి. ఉమామహేశ్వర రావు ఈ చిత్రానికి దర్శకుడు. బొమ్మక్ క్రియేషన్స్ పతాకంపై బొమ్మక్ మురళి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగోని విడుదల చేసిన అల్లు అరవింద్ మాట్లాడుతూ– ‘‘అంకురం’ సినిమా చూసి ఆ దర్శకుడు ఎలా ఉంటారో చూడాలనుకున్నాను. నేను అలా అనుకున్న మరో దర్శకుడు బాలచందర్. ‘అంకురం’ సినిమా నాకిప్పటికీ గుర్తుంది. కొంతమంది మాత్రమే ఉమా మహేశ్వరరావుగారిలా సమాజం కోసం కథలు రాసి సినిమాలు రూపొందిస్తుంటారు’’ అన్నారు. ‘‘చెడు మార్గంలో పయనిస్తున్న సమాజం తిరిగి సన్మార్గం పట్టేందుకు అమ్మ ముందడుగు వేయాలనే సందేశాన్ని మా చిత్రం ఇస్తుంది’’ అన్నారు ఉమామహేశ్వరరావు. ‘‘మా సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది’’ అన్నారు బొమ్మక్ మురళి. ‘‘ఒక అమ్మ ప్రయాణమే ఈ సినిమా. జీవితం ఎలా సాగుతుందో అంతే సహజత్వంతో దర్శకుడు ఈ సినిమాను రూపొందిస్తున్నారు’’ అన్నారు రేవతి. సినిమాటోగ్రాఫర్ మధు అంబట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నాగులపల్లి కనకదుర్గ, దేవి, విమల పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సన్నీ ఎంఆర్.

# ఏం జరుగుతుంది



● మధుసూదన్, శ్రీజిత, రానా సునీల్‌కుమార్


‘నా పేరు మీనాక్షి’ సీరియల్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న మధుసూదన్ హీరోగా నటించిన చిత్రం ‘డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. మీనా బజార్’. రానా సునీల్ కుమార్ సింగ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. కద్రి మణికాంత్ స్వరపరచిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ‘‘సినిమా తీయడం కష్టమైన పని. చిన్న సినిమాలను ఆదరించాలి’’ అన్నారు డైరెక్టర్ నక్కిన త్రినాథ రావు. ‘‘వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. క్లైమ్యాక్స్ చూసేవరకు సినిమాను ఊహించలేరు’’ అన్నారు మధుసూదన్. రానా సునీల్ కుమార్ సింగ్ మాట్లాడుతూ– ‘‘ప్రతి మనిషిలో అహం ఉంటుంది. అహం ఉన్న ఐదు పాత్రలు కలిస్తే ఏమవుతుంది? అనేదే ఈ సినిమా. తర్వాత ఏం జరుగుతుంది? అనేది ప్రేక్షకులు ఊహించలేరు’’ అన్నారు. నటి హేమ, నవీన్ యాదవ్ మాట్లాడారు. వైభవీ జోషి, శ్రీజిత ఘోష్, రానా సునీల్ కుమార్ సింగ్, నటించిన ఈ చిత్రానికి కెమెరా: మ్యాథీవ్.







సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 11-2-2020



హైబ్రీడేతర సూటి రకం సంప్రదాయ విత్తనాలే సేంద్రియ వ్యవసాయానికి పట్టుగొమ్మలు. దేశీ విత్తన పరిరక్షకుల సేవ అనన్య సామాన్యమైనదని మనం గుర్తుంచుకోవాలి.
- క్లాడ్ అల్వారిస్, భారతీయ సేంద్రియ రైతుల సంఘం

ధనిష్ట కార్తె : ఫిబ్రవరి 18 వరకు





# ఇంటి సాగే ఇతని వృత్తి!

- డాక్టరేట్ పొందినా ఇంటిపైన హైడ్రోపోనిక్ సాగుపైనే ఆసక్తి
- అలవాటు చేసుకుంటే.. అంత సులువైనది మరొకటి లేదు
- రోజుకు పది నిమిషాలు వెచ్చిస్తే చాలంటున్న డా. రాహుల్ ధోకా

**వ్యవసాయమా... అందునా ఇంటి పైనా.. అయ్య బాబోయ్ అంత శ్రమపడ లేను, సమయం వెచ్చించలేనని ఎంత మాత్రం వెనుకాడవద్దు అంటున్నారు చెన్నైకి చెందిన 31 ఏళ్ల యువకుడు రాహుల్ ధోకా. నాలుగు గోడలు ఉంటే చాలు, రోజుకు కేవలం పది నిమిషాల సమయం గడిపితే చాలు ప్రకృతి వర ప్రసాదం వంటి స్వచ్ఛమైన అనేక వ్యవ సాయ ఉత్పత్తులు మీకు సొంతం అవు తాయని భరోసా ఇస్తున్నారాయన. విలాసవంతమైన జీవితంతోపాటూ ఎం.ఎస్. పట్టా చేతిలో ఉండి కూడా ఇంటిపంటల సాగునే వృత్తిగా చేసు కున్న విలక్షణ వ్యక్తిత్వం రాహుల్‌ది. తన ఉత్పత్తులతో కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను ఆకట్టుకుంటున్నారు. వంటింటి అవసరాలకు మార్కెట్లకు వెళ్ల కుండా ప్రతి ఒక్కరూ ఇంటిలోనే వ్యవ సాయ ఉత్పత్తులను హైడ్రోపోనిక్ పద్ధ తిలో చేతికి మట్టి అంటకుండా సులభ తరంగా సాగు చేసుకోవచ్చని చెబుతు న్నారు. ఆయన మాటల్లోనే..**

అన్నా యూనివర్సిటీలో ఇండస్ట్రియల్ బయోటె క్నాలజీలో గ్రాడ్యుయేషన్ అయ్యాక యూకే వెళ్లి వార్‌విక్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశాను. అక్కడ చదువుకుంటున్న సమయంలోనే సేంద్రియ వ్యవసాయం వైపు ఆకర్షితుడినయ్యాను. తల్లిదం డ్రుల వద్దకు చెన్నై తిరిగి వచ్చిన తరువాత 2013లో సేంద్రియ ఉత్పత్తుల విక్రయ స్టోర్ పెట్టాను. వంద రకాల ఉత్పత్తులను అమ్మేవాడిని. స్వయంగా సాగు చేయాలని 2016 డిసెంబరులో హైడ్రోపోనిక్ విధా నంలో 'ఆక్వాఫామ్స్' పేరిట (నుంగంబాక్కం తిరు మూర్తి నగర్‌లోని) మా ఇంటి పైనే సాగు ప్రారం భించాను. చెన్నైలో తరచూ ఎదురయ్యే నీటి కొరత ప్రభావానికి గురికాని వ్యవసాయం చేయాలని తల పెట్టాను. మూడు నెలలు పరిశోధన చేసిన తరు వాత వీటన్నింటికీ సమాధానంగా హైడ్రోపోనిక్ విధానంలో పంటల సాగు ఎంతో శ్రేయస్కరమని నమ్మి అనుసరిస్తున్నాను. పాలకూర, తోటకూర, గోంగూర తదితర ఆకుకూరలు, వాము పాక్ చోయ్, బ్రహ్మి, తులసి, బంతి పెంచుతున్నాను.

కొబ్బరి పొట్టు, క్లే బాల్స్ వేసి విత్తనాలు నాటి నర్సరీ పెంచుతున్నాను. మొక్కలు కొంచెం పెరిగిన తరువాత వాటిని పీవీసీ పైపులను నిలువుగా అనేక వరుసల్లో ఏర్పాటు చేసుకొని, వాటికి రంధ్రాలు పెట్టి, కేవలం రెండు అంగుళాలున్న ఆ కప్పులను ఆ రంధ్రాల్లో కూర్చోబెడుతున్నాను (ఈ కప్పుల్లో మట్టికి బదులుగా వరిపొట్టు, వర్మిక్యులేట్, స్పాంజ్‌లను కూడా వాడవచ్చు).

మొక్కల కుదుళ్లకు కొబ్బరి పొట్టును ఏర్పాటు చేసి సాధారణ నీటిలో న్యూట్రిషన్ నీళ్లను కలిపి ప్లాస్టిక్ గొట్టాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వ్యవస్థ ద్వారా ప్రవహింపజేస్తాను. ఎన్‌పీకే న్యూట్రి షన్‌తోపాటు మెగ్నీషియం సల్ఫేటు, కాల్షియం నైట్రేట్‌ను ద్రావణం రూపంలో కేవలం మొక్కల వేళ్ల ద్వారా ప్రవహింపజేయడం వల్ల ఎలాంటి దోషమూ ఉండదు. నేలపై అమర్చిన చిన్నపాటి వాటర్ ట్యాంక్ నుంచి మోటార్ ద్వారా పైప్‌కు పై భాగంలో ఈ నీటిని విడుదల చేస్తాను. అవి అలా ప్రవహిస్తూ అన్ని మొక్కలకు చేరుతాయి. మొక్క లకు అందగా మిగిలిన నీరు మళ్లీ కింద ట్యాంక్‌లో పడిపోతుంది. అదేనీటిని నిర్ణీత కాలవ్యవధిలో మళ్లీ వాడుకోవచ్చు. ఈ పద్ధతి వల్ల ఒక్కనీటి చుక్క కూడా వృథా పోదు.

**ఆరు వారాల్లో 200 గ్రాముల దిగుబడి**

పాలకూర, తోటకూర, లెట్యూసీ, పాక్‌చోయ్, బ్రహ్మి, తులసి, మారిగోల్డ్ ఫ్లవర్, అజ్వైన్ తదితర ఆకుకూరలు పెంచుతున్నాను. పుదీనా, ఇటాలి యన్ బాసిల్ (తులసి), పది తులసి రకాలు వేశాను. మట్టిలో సాధారణ సాగుతో పోల్చితే హైడ్రోపోనిక్ విధానంలో 90 శాతం నీరు ఆదా అవుతుంది. మట్టిని వాడకపోవడం వల్ల మొక్కలకు వ్యాధులు సోకవు. కలుపు మొక్కలు పెరగవు. ఇలా సాగుచేస్తున్న పంట ఆరు వారాల్లో చేతికి వస్తుంది. ఆకుకూర, ఔషధ మొక్కలనుంచి ఆరు నుంచి ఎని మిది వారాల్లో 200 గ్రాముల దిగుబడి సాధించ వచ్చు.

**30 అడుగుల్లో 500 మొక్కలు**

డాబాపై 80 చదరపు అడుగుల్లో 6,000 కూర గాయ, ఔషధ మొక్కలు పెంచుతున్నాను. అయితే, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతం కేవలం 30 చదరపు అడుగుల్లో 500 మొక్కలు పెంచుతున్నాను. నీటి పారుదల మట్టం కొంచం



తగ్గించడం వల్ల ఆక్సిజన్ చేరుతుంది. ఇది మొక్కల పెరుగుదలకు ఎంతో ఉప యోగపడుతుంది. హైడ్రోపోనిక్ విధా నంలో సేంద్రియ విత్తనాలే వాడాల్సిన అవసరం లేదు. సాధారణ విత్తనాలు మొక్కలైనపుడు వాటిల్లోని దోషాలు వంద శాతం తొలగిపోతాయి. ఏదైనా చిన్నపాటి సమస్యలు తలెత్తినట్లయితే వేప నూనెను పిచికారీ చేయడం ద్వారా వాటిని రూపుమాపవచ్చు.

వర్టికల్ పైప్‌లైన్ సాగు విధానంతో ఎంత చిన్న స్థలంలోనైనా మొక్కలను పెంచవచ్చు. గోడకు కూడా పైప్‌లైన్ వ్యవస్థను అమర్చుకుని మొక్కలు పెంచవచ్చు. ఏడాదికి నాలుగు దఫాలు దిగుబడి సాధించవచ్చు.

**రోజుకు పది నిమిషాలు చాలు!**

ముఖ్యంగా ఈ మొక్కల పెంపకం కోసం గంటల తరబడి శ్రమించాల్సిన అవసరం లేదు. 500 మొక్కల పెంపకానికి సరదాగా రోజుకు పది నిమిషాలు కేటాయిస్తే చాలు. ఎత్తైన పైప్‌లైన్ వ్యవస్థ వల్ల కిందకు వంగి శ్రమపడాల్సిన అవసరం కూడా ఉండదు. ఇది వృద్ధులకు ఎంతో సౌకర్యం.

**కేజీకి రూ. 20 ఖర్చు**

ఒక కేజీ ఆకుకూరలు, ఔషధ మొక్కలు పెంప కానికి కేవలం రూ.20లు మాత్రమే ఖర్చవుతుంది. అదే బజారులో కొంటే ఎంతో ఖరీదు. డాబాపై పంటలు వేసినపుడు అవసరమైన సూర్యరశ్మి అందుతుంది. అలా డాబా పైన ఖాళీ స్థలం లేని వారు నిరుత్సాహ పడక్కర లేదు. ఇంటిలోపల కూడా సూర్యరశ్మికి బదులుగా ఎల్‌ఈడీ దీపా లను అమర్చి ఈ మొక్కలు పెంచ వచ్చు. 12 గంటల ఎల్‌ఈడీ దీపాల వెలుగు ఆరుగంటల సూర్యరశ్మితో సమానం. ఒక పంట దిగుబడి తరు వాత కొబ్బరి పొట్టు మారిస్తే తర్వాత పంటలోనూ మంచి ఫలితాలు పొంద వచ్చు.



**సేంద్రియం కంటే హైడ్రోపోనిక్ మేలు**

సేంద్రియ సాగు కంటే హైడ్రోపానిక్ సాగు ఎంతో శ్రేష్ఠం. సేంద్రియ పంటల్లో సాల్మోనెల్లా, ఇకొలి అనే బ్యాక్టీరియాను న్యూయార్క్‌లో కను గొని 75 శాతం ఉత్పత్తులను వెనక్కు పంపివేశారు. సేంద్రియ వ్యవసాయంలో కొందరు ఉత్పత్తుల సైజు పెంచడం కోసం ఆక్సిటోసిన్ హార్మోన్‌ను విని యోగిస్తున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. ఆక్సి టోసిన్‌తో తయారైన ఉత్పత్తులను భుజించడం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది.

**ఇంటింటా హైడ్రపోనిక్ పంటే లక్ష్యం**

హైడ్రోపోనిక్ వ్యవసాయం అందరికీ అందు బాటులోకి రావాలి. తమకు అవసరమైన మొక్క లను ఎవరికి వారు పెంచుకునే స్థాయికి చేరుకోవా లనేదే నా లక్ష్యం. మార్కెట్‌కు వెళితే అధిక ధరలతో పాటూ వాహనాలకు ఆయిల్ ఖర్చు భరించాల్సి ఉంటుంది. అంతేగాక ఎంతో సమయం వృథా అవు తుంది. ఈ వాస్తవాలపై అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 2019 జనవరిలో చెన్నైలో 'ఆక్వా ఫాం' హైడ్రోపోనిక్స్ కన్సల్టెన్సీ ఆఫీసును ఏర్పాటు చేశాను. ముందుగా బంధువులకు నేర్పాను. మా ఆఫీసు ద్వారా ఎంతోమందికి సల హాలు, సూచనలు ఇస్తున్నాను. నెలకు రెండు శిక్షణా తరగతులను మూడు నెలలుగా నిర్వహిస్తున్నాను. ఇతర రాష్ట్రాల నుంచి ఎందరో తరగతులకు హాజర వుతున్నారు. ఇలా ఎంతోమందికి అవగాహన కల్పించాను.

– కొట్ర నందగోపాల్,
సాక్షి ప్రతినిధి, చెన్నై



నేను పండించిన ఆకుకూరలు, ఔషధ మొక్కలను మా ఇంటిలో, బంధుమిత్రుల ఇళ్లలో వాడుకోగా మిగిలినవి ఇతరులకు అమ్ముతున్నాను. వినియోగదారుల నుంచి ముందుగానే ఆర్డర్లు తీసుకొని సరఫరా చేస్తున్నాం. ఇలా ఎందరో ఖాతాదారులు ఏర్ప డ్డారు. రిటైల్ దుకాణాలకు కూడా సరఫరా చేస్తున్నాను.

**(రాహుల్ ధోకాను 89395 49895 నంబరులో సంప్రదించవచ్చు)**
https://www.acquafarms.org

# సుసంపన్నం దుంప పంటల వైవిధ్యం

ప్రజల ఆహారంలో ధాన్యాల తర్వాత అంత ప్రాధాన్యం కలిగినవి దుంపలు. దుంప పంటలు అనగానే మనకు చప్పున గుర్తొచ్చేవి బంగాళ దుంప, కంద, చేమదుంప, క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్. ఇంకా చెప్పాలంటే కర్రపెండలం, తాటి తేగలు కూడా. అయితే, మనకు తెలియని దుంప పంట రకాలు మరెన్నో ఉన్నాయి. ఈ పంటల జీవ వైవిధ్యం చాలా సుసంపన్నమైనది. గ్రామీణులు, ముఖ్యంగా గిరిజనులు, ఆదివాసీలకు ఆహార భద్ర తను కల్పిస్తున్నప్పటికీ దుంప పంటలు జీవ వైవిధ్యం క్రమంగా అంతరించిపోతోంది. భూసార క్షీణత, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, భూతాపోన్నతిని దీటుగా ఎదుర్కోవడంలో దుంప పంటలు ఎంతగానో ఉపకరిస్తాయి. ఈ దృష్ట్యా దుంప పంటలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్న విషయాన్ని ఎలుగెత్తి చాటడం కోసం సహజ సమృద్ధ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. ఇటీవల మైసూరులో ఇటీవల జరిగిన ప్రత్యేక దుంప పంటల ప్రదర్శన దక్షిణాదిలో దుంప జాతుల జీవవైవిధ్యానికి అద్దం పట్టింది. వివిధ



దుంప జాతులను తోటల్లో అంతర పంటలుగా పండించుకొని పరిరక్షించుకోవచ్చు. దుంప జాతుల జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవడం, వీటితో రక రకాల వంటకాలు తయారు చేసుకునే పద్ధతులను ప్రచారంలోకి తేవడం కోసం సహజ సమృద్ధ సంస్థ నాబార్డు తోడ్పాటుతో ఇటీవల కేలండర్‌ను ప్రచు రించడం విశేషం. గతంలో దేశీ వరి వంగడాలు, చిరుధాన్యాలపై కూడా కేలండర్లను ఈ సంస్థ ప్రచు రించింది. దుంప పంటలు, వంటల కేలండర్ ధర రూ. 75. వివరాలకు.. బెంగళూరులోని సహజ మీడియా వారిని 70900 09922 నంబరులో సంప్ర దించవచ్చు.

## 16న సేంద్రియ కూరగాయల సాగుపై శిక్షణ

సేంద్రియ వ్యవసాయ విధానంలో కూరగాయలు, ఆకుకూరల సాగుపై ఫిబ్రవరి 16 (ఆదివారం)న గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతు శిక్షణా కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజాకృష్ణారెడ్డి, సేంద్రియ రైతు శివనాగమల్లేశ్వరరావు(గుంటూరు జిల్లా) ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు శిక్షణ ఇస్తారు. వివరాలకు.. 97053 83666, 0863–2286255

## సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై 5 రోజుల శిక్షణ

సుస్థిర వ్యవసాయ కేంద్రం(సి.ఎస్.ఎ.), గ్రామీణ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సేంద్రియ ఆహారోత్పత్తుల వ్యాపార నిబంధనలపై ఫిబ్రవరి 17 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు సి.ఎస్.ఎ. ఈడీ డా. జీవీ రామాంజనేయులు తెలిపారు.
**వివరాలకు: 85006 83300**

• డెయిరీ డైరీ-24

# సేంద్రియ పాల ఆవశ్యకత

**వ్యవసాయ రంగానికి ఏర్పడుతున్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో పాడి పరిశ్రమ రైతులకు బాసటగా నిలుస్తున్నది. మన దేశం సగటున రోజుకు 170 మిలియన్ టన్నుల పాలను ఉత్పత్తి చేస్తూ, ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. అధిక పాల ఉత్పత్తితో పాటుగా, నాణ్యమైన పాలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి చెందిన దేశాల్లో సేంద్రియ పాల ఉత్పత్తి ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.**

ఈ పూర్వరంగంలో మనం కూడా సేంద్రియ పాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. భూమిలో సేంద్రియ ఎరువులు వేసి పండించిన దాణాలను, పశుగ్రాసాలను మేసిన పశువులు ఇచ్చే పాలే సేంద్రియ పాలు. ఇందులో ఎటు వంటి రసాయనిక అవశేషాలు ఉండవు. సేంద్రియ పాలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి..

- రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గడం, తద్వారా ఖర్చు తగ్గడం.
- రసాయనిక ఎరువులు, పురుగుమందుల అవ శేషాలు లేని నాణ్యమైన, కల్తీ లేని పాలను ఉత్పత్తి చేయటం.
- సేంద్రియ పాలలో ఒమెగా ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండెకు మేలు చేస్తాయి. అలానే పాలీ సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు కూడా ఎక్కువే.
- సేంద్రియ పాల పదార్థాలలో ఎక్కువ ప్రొటీన్ ఉంటుంది.
- రసాయనిక ఎరువుల అవశేషాలు పాల ద్వారా మన శరీరంలోకి ప్రవేశించినప్పుడు అవి శరీరంలోని ముఖ్యభాగాలను – కాలే యాన్ని, మూత్రపిండాలను, పేగులను దెబ్బ తీస్తాయి.
- సేంద్రియ పాలను ఉత్పత్తి చేయటం అంత తేలికైన విషయం కాదు. పశువుకు మేపే దాణా, మేత మొత్తాన్నీ సేంద్రియ పద్ధతు ల్లోనే పండించాలి. మొక్కజొన్న, జొన్నలు, తవుడు మొదలైనవి.



- సాధారణంగా భూమిలో మేలు చేసే సూక్ష్మ జీవులు చాలా ఉంటాయి. రసాయనిక ఎరు వుల వాడకం వలన ఇవి నశిస్తాయి. దీని వలన భూసారం తగ్గిపోయి, భూమి తన ఉత్పాదక శక్తిని కోల్పోతుంది.
- రసాయనిక ఎరువులు గాని, పురుగు మందులు గాని పశుగ్రాసాల సాగులో వాడితే ఆ పశుగ్రాసాలను తిన్న పశువుల పాలలో వాటి అవశేషాలు పేరుకుంటాయి. కొవ్వు లతో జత కట్టే గుణం రసాయనాలకు ఉండ టమే ఇందుకు కారణం. ఇటువంటి పాలు అనారోగ్యాన్ని కలిగిస్తాయి.
- పిల్లలు త్వరగా పరిపక్వ దశకు రావడానికి కూడా ఇదే కారణం. కాబట్టి సేంద్రియ పాల ఉత్పత్తిపై దృష్టి పెట్టడం ఉత్తమం.

– డా. ఎం.వి.ఎ.ఎన్. సూర్యనారాయణ,
ప్రొఫెసర్ అండ్ హెడ్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్,
కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, తిరుపతి.

కొత్త పంట

# వెన్నపండు వచ్చేనండి

- ఆంధ్రా తీరంలోనూ 'వెన్నపండు' సాగుకు అవకాశాలు మెండు
- అవకాడో మొక్కలు 10 అడుగులకొకటి నాటుకోవాలి.. అంతర పంటలూ వేసుకోవచ్చు
- ఆరేడు సంవత్సరాలకు కాపుకొస్తుంది
- చెట్టు జీవిత కాలం సుమారు 50 ఏళ్లు
- బెంగళూరు వ్యవసాయ వర్సిటీలో విస్తృత అధ్యయనం







'అవకాడో' గురించి మీరెప్పుడైనా విన్నారా? దీన్ని తెలుగులో 'వెన్నపండు' అనుకుందాం. విని ఉంటారు గానీ.. తిని ఉండరు. అయితే ఎక్కడో బ్రెజిల్, సెంట్రల్ అమెరికా ప్రాంతానికి చెందిన ఈ పండు ఇప్పుడు భారత్‌లోనూ పండుతోంది. సూపర్ మార్కెట్లలో కిలోకు రూ.300 వరకూ పలికే ఈ వెన్నపండు ఆంధ్రప్రదేశ్‌లోనూ మరీ ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాల్లో విరివిగా పండుతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఉద్యానపంటల్లో భాగంగా అవకాడోను పండించు కోవడం ద్వారా రైతులు లాభాలు గడించవచ్చు నని అంటున్నారు.. జి.ఎన్.శ్రీవత్స. బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యాన విభాగంలో సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీవత్స దేశంలో అవకాడో పంటకు సంబంధించిన సమా చారం 'సాక్షి సాగుబడి'కి అందించారు. ఆ వివ రాలు..

**అర శతాబ్దంగా భారత్‌లో..**

ముందుగా చెప్పుకున్నట్లు అవకాడో బ్రెజిల్, సెంట్రల్ అమెరికాకు చెందిన పండు. శాస్త్రీయ నామం పెర్సియా అమెరికానా. పచ్చటి రంగు, గుండ్రటి, కోలగా ఉండే రెండు రకాల్లో లభిస్తాయి. కొన్ని వందల ఏళ్ల క్రితమే బ్రెజిల్ నుంచి దేశాలు తిరిగి జమైకాకు.. ఆ తరువాత సుమారు 50–60 ఏళ్ల క్రితం భారత్‌కూ వచ్చింది. తమిళనాడులోని కోయంబత్తూరు, నీలగిరి ప్రాంతాల్లో ప్రస్తుతం ఎక్కువగా సాగవుతోంది. అవకాడో పండ్లలో ఒమె గా–3 ఫ్యాటీ యాసిడ్లు గణనీయంగా ఉంటాయి. ఈ రకమైన కొవ్వులు గుండెకు మేలు చేస్తాయని మనకు తెలుసు. ఈ పండుతో వచ్చే కేలరీల్లో 77 శాతం వరకూ కొవ్వుల ద్వారానే లభిస్తాయి. కాక పోతే అన్నీ శరీరానికి మేలు చేసే కొవ్వులు కావడం గమనార్హం. ఓలిక్ ఆసిడ్ రూపంలో లభించే కొవ్వులు శరీరంలో మంట/వాపులను తగ్గిస్తాయని పలు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ రకంగా చూస్తే ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్లు లభించే శాకా హారాల్లో ఇది ఒకటి అని చెప్పుకోవచ్చు.

తమిళనాడు తీర ప్రాంతాల్లో బాగా పండు తున్న అవకాడోకు తూర్పు కనుమల్లోనూ అనుకూ లమైన వాతావరణం ఉందని శ్రీవత్స తెలిపారు.

**అంతర పంటలకూ అవకాశం..**

అనేక ఉద్యాన పంటల మాదిరిగానే అవకాడో సాగులోనూ అంతర పంటలకు అవకాశాలు ఉన్నాయి. పది అడుగుల ఎడంతో మొక్కలు నాటుకోవాల్సి ఉంటుంది. విత్తనం ద్వారా నేరుగా మొలకెత్తించే అవకాశం లేదు. విత్తనాన్ని పాక్షికం గా నీటిలో ఉంచేలా చేయడం ద్వారా రెండు నుంచి ఆరు వారాల్లో మొలకెత్తుతుంది. కొంత కాలం తరువాత నేలలో నాటుకోవచ్చు. ఆరేడు సంవత్సరాలకు కాపునిచ్చే అవకాడో జీవితకాలం సుమారు 50 సంవత్సరాలు. ఒక్కో చెట్టు ఏటా 200 నుంచి 500 వరకూ పండ్లు కాస్తాయని, వెరై టీని బట్టి ఒక్కో పండు 250 గ్రాముల నుంచి కిలో వరకూ బరువు తూగుతాయని శ్రీవత్స తెలిపారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటే అయ్యే ఖర్చులతో పోలిస్తే దేశీయంగా సాగు చేసుకోవడం ద్వారా అటు రైతులు, ఇటు ప్రజలకూ ప్రయోజన మని ఆయన వివరించారు. బెంగళూరు వ్యవ సాయ విశ్వవిద్యాలయంలో అవకాడో సాగుకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉందని, అవసరమైన వారు gnsr-i-vat-sa@-gmail.com ఈ మెయిల్ ద్వారా తనను సంప్రదించవచ్చునని శ్రీవత్స తెలిపారు.



epaper.sakshi.com

సాక్షి **భవిత**
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్థయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
మంగళవారం
11-2-2020

# ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు




» టాప్ 100 ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆన్‌లైన్ చదువులకు కేంద్రం నిర్ణయం
» ఇంటి నుంచే నచ్చిన బ్యాచిలర్ స్థాయి కోర్సులు చదివేందుకు అవకాశం
» ఐసీటీ టూల్స్, మౌలిక సదుపాయాలు ముఖ్యం అంటున్న నిపుణులు

డిగ్రీ చదవాలని ఉన్నా.. సమయం అందుబాటులో లేదని చింతిస్తున్నారా?! ఆర్థిక పరిస్థితులు అనుకూలించక.. ఇంటర్/డిప్లొమాతోనే ఆగిపోయామనే ఆందోళన ఉందా..? అయితే ఇప్పుడు వీటన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టేయొచ్చు! ఎందుకంటే.. జాతీయ స్థాయిలో టాప్-100 జాబితాలోని ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ కోర్సులు చదివేందుకు అవకాశం లభించనుంది! ఆ డిగ్రీ సర్టిఫికెట్‌తో జాబ్ మార్కెట్‌లో ధీటుగా ఉద్యోగావకాశాలు అందుకోవచ్చు. దేశంలో లక్షల మంది ఉన్నత విద్యకు దూరమవుతున్నారని భావిస్తున్న కేంద్రం.. యువతను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. అందుకోసం టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 'ఆన్‌లైన్' డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల బడ్జెట్ సందర్భంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులతో ప్రయోజనాలు, లాభనష్టాల గురించి తెలుసుకుందాం..

**ఆన్**‌లైన్ ఎడ్యుకేషన్.. గత కొన్నేళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ట్రెండ్. ఇప్పటికే పలు యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు మూక్స్ విధానంలో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఇవి నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశానికి సంబంధించి అవగాహన కల్పించే స్వల్పకాలిక కోర్సులు. ఇవి మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా అప్పటికప్పుడు రూపొందించిన సర్టిఫికేషన్స్. ఇటీవల ఆటోమేషన్‌కు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా పలు ఇన్‌స్టిట్యూట్స్, మూక్స్ ప్రొవైడర్స్... ఏఐ అండ్ ఎంఎల్, రోబోటిక్స్, ఐఓటీ వంటి అంశాల్లో ఆన్‌లైన్ విధానంలో సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి. అయితే ఇవి పూర్తి స్థాయి కోర్సులు కావు. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో డిగ్రీ కోర్సులను ఆన్‌లైన్ విధానంలో అందించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

### టాప్-100 ఇన్‌స్టిట్యూట్స్

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-100 జాబితాలో నిలిచిన ఇన్‌స్టిట్యూట్‌లల్లో తొలిదశలో పూర్తి స్థాయి ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. సదరు ఇన్‌స్టిట్యూట్‌లు ఆన్‌లైన్ టీచింగ్-లెర్నింగ్ పరంగా సమర్థవంతమైన మౌలిక సదుపాయాలు కలిగుండటమే ఇందుకు కారణం. ఇప్పటికే పలు ఐఐఎంలు, ఐఐటీలు బీటెక్, ఎంటెక్, ఎంబీఏలకు సంబంధించి కొన్ని అంశాలను ఆన్‌లైన్‌లో చదివే అవకాశం కల్పిస్తూ.. వాటికి క్రెడిట్స్ కూడా ఇస్తున్నాయి. అలాగే పలు ప్రైవేటు యూనివర్సిటీలు ఆన్‌లైన్ విధానంలో పూర్తి స్థాయిలో పీజీ కోర్సులను సైతం అమలు చేస్తున్నాయి.

### కారణాలు ఇవే

పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడానికి కారణం ఏంటి? అంటే.. పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. మన దేశంలో వందల సంఖ్యలో యూనివర్సిటీలు.. వేల సంఖ్యలో కాలేజీలు ఉన్నా.. బ్యాచిలర్ స్థాయి కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకారం-2018-19 విద్యాసంవత్సరంలో బ్యాచిలర్ స్థాయి కోర్సుల్లో నమోదు 26.3 శాతం మాత్రమే. ఉన్నత విద్యలో చేరుతున్న మారుమూల ప్రాంతాల విద్యార్థుల సంఖ్య మరీ తక్కువగా ఉంది. ఆర్థిక సమస్యల కారణంగా ఏదో ఒక ఉపాధి మార్గం ఎంచుకోవాల్సి రావడంతో రెగ్యులర్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం లభించడంలేదు. మరోవైపు 2022 నాటికి జాతీయ స్థాయిలో ఉన్నత విద్యలో నమోదును 30 శాతానికి చేర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి నుంచే, వీలున్నప్పుడే చదువుకునేందుకు అవకాశం కల్పించే ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులకు శ్రీకారం చుట్టింది.

### నచ్చిన కోర్సులకు అవకాశం

పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు అందించాలని నిర్ణయించినప్పటికీ.. విద్యార్థులకు తాము నచ్చిన కోర్సులు చదివే అవకాశం ఉంటుందా? అనే సందేహం వ్యక్తమవుతోంది. తొలిదశలో ఈ కోర్సులను ఎన్ఐఆర్ఎఫ్ టాప్-100 ఇన్‌స్టిట్యూట్స్‌లో మాత్రమే ప్రవేశపెట్టాలని ప్రకటించడమే ఇందుకు కారణం. గతేడాది టాప్-100 ఇన్‌స్టిట్యూట్స్‌లో..ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలదే పైచేయి. రాష్ట్ర స్థాయి యూనివర్సిటీల సంఖ్య 20 లోపే ఉంది. దాంతో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల పరంగా విద్యార్థులు తమకు నచ్చిన కోర్సుల్లో చేరే అవకాశం అంతంత మాత్రమే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### టెక్నికల్ విద్యార్థులకే ప్రయోజనమా!

టాప్-100 జాబితాలో ఎక్కువగా ఐఐటీలు, నిట్‌లు, ఐఐఎంలే ఉన్నందున టెక్నికల్ కోర్సుల ఔత్సాహిక విద్యార్థులకే ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు అనుకూలమనే వాదన వినిపిస్తోంది. టెక్నికల్ కోర్సుల పరంగా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కంటే క్లాస్ రూం ఇంటరాక్షన్‌తోనే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. ఎందుకంటే..టెక్నికల్ కోర్సుల్లో ప్రాక్టికల్ ఓరియెంటేషన్‌కు ప్రాధాన్యం ఉంటుంది. ఫలితంగా కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలు లభిస్తాయి. మరోవైపు ప్రస్తుతం ఆర్ట్స్, హ్యూమానిటీస్ కోర్సుల్లో సైతం ప్రాక్టికాలిటికీ పెద్దపీట వేస్తున్నారు. ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల్లో ప్రాక్టికల్ నైపుణ్యాలు పొందే అవకాశం పెద్దగా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### కంప్యూటర్, ఇంటర్నెట్ తప్పనిసరి

ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు సొంతంగా అన్ని సదుపాయాలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా కంప్యూటర్, ఇంటర్నెట్, స్కైప్ వంటివి తప్పనిసరి. గ్రామీణ ప్రాంత వెనుకబడిన విద్యార్థుల ఉన్నత విద్యకు మార్గంగా ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు అందించాలనేది ప్రభుత్వ విధానం. కాని సదరు విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. ఓ పేద విద్యార్థి కంప్యూటర్, ఇంటర్నెట్ వంటివి సొంతంగా సమకూర్చుకోవడం కొంత కష్టమేనని చెప్పొచ్చు.

### సంప్రదాయ కోర్సులకు ఓకే

సంప్రదాయ బీఏ, బీకామ్, బీఎస్సీ వంటి కోర్సుల విద్యార్థులకు ఆన్‌లైన్ డిగ్రీ విధానం అనుకూలంగా ఉంటుందని పేర్కొంటున్నారు. అదే విధంగా ఇంటర్ లేదా డిప్లొమాతో చదువు మానేసి ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం తమ కెరీర్ అవకాశాలు మెరుగుపరచుకునేందుకు ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు దోహదం చేస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్యూర్ సైన్సెస్, లైఫ్ సైన్స్ కోర్సుల్లోనూ ప్రాక్టికల్స్ ద్వారా నైపుణ్యాలు పొందాల్సి ఉంటుంది. వాటి కోసం కొద్ది కాలం క్లాస్ రూమ్ ఇంటరాక్షన్ విధానం అమలు చేయాలని సూచిస్తున్నారు.

### రెండేళ్ల క్రితమే యూజీసీ ప్రతిపాదన

- వాస్తవానికి బ్యాచిలర్ స్థాయి ఆన్‌లైన్ కోర్సులను ప్రవేశ పెట్టాలని రెండేళ్ల క్రితమే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సూచించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(ఆన్‌లైన్ కోర్సెస్/ప్రోగ్రామ్స్) రెగ్యులేషన్స్ 2018 పేరుతో ఈ ప్రతిపాదన చేసింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో టాప్-100 ఇన్‌స్టిట్యూట్స్, న్యాక్ స్కోర్ 3.26 ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లే ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు అందించాలని స్పష్టం చేసింది.
- ఇంజనీరింగ్, లా, మెడిసిన్, డెంటల్, ఫార్మసీ, నర్సింగ్, ఆర్కిటెక్చర్, ఫిజియోథెరపీ, అప్లైడ్ ఆర్ట్స్ మినహా ఇతర ప్రోగ్రామ్‌లను ఆన్‌లైన్ విధానంలో అందించాలని పేర్కొంది. కోర్సు కాల వ్యవధి ఆధారంగా డిప్లొమా, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లను ఇవ్వాలని యూనివర్సిటీలకు మార్గదర్శకాలు విడుదల చేసింది.
- ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల వ్యవధిని మూడేళ్లుగా, పీజీ కోర్సుల వ్యవధిని రెండేళ్లుగా, డిప్లొమా కోర్సుల వ్యవధిని ఒక ఏడాదిగా నిర్ణయించింది. ఇలా ఆన్‌లైన్ లెర్నింగ్‌లో ఒక ప్రోగ్రామ్ వ్యవధి పూర్తయ్యాక పరీక్షలను నిర్దిష్ట పరీక్ష కేంద్రంలో అధ్యాపకుల పర్యవేక్షణలో నిర్వహించాలని స్పష్టం చేసింది.

### సత్ఫలితం లభిస్తుందా?

ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల విధానం సత్ఫలితాల్ని ఇస్తుందా? అంటే అధిక శాతం మంది సానుకూలంగా స్పందిస్తున్నారు. ఇది ఉద్యోగం చేస్తూనే డిగ్రీ కోర్సులు చదివేందుకు చక్కటి మార్గంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. టాప్-100 ఇన్‌స్టిట్యూట్స్ అనే నిబంధన కారణంగా ప్రవేశాల సంఖ్య, కోర్సుల సంఖ్య పరంగా పరిమితులు ఏర్పడతాయంటున్నారు. ఇలా కాకుండా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు చదివే అవకాశం కల్పించేలా విధి విధానాలు రూపొందించాలని సూచిస్తున్నారు. అప్పుడే ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది, లక్షల మందికి విద్యావకాశాలు లభిస్తాయని అంటున్నారు.

### మంచి నిర్ణయమే.. కానీ

**డి**గ్రీ కోర్సులను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో అందించాలనే నిర్ణయం మంచిదే. కాని కొన్ని కోర్సుల విషయంలో ప్రాక్టికల్ ఓరియెంటేషన్ తప్పనిసరి. దీనిని పరిగణనలోకి తీసుకుని విధి విధానాలు ఖరారు చేస్తే.. ఆన్‌లైన్ కోర్సుల్లో చేరిన వారికి ఉపయుక్తంగా ఉంటుంది. అదేవిధంగా విద్యార్థులకు ఐసీటీ టూల్స్, ఇతర మౌలిక సదుపాయాలు కూడా ఎంతో కీలకం. వీటన్నింటినీ పకడ్బందీగా ఏర్పాటు చేసి కోర్సులు ప్రారంభించాలి.

– ప్రొఫెసర్ డి.ఎన్. రెడ్డి, డైరెక్టర్,
C.R.Rao AIMSCS,
యూజీసీ మాజీ సభ్యులు

### 'ఆన్‌లైన్'తోపాటు ఆఫ్‌లైన్




ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల విధానం ఆహ్వానించదగ్గ పరిణామమేనని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ లభించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కోర్సు వ్యవధిలో కొంత సమయం ప్రాక్టికల్ ఓరియెంటేషన్‌కు, క్లాస్‌రూమ్ ఇంటరాక్షన్‌కు కేటాయించాలంటున్నారు. తద్వారా విద్యార్థులు తాము ఆన్‌లైన్ విధానంలో నేర్చుకున్న అంశాల్లో తలెత్తే సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. అంతేకాకుండా కంపెనీల అవసరాలను తెలుసుకొని తమ నైపుణ్యాలు మెరుగుపరచుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

---

### ఉద్యోగ సమాచారం

**ఇర్కాన్-76**

**న్యూఢిల్లీ**లోని భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్..76 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-41
   - **విభాగాలు:** సివిల్-32, ఎలక్ట్రికల్-7, సైన్స్ అండ్ టెక్నాలజీ-2.
2. టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్-35
   - **విభాగాలు:** సివిల్-25, ఎలక్ట్రికల్-9, సైన్స్ అండ్ టెక్నాలజీ-1.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్), ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయసు:** జనవరి 1, 2020 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 15, 2020
- **వెబ్‌సైట్:** www.ircon.org

### కెరీర్ కౌన్సెలింగ్

**నేటి** టెక్నాలజీ యుగంలో కోర్సులు, కొలువులు, కెరీర్స్ రూపరేఖలు వేగంగా మారిపోతున్నాయి. రోజుకో టెక్నాలజీ తెరపైకి వస్తోంది. ఎన్నో రకాల ఉద్యోగాలు.. రకరకాల కోర్సులు.. విభిన్న నైపుణ్యాలు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం జాబ్ మార్కెట్ ట్రెండ్ ఎలా ఉంది.. ఏ కోర్సు చేస్తే.. ఎలాంటి ఉద్యోగం లభిస్తుంది.. భవిష్యత్ అవకాశాలు ఎలా ఉంటాయి.. ఇలా కెరీర్ ఎంపికలో మీ సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మీరు చేయాల్సిందల్లా.. మీ సందేహాలను **sakshieducation@gmail.com**కు మెయిల్ చేయడమే!!

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...




PHYSICS

# ఏది బెటర్.. ఎందుకు!

## ఎంబీఏ వర్సెస్ ఎంసీఏ

ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్).. కంప్యూటర్ లాంగ్వేజ్‌లు, సాఫ్ట్‌వేర్, ప్రోగ్రామింగ్స్‌పై ప్రావీణ్యం సంపాదించడానికి ఉపయోగపడే కోర్సు. ఎంబీఏ (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్).. వ్యాపార నిర్వహణలో మెళకువలు నేర్చుకోవడానికి ఉపయోగపడే చదువు. రెండూ భిన్న స్వరూపాలు కలిగిన కోర్సులు. ఇప్పుడు చాలామంది విద్యార్థులకు బీటెక్/ డిగ్రీ పూర్తయిన వెంటనే ఎంబీఏలో చేరాలా లేదా ఎంసీఏ చదవాలా అనే ప్రశ్న ఎదురవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంసీఏలో చేరాలనుకునే వారికి ఉండాల్సిన అర్హతలేమిటి.. ఎంబీఏకున్న సానుకూల-ప్రతికూల అంశాలేమిటి.. ఎంబీఏ, ఎంసీఏతో ఎలాంటి కెరీర్ అవకాశాలు లభిస్తాయో తెలుసుకుందాం...

### దూరదృష్టి ముఖ్యం


ఎంసీఏ/ఎంబీఏ కోర్సు ఎంపికలో దూరదృష్టి ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే.. సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ విధానాల్లో వేగంగా మార్పులొస్తున్నాయి. అందుకే రాబోయే మార్పులను పరిగణనలోకి తీసుకొని.. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే విధంగా కోర్సు ఎంపిక చేసుకోవాలి. జాబ్ మార్కెట్ ట్రెండ్‌తో పాటు విద్యార్థి స్వీయ సామర్థ్యాలు, అభిరుచికి అనుగుణంగా నప్పే కోర్సులో చేరాలి. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన తర్వాత.. ఎంబీఏనా లేదా ఎంసీఏలో చేరాలా అనే విషయాన్ని ఏడాది ముందే నిర్ణయించుకోవాలి. కోర్సు ఎంపికపై స్పష్టత వచ్చాక.. ఐసెట్, క్యాట్, గ్మాట్, ఏటీఎంఏ, మ్యాట్, సీమ్యాట్ వంటి పరీక్షల్లో అర్హత కోసం ప్రయత్నం చేయాలి.

### దేనికదే ప్రత్యేకం..!

ఎంసీఏ.. ఎంబీఏల్లో ఏ కోర్సు మంచిది అని బేరీజు వేయడం సాధ్యం కాదు. ఎందుకుంటే.. రెండు కోర్సులూ వేటికవే ప్రత్యేకమైనవి. టెక్నాలజీ, బిజినెస్ రంగాల్లో రెండూ కోర్సులు కీలకమైనవి. ఉద్యోగ అవకాశాల విషయంలోనూ ఏ కోర్సునూ తక్కువ చేయాల్సిన అవసరం లేదు. ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల మధ్య సబ్జెక్టు పరమైన వ్యత్యాసంతో పాటు ఉద్యోగ స్వభావంలో తేడా ఉంటుంది. సాంకేతికపరమైన అంశాలు, కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు, కోడింగ్, కంప్యూటర్ సమస్యల పరిష్కారం, వెబ్ డిజైనింగ్ వంటివి ఎంసీఏలో నేర్పుతారు. అలాగే ఎంబీఏ విషయానికొస్తే సంస్థల ఉత్పత్తికి సంబంధించిన మార్కెటింగ్ వ్యవహారాలు, మానవ వనరుల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల దిద్దుబాటు, సంస్థ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికల రూపకల్పన తదితర అంశాలను బోధిస్తారు. వేతనాలు రెండు కోర్సుల అభ్యర్థులకు బాగానే ఉంటాయి.



హయ్యర్ ఎడ్యుకేషన్




## ఎంసీఏ

**మూడే**ళ్ల ఎంసీఏ కోర్సు పూర్తిగా కంప్యూటర్ అప్లికేషన్స్‌కు సంబంధించినది. ఇందులో ముఖ్యంగా కంప్యూటర్ లాంగ్వేజెస్, ప్రోగ్రామింగ్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, సిస్టమ్ సైన్స్, నాన్-కోర్ కంప్యూటర్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డిజైన్ వంటి అంశాలు ఉంటాయి. కంప్యూటర్‌పై అమితమైన ఆసక్తి, కోడింగ్ చేయగలననే నమ్మకం, ప్రోగ్రామింగ్‌పై అవగాహన ఉంటే ఎంసీఏ తీసుకోవచ్చు. ఈ కోర్సులో చేరాలనుకునే అభ్యర్థులు ఇంజనీరింగ్‌తోపాటు ఎంసీఏ ఉన్న కాలేజీలకు ప్రాధాన్యమివ్వాలి. ఎందుకంటే.. ఇంజనీరింగ్ కోర్సు ఉన్న కాలేజీలో చేరితే మంచి ఫ్యాకల్టీతోపాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు అవకాశం ఉంటుంది. మ్యాథ్స్/స్టాటిస్టిక్స్ సబ్జెక్టుతో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఎంసీఏలో చేరడానికి అర్హులు. బీసీఏ పూర్తి చేసిన వారికి మరింత అనుకూలం. తెలుగు రాష్ట్రాల్లో ఐసెట్ ద్వారా ఎంసీఏ కోర్సుల్లో చేరొచ్చు. టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతూ శరవేగంగా అభివృద్ధి జరుగుతున్న నేటి తరుణంలో కంప్యూటర్ స్కిల్స్ ఉంటే ఉద్యోగాలకు కొదవ లేదు.

### వ్యక్తిగత లక్షణాలు

ఎంసీఏలో చేరాలనుకునే అభ్యర్థులకు » కొత్త టెక్నాలజీలను నేర్చుకోవడం » టీమ్ సభ్యులతో ప్రభావవంతంగా కమ్యూనికేట్ చేయడం » బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధంగా ఉండటం » నూతన సాంకేతికతకు సంబంధించిన తాజా డెవలప్‌మెంట్స్‌ను తెలుసుకోవడంపై ఆసక్తి వంటి వ్యక్తిగత లక్షణాలు ఉండాలి.

### కరిక్యులం

ఈ కోర్సు కరిక్యులంలో » ప్రోగ్రామింగ్ అండ్ డేటా స్ట్రక్చర్ » ఇన్ఫో సిస్టమ్ అనాలసిస్ » డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్స్ » కంప్యూటర్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్ » సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ » ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ » ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ (సీ, జావా..) తదితర అంశాలు ఉంటాయి. వీటితోపాటు బేసిక్ టెక్నికల్ స్కిల్స్ ముఖ్యంగా » విండోస్, లైనక్స్(ఆపరేటింగ్ సిస్టమ్స్) » సీ++, కోర్ జావా(లాంగ్వేజెస్) » ఏఎస్‌పీ.నెట్, హెచ్‌టీఎంఎల్ (వెబ్ టెక్నాలజీస్) » ఏడీఓ.నెట్ (డేటా యాక్సెస్ టెక్నాలజీ) » బేసిక్స్ ఆఫ్ ఎంఎస్ ఎస్‌క్యూఎల్ సర్వర్, ఒరాకిల్ (డేటా బేసెస్) » ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ విజువల్ స్టూడియో, డాట్ నెట్ (టూల్స్)పై అవగాహన ఏర్పడుతుంది.

### లభించే ఉద్యోగాలు

ఎంసీఏ కోర్సు పూర్తిచేసి సబ్జెక్టుపై పట్టు సాధించిన అభ్యర్థులు » సాఫ్ట్‌వేర్ డెవలపర్/ప్రోగ్రామర్ » సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ » వెబ్ డిజైనర్ » సిస్టమ్స్ మేనేజర్ » సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ » జావా డెవలపర్ » క్వాలిటీ అష్యూరెన్స్ ఇంజనీర్ » సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్ » డీబీఏ » ట్రబుల్ షూటర్ » ప్రాజెక్ట్ మేనేజర్ » టెక్నికల్ రైటర్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

### కొలువులిచ్చే కంపెనీలు

» జాతీయ, అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ సంస్థలు » పెద్ద కన్సల్టెన్సీలు » బహుళజాతి సంస్థలు » ప్రభుత్వ రంగం » ప్రైవేట్ రంగం » టెలికాం కంపెనీలు» పభుత్వ రంగ సంస్థలు (ఎన్‌టీపీసీ, గెయిల్, బీహెచ్ఈఎల్) వంటి వాటిల్లో కొలువులు దక్కించుకోవచ్చు.

## ఎంబీఏ

**మా**రుతున్న వ్యాపార, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా ఎంబీఏ రూపురేఖలు మార్చుకుంటోంది. రకరకాల స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఉద్యోగావకాశాలు, ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా అభ్యర్థులు కోర్సును ఎంపిక చేసుకోవాలి. అలాగే ఎంబీఏలో చేరాలనుకునే విద్యార్థులకు వ్యాపార, వాణిజ్య రంగాలపై ఆసక్తి ఉండాలి. మేనేజ్‌మెంట్ విద్యలో స్పెషలైజేషన్ అనేది ఎంబీఏ రెండో ఏడాదిలో ఉంటుంది. హెచ్‌ఆర్, ఫైనాన్స్, మార్కెటింగ్ లతోపాటు ఇటీవల కాలంలో ఎంబీఏలో హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, టెలికం మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, రూరల్ మేనేజ్‌మెంట్, టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, ఎక్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, షిప్పింగ్ అండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్, ఐటీ మేనేజ్‌మెంట్ వంటి స్పెషలైజేషన్‌లు అందుబాటులోకి వస్తున్నాయి.

### ఐసెట్‌తో ప్రవేశం

బ్యాచిలర్ డిగ్రీ/బీటెక్ పూర్తిచేసిన వారు అర్హులు. తెలుగు రాష్ట్రాల్లో ఎంబీఏ చదవాలనుకునే వారు ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఐసెట్) రాయాలి. క్యాట్, మ్యాట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో సాధించిన స్కోర్ ఆధారంగా కూడా ఉన్నత విద్యాసంస్థల్లో ఎంబీఏ విద్యను అభ్యసించే అవకాశం ఉంది. పలు బీస్కూల్స్ కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (సీమ్యాట్) ఆధారంగా సీట్లను భర్తీ చేస్తాయి. ఏఐసీటీఈ అనుమతించిన విశ్వవిద్యాలయాలకు సంబంధించిన విద్యా సంస్థలు, అనుబంధ కళాశాలలు ఈ స్కోరును పరిగణలోకి తీసుకుంటాయి.

### ప్రాథమిక నైపుణ్యాలు

» ఎంబీఏ అభ్యర్థులకు నాయకత్వ లక్షణాలు » టీమ్ వర్క్ » ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ » అనలిటికల్ స్కిల్స్ » చొరవ » మార్పులను స్వాగతించే నేర్పు » కమ్యూనికేషన్ స్కిల్స్ » స్ట్రాటజిక్ థింకింగ్ అండ్ ప్లానింగ్ ఎబిలిటీస్ » గ్లోబల్ ఓరియెంటేషన్ » టైమ్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ » క్రియేటివ్ థింకింగ్ » అవుట్ ఆఫ్ ది బాక్స్ థింకింగ్ వంటి ప్రాథమిక నైపుణ్యాలు ఉండాలి.

### కరిక్యులం

ఎంబీఏ కరిక్యులంలో ప్రధానంగా » ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అండ్ అనాలసిస్ » ఆర్గనైజేషనల్ బిహేవియర్ » ప్రిన్సిపుల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ » ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ » ఆపరేషనల్ మేనేజ్‌మెంట్ » కాస్టింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ » కార్పొరేట్ ఫైనాన్స్ » స్ట్రాటజీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ » మార్కెటింగ్ » బిజినెస్ రీసెర్చ్ మెథడ్స్ తదితర అంశాలు ఉంటాయి.

### జాబ్ ప్రొఫైల్స్

కోర్సు పూర్తిచేసుకున్న అభ్యర్థులకు తమ నైపుణ్యాలకు అనుగుణంగా » బిజినెస్ మేనేజర్ » ఎగ్జిక్యూటివ్ రిక్రూటర్ » ఫైనాన్స్ మేనేజర్ » అడ్వర్టయిజింగ్ ఎగ్జిక్యూటివ్ » మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

### ఉద్యోగాలిచ్చే రంగాలు

» రిటైల్ ఇండస్ట్రీ » కన్సల్టెన్సీలు » హాస్పిటల్ ఇండస్ట్రీ » అడ్వర్టయిజింగ్ ఇండస్ట్రీ » బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ » మీడియా హౌసెస్ » డిజిటల్ మార్కెటింగ్ » విద్యారంగం » ఐటీ రంగం.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
11-2-2020

## పాకిస్తాన్ ఘన విజయం



బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్తాన్ ఇన్నింగ్స్, 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 126/6తో సోమవారం ఆట కొనసాగించిన బంగ్లా తమ రెండో ఇన్నింగ్స్‌లో 168 పరుగులకు ఆలౌటైంది. 17.2 ఓవర్లలో ఆ జట్టు మరో 42 పరుగులు జోడించిన మిగిలిన 4 వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ మోమినుల్ హక్ (41) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో 'హ్యాట్రిక్' సహా మొత్తం 5 వికెట్లు పడగొట్టిన నసీమ్ షాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ మ్యాచ్ తర్వాత బంగ్లాదేశ్ స్వదేశం తిరిగి వెళ్లనుంది. పునరాగమనం తర్వాత ఏప్రిల్ 5నుంచి కరాచీలో రెండో టెస్టు జరుగుతుంది.



శ్రీకాంత్



సాయిప్రణీత్



ప్రణయ్

# కజకిస్తాన్‌తో భారత్ తొలి పోరు

### నేటి నుంచి ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

**మనీలా (ఫిలిప్పీన్స్):** కరోనా వైరస్ భయాందోళనల్ని పక్కనబెట్టి పతకమే లక్ష్యంగా బరిలోకి దిగేందుకు భారత పురుషుల జట్టు సిద్ధమైంది. ఈ ఈవెంట్‌లో భారత్ పూర్తిస్థాయి జట్టుతో తలపడనుంది. ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య విజేత భమిడిపాటి సాయిప్రణీత్, హెచ్.ఎస్.ప్రణయ్, శుభాంకర్ డే, లక్ష్యసేన్‌లు ఒలింపిక్ ఏడాది సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. నాలుగేళ్ల క్రితం 2016లో భారత పురుషుల జట్టు కాంస్యం నెగ్గింది. ఇప్పుడు ఈ పతకం వన్నె మార్చాలనే లక్ష్యంతో ఆటగాళ్లు పోటీ పడనున్నారు. ముందుగా భారత్‌కు క్లిష్టమైన డ్రా ఎదురైంది. రెండు సార్లు చాంపియన్ అయిన ఇండోనేసియా, ఫిలిప్పీన్స్‌లతో కలిసి గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్ కరోనా పుణ్యమాని ఇప్పుడు మలేసియా, కజకిస్తాన్‌లతో గ్రూప్ 'బి'కి మారింది. వైరస్ ప్రభావమున్న చైనా, హాంకాంగ్‌లను ఫిలిప్పీన్స్ ప్రభుత్వం నిషేధించడంతో 'డ్రా' షెడ్యూలును మార్చారు. బ్యాడ్మింటన్‌లో కజకిస్తాన్ కష్టమైన ప్రత్యర్థి కాదు. దీంతో ఈ జట్టుతో మంగళవారం జరిగే పోరులో భారత్ గెలుపు ఖాయమవుతుంది. అయితే గురువారం మలేసియాతోనే భారత్‌కు కష్టాలు తప్పవు. ఆ జట్టులో ప్రపంచ 14వ ర్యాంకర్ లీ జి జియా, 2014 యూత్ ఒలింపిక్స్ చాంపియన్ చీమ్ జున్ వీ, ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మూడుసార్లు రన్నరప్ అయిన హవ్ లియాంగ్ జున్‌లు ఉండటంతో భారత్ చెమటోడ్చాల్సిన అవసరముంది. కాగా... ప్రాణాంతక వైరస్ భయంతో భారత మహిళల జట్టు ఈ టోర్నీకి దూరమైంది.

## ఇకపై ఆకర్షణీయంగా 'బాయ్' టోర్నీలు

**న్యూఢిల్లీ:** దేశవాళీ టోర్నీలను మరింత రసవత్తరంగా, ఆకర్షణీయంగా నిర్వహించేందుకు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) సిద్ధమవుతోంది. మ్యాచ్‌ల్లో పోటీ పెంచేందుకు కేటగిరీల వారీగా నిర్వహిస్తుంది. అలాగే ప్రైజ్‌మనీని కూడా భారీగా పెంచింది. మొత్తం రూ. 2 కోట్ల ప్రైజ్‌మనీతో ఏడాది పొడవునా మూడు దశల్లో బాయ్ ఈవెంట్లు జరుగనున్నాయి. లెవెల్ 1, 2, 3 టోర్నీలు నిర్వహించాలని బాయ్ ఆదివారం జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీలో నిర్ణయించింది. సీనియర్ కేటగిరీలో 'బాయ్ ప్రీమియర్ సూపర్ సిరీస్ టోర్నీ'ని లెవెల్ 1 స్థాయిలో నిర్వహిస్తారు. లెవెల్ 2లో నాలుగు 'బాయ్ సూపర్ సిరీస్ టోర్నీలు' జరుగుతాయి. ఇక లెవెల్ 3లో ఆరు 'బాయ్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీ'లను నిర్వహిస్తారు. మేటి ర్యాంకింగ్‌ల ఆధారంగా ఆయా టోర్నీల్లో నేరుగా మెయిన్ డ్రా ఆడే అవకాశం కల్పిస్తారు. అగ్రశ్రేణి క్రీడాకారులు జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొనేందుకు ముందుగా రావాలనేది కూడా కొత్త ప్రణాళికలో భాగం.

# క్లీన్‌స్వీప్ తప్పించుకుంటారా!

### నేడు భారత్, న్యూజిలాండ్ మూడో వన్డే

### ఒత్తిడిలో టీమిండియా • జోరు మీదున్న కివీస్

**ఉ.గం.7.30నుంచి స్టార్ స్పోర్ట్స్-1 లో ప్రత్యక్ష ప్రసారం**

**మౌంట్ మాంగనీ:** న్యూజిలాండ్ గడ్డపై భారత పరిమిత ఓవర్ల పోరు చివరి దశకు వచ్చింది. నేడు ఇక్కడి బే ఓవల్‌లో జరిగే మూడో వన్డేలో ఇరు జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే రెండు మ్యాచ్‌లు కివీస్ నెగ్గడంతో సిరీస్ ఫలితంపై ఈ మ్యాచ్ ప్రభావం లేదు. అయితే వన్డేల్లోనూ తమ బలాన్ని నిరూపించుకునే ప్రయత్నంలో భారత్‌కు ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం కీలకం కానుంది. కెప్టెన్ విలియమ్సన్ పునరాగమనం కివీస్ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.

### పంత్‌కు చాన్స్!

టి20ల్లో అద్భుత ప్రదర్శన తర్వాత వన్డేల్లో భారత్‌కు ఎదురైన పరాజయాలు అనూహ్యం. వన్డేలకు ఈ ఏడాది పెద్దగా ప్రాధాన్యత లేదని కోహ్లి చెప్పుకున్నా సరే...ఓటమి అంగీకరించాల్సిందే. ఈ మ్యాచ్ కోసం భారత్ రెండు మార్పులతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. న్యూజిలాండ్‌లో అడుగు పెట్టినదగ్గరినుంచి ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం రాని రిషభ్ పంత్‌ను తుది జట్టులోకి ఎంచుకోవచ్చు. అప్పుడు రాహుల్‌ను పక్కన పెట్టడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. ఆరో స్థానం కోసం కూడా జాదవ్ పోటీ ఎదుర్కొంటున్నాడు. ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్న జాదవ్‌కు బదులుగా పాండేకు అవకాశం ఇవ్వాలని చాలా రోజులుగా చర్చ జరుగుతోంది. అయితే గత మ్యాచ్ మినహా తనకు వచ్చిన పరిమిత అవకాశాల్లోనూ రాణించిన జాదవ్‌కు ఇది ఆఖరి అవకాశం కావచ్చు. దూబే ఒక మ్యాచ్ కోసం ఎదురు చూస్తున్నాడు. బౌలింగ్ విభాగంలో గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న షమీ మళ్లీ జట్టులోకి రానున్నాడు. కీలకమైన టెస్టు సిరీస్‌కు ముందు బుమ్రాకు ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి నివ్వాలని మేనేజ్‌మెంట్ అనుకుంటోంది. అయితే తుది జట్టులో ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నా భారత్ లక్ష్యం మాత్రం ఎలాగైనా మ్యాచ్ గెలిచి క్లీన్‌స్వీప్‌నుంచి తప్పించుకోవడమే.

### కెప్టెన్ వచ్చాడు...

గాయంతో గత రెండు మ్యాచ్‌లకు దూరమైన కేన్ విలియమ్సన్ కోలుకొని బరిలోకి దిగుతున్నాడు. బే ఓవల్ అతని సొంత మైదానం కావడం విశేషం. టి20ల్లో సిరీస్ చేజార్చుకున్నా కేన్ మాత్రం అద్భుతంగా ఆడాడు. అతనితో పాటు ఫామ్‌లో ఉన్న రాస్ టేలర్ జత కలిస్తే ఆతిథ్య జట్టు బలం పెరగడం ఖాయం. ఓపెనర్లు గప్టిల్, నికోల్స్ కూడా రాణిస్తుండగా మిడిలార్డర్‌లో లాథమ్ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. ఆల్‌రౌండర్లు నీషమ్, గ్రాండ్‌హోమ్ చెలరేగితే చాలు బ్యాటింగ్ పరంగా కివీస్‌కు ఎలాంటి సమస్యలు లేనట్లే. బౌలింగ్‌లో మాత్రం కీలక ఆటగాళ్లు లేని లోటు వారిని ఇంకా వెంటాడుతూనే ఉంది. అయితే గత మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన జేమీసన్ తన సత్తా ఏమిటో చూపించాడు. అతనికి ఇతర బౌలర్లు సహకరిస్తే భారత్‌కు కట్టడి చేయడం కష్టం కాకపోవచ్చు.



విలియమ్సన్



సరిగ్గా ఏడాది క్రితం భారత జట్టు న్యూజిలాండ్‌లో పర్యటించింది. అప్పుడు టి20 సిరీస్ కోల్పోయిన టీమిండియా వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. ఈ సారి సీన్ రివర్స్‌గా మారింది. టి20ల్లో జయభేరి అనంతరం వన్డే సిరీస్‌ను చేజార్చుకుంది. అయితే ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో ప్రత్యర్థిని క్లీన్‌స్వీప్ చేసిన కోహ్లి సేన వన్డేల్లో అలాంటి పరాభవం తమకు ఎదురు కాకుండా చూసుకోవాల్సిన స్థితిలో నిలిచింది. ఈ నేపథ్యంలో ఎలాగైనా నెగ్గాలనే పట్టుదలతో భారత్... సరైన రీతిలో ప్రతీకారం తీర్చుకోవాలనే లక్ష్యంతో న్యూజిలాండ్ చివరిదైన మూడో వన్డేలో సన్నద్ధమయ్యాయి.

**పిచ్, వాతావరణం**

నెమ్మదైన వికెట్. బౌలర్లకు కూడా కాస్త అనుకూలిస్తుంది. భారీ స్కోర్లకు అవకాశం తక్కువ. మ్యాచ్ రోజు వర్ష సూచన లేదు.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** కోహ్లి (కెప్టెన్), మయాంక్, పృథ్వీ షా, అయ్యర్, రాహుల్/ పంత్, జాదవ్/ పాండే, జడేజా, చహల్, సైనీ, షమీ

**న్యూజిలాండ్:** విలియమ్సన్ (కెప్టెన్), గప్టిల్, నికోల్స్, టేలర్, లాథమ్, నీషమ్, గ్రాండ్‌హోమ్, సౌతీ, జేమీసన్, సోధి, బెన్నెట్

**1989 - మూడు లేదా అంతకన్నా ఎక్కువ వన్డేలు ఉన్న ద్వైపాక్షిక సిరీస్‌లలో భారత్ ఆఖరి సారిగా క్లీన్‌స్వీప్‌కు గురైన ఏడాది. నాడు విండీస్ 5-0తో భారత్‌ను చిత్తు చేసింది.**

# హారిక గెలుపు

**సెయింట్ లూయిస్ (అమెరికా):** కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్స్ ద్రోణవల్లి హారిక, కోనేరు హంపి జోరు కొనసాగుతోంది. మాజీ ప్రపంచ చాంపియన్ అలెగ్జాండ్రా కోస్టెనిక్ (రష్యా)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో హారిక 57 ఎత్తుల్లో సంచలన విజయాన్ని సాధించింది. దీంతో 2 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. మరో బోర్డులో ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో జరిగిన గేమ్‌ను హంపి 22 ఎత్తుల్లో డ్రా చేసుకుని 1.5 పాయింట్లతో నిలిచింది. పదిమంది అగ్రశ్రేణి క్రీడాకారుల మధ్య ఈ టోర్నీ జరుగుతోంది.

## 'రైజింగ్ స్టార్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా వివేక్ సాగర్

**న్యూఢిల్లీ:** భారత హాకీ జట్టులో ఇటీవల విశేషంగా రాణిస్తోన్న యువ హాకీ క్రీడాకారుడు వివేక్ సాగర్ ప్రసాద్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) గుర్తించింది. 2019 ఏడాదికిగానూ ఎఫ్‌ఐహెచ్ ' రైజింగ్ స్టార్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా మిడ్ ఫీల్డర్ వివేక్ సాగర్‌ను ఎంపిక చేసింది. ఈ అవార్డు కోసం పోటీపడిన వారిలో 19 ఏళ్ల వివేక్ సాగర్ విజేతగా నిలవగా... మైకో కాసెలా (అర్జెంటీనా), బ్లేక్ గోవర్స్ (ఆస్ట్రేలియా) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా వివేక్ సాగర్‌ను హాకీ ఇండియా అధ్యక్షుడు మొహమ్మద్ ముస్తాక్ అహ్మద్ అభినందించారు. 2018లో 17 ఏళ్ల వయస్సులో వివేక్ సాగర్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. 2019లో భువనేశ్వర్ వేదికగా జరిగిన ఎఫ్‌ఐహెచ్ పురుషుల హాకీ సిరీస్ ఫైనల్స్ గెలిచిన భారత జట్టులో అతను సభ్యుడు. గతేడాది నవంబర్‌లో జరిగిన ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలోనూ వివేక్ సాగర్ కీలక పాత్ర పోషించాడు.





ఆదివారం విజయం సాధించాక బంగ్లాదేశ్ ఆటగాళ్ల సంబరాలు

## విషాదాన్ని దిగమింగి... విజయం దిశగా సాగి...

**ఢాకా:** బంగ్లాదేశ్ అండర్-19 జట్టు సారథి అక్బర్ అలీ విషాదాన్ని దిగమింగి విజయం దిశగా సాగిన తీరు ప్రశంసలందుకుంటోంది. అతని ప్రియమైన సోదరి ఖదీజా ఖాతున్ గత నెల 22న ఇద్దరు కవలలకు జన్మనిచ్చి కనుమూసింది. అప్పుడు బంగ్లా జట్టు లీగ్ దశ మ్యాచ్‌లు ఆడుతోంది. అతని కుటుంబ సభ్యులెవరూ ఈ విషయాన్ని అతనికి తెలియకుండా జాగ్రత్త పడ్డారు. చివరకు 24న పాకిస్తాన్‌తో మ్యాచ్ ముగిశాక అక్బర్ తన అన్నకు ఫోన్ చేస్తే తెలిసింది. దీనిపై తనకు అప్పుడే ఎందుకు చెప్పలేదని అక్బర్ ఫోన్‌లోనే వాపోయాడు. అక్బర్, ఖదీజాలిద్దరి మధ్య చక్కని బంధం ఉండేది. తన సోదరి అకాల మరణవార్తతో ఖిన్నుడైన అక్బర్... ఓ పక్క కొండంత బాధను భరిస్తూనే... సారథిగా తన జట్టు కోసం శ్రమించాడు. ఫైనల్లో జట్టు ఓటమి కోరల్లో ఉండగా మొండిగా భారత బౌలర్లతో ఆఖరిదాకా పోరాడి జట్టును విశ్వవిజేతగా నిలిపాడు.

# ఐసీసీ చర్యలు తీసుకుంటుంది

### బంగ్లా కుర్రాళ్ల 'అతి'పై భారత మేనేజర్ వ్యాఖ్య

**పాచెఫ్‌స్ట్రూమ్:** అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో బంగ్లాదేశ్ కుర్రాళ్ల శ్రుతిమించిన అతి ఉత్సాహంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చర్యలు తీసుకుంటుందని యువ భారత జట్టు మేనేజర్ అనిల్ పటేల్ తెలిపారు. ఈ విషయాన్ని మ్యాచ్ రిఫరీ గ్రేమ్ లెబ్రూయ్ స్వయంగా తన వద్దకు వచ్చి చెప్పారని ఆయన అన్నారు. 'నిజానికి అసలేం జరిగింది మాకు కచ్చితంగా తెలియదు. కానీ అంతా నిర్ఘాంతపోయారు. ఆఖరు నిమిషాల్లో ఏం జరిగిందనే విషయంపై ఐసీసీ అధికారులు ఆరా తీస్తారు. ఇందు కోసం వీడియో ఫుటేజీలు పరిశీలిస్తారు' అని అనిల్ తెలిపారు. మ్యాచ్ ముగియగానే బంగ్లా కుర్రాళ్ల ఆనందం, వెర్రి తలకెక్కింది. ఒక్కసారిగా మైదానంలోకి దూసుకొచ్చి భారత ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకొని విపరీత ధోరణిలో ప్రవర్తించారు. పేసర్ షరీఫుల్ ఇస్లామ్ అయితే అందరికంటే అతి ఎక్కువ చేశాడు. భారత ఆటగాళ్లకు మరీ దగ్గరగా వచ్చి అనుచిత సంజ్ఞలు చేశాడు. మ్యాచ్ జరిగే సమయంలోనూ షరీఫుల్ బంతి సంధించిన ప్రతీసారి స్లెడ్జింగ్‌కు పాల్పడటం టీవీ కామెంటేటర్లను విస్మయానికి గురిచేసింది. భారత కెప్టెన్ ప్రియమ్ గార్గ్ బంగ్లా ఆటగాళ్ల ప్రవర్తనపై అసంతృప్తి వెలిబుచ్చాడు. 'గెలుపోటములు సహజం. ఆటలో భాగమే. కానీ సంబరమైనా, బాధయినా మనం నియంత్రించుకోవాలి. మరీ ఇంత చెత్తగా స్పందించకూడదు. అతి చేష్టలకు పాల్పడకూడదు' అని అన్నాడు. బంగ్లా సారథి అక్బర్ అలీ కూడా తమ ఆటగాళ్లు మరీ అంత అతిగా స్పందించకుండా ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు.

## బంగ్లా జట్టుకు త్వరలో ఘన సన్మానం

### అధికారికంగా నిర్వహించనున్న ప్రభుత్వం


**ఢాకా:** తమ దేశానికి తొలి ప్రపంచకప్ అందించిన కుర్రాళ్లను బంగ్లాదేశ్ ప్రభుత్వం ఘనంగా సన్మానించనుంది. ఆదివారం బంగ్లా జట్టు యువ భారత్‌ను ఓడించి అండర్-19 ప్రపంచకప్ నెగ్గింది. ఏ స్థాయి క్రికెట్‌లో అయినా బంగ్లాకిదే తొలి ఐసీసీ ప్రపంచ కప్. దీంతో బంగ్లాదేశ్ ప్రభుత్వం అధికారికంగా బహిరంగ సన్మానం నిర్వహించే ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం ప్రధాని షేక్ హసీనా అధ్యక్షతన ప్రత్యేకంగా సమావేశమైన కేబినెట్ కుర్రాళ్లను ఘనంగా సత్కరించాలని నిర్ణయించిందని కేంద్ర రోడ్డు రవాణా మంత్రి ఒబేదుల్ ఖాదర్ వెల్లడించారు. బంగ్లా జట్టు స్వదేశం చేరాక తేదీని ఖరారు చేస్తామని చెప్పారు. దేశరాజధానిలో ఉన్న సుహ్రావర్ది ఉద్యాన్ గ్రౌండ్స్‌లో సన్మాన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆ దేశ చరిత్రలో సీనియర్ జట్టు ఇప్పటివరకు ఐసీసీ టోర్నీల్లో వన్డే, టి20 ప్రపంచకప్‌లు నెగ్గలేదు. దీంతో ఆ ముచ్చట ఇప్పుడు కుర్రాళ్ల జట్టుతో సాకారం కావడంతో బంగ్లాదేశ్‌లో సంబరాలు మిన్నంటాయి.

## ముగ్గురు భారత ఆటగాళ్లకు చోటు

**దుబాయ్:** ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌లో విశేషంగా రాణించిన భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఐసీసీ జట్టులో చోటు దక్కింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో అతను 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు అందుకున్నాడు. తుది పోరులో తడబడిన డిఫెండింగ్ చాంపియన్ టైటిల్ నిలబెట్టుకోలేకపోయింది. అయితే ఐసీసీ ప్రపంచకప్ జట్టులో మాత్రం భారత్ నుంచి ముగ్గురికి చోటు లభించింది. స్పిన్నర్ రవి బిష్ణోయ్, పేసర్ కార్తీక్ త్యాగిలు ఈ జట్టులో ఉన్నారు. బంగ్లా విజయసారథి అక్బర్ అలీ ఈ జట్టు కెప్టెన్. ఆరు మ్యాచ్‌ల్లో జైస్వాల్ అద్భుతమైన 133 సగటుతో 400 పరుగులు చేశాడు.

**ఐసీసీ ప్రపంచకప్ జట్టు:** యశస్వి జైస్వాల్, బిష్ణోయ్, త్యాగి (భారత్), ఇబ్రహీమ్, గఫారి (అఫ్గాన్), రశాంత (శ్రీలంక), మహ్మదుల్, షహదత్, అక్బర్ అలీ (కెప్టెన్, బంగ్లాదేశ్), నైమ్ యంగ్, సీలెస్ (వెస్టిండీస్), 12వ ఆటగాడు అఖిల్ కుమార్ (కెనడా).

# 'ఎ' జట్ల రెండో టెస్టు డ్రా



### అజింక్య రహానే సెంచరీ

**లింకన్:** న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత వైస్ కెప్టెన్ అజింక్య రహానే 'ఎ' జట్టు తరపున అజేయ సెంచరీతో సత్తా చాటాడు. భారత్ 'ఎ', న్యూజిలాండ్ 'ఎ' జట్ల మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్టు సోమవారం డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 234/1తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 467 పరుగులు చేసింది. అజింక్య రహానే (148 బంతుల్లో 101 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్) శతకం సాధించగా... విజయ్ శంకర్ (103 బంతుల్లో 66; 9 ఫోర్లు) రాణించాడు. ఆదివారం సెంచరీ పూర్తి చేసిన శుబ్‌మన్ గిల్ (136), చతేశ్వర్ పుజారా (66) తమ స్కోర్లకు మరికొన్ని పరుగులు జోడించారు. ఆంధ్ర వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ కేఎస్ భరత్ (22) విఫలమయ్యాడు. తాజా ఫలితంతో ఇరు జట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్ 0-0తో డ్రాగా ముగిసింది.

# అత్యుత్తమ ఆటగాడిగా వార్నర్

**మెల్‌బోర్న్:** నిషేధం తర్వాత పునరాగమనం చేసిన ఏడాది లోపే డేవిడ్ వార్నర్ మళ్లీ ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఉచ్ఛ స్థితికి చేరుకున్నాడు. క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించిన వార్షిక అవార్డుల్లో డేవిడ్ వార్నర్ అత్యుత్తమ ఆటగాడిగా 'అలన్ బోర్డర్ మెడల్'ను అందుకున్నాడు. వార్నర్ ఈ ఘనత సాధించడం ఇది మూడోసారి. 2016, 2017లలో కూడా అతనికి ఈ పురస్కారం దక్కింది. 2019 జనవరి 8 నుంచి 2020 జనవరి 9 వరకు అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనను బట్టి ఓటింగ్ ఆధారంగా ఈ అవార్డును ఎంపిక చేస్తారు. ఈ మధ్య కాలంలో వార్నర్ మూడు ఫార్మాట్‌లలో కలిపి 1815 పరుగులు చేశాడు. 194 ఓట్లు సాధించిన వార్నర్ ఒకే ఒక ఓటు తేడాతో స్టీవ్ స్మిత్ (193)ను వెనక్కి తోయడం విశేషం. ప్యాట్ కమిన్స్‌కు 185 ఓట్లు పడ్డాయి. మహిళల విభాగంలో ఎలైస్ పెరీ అత్యుత్తమ ప్లేయర్‌గా 'బెలిండా క్లార్క్ మెడల్'ను అందుకుంది. మార్నస్ లబ్‌షేన్ (టెస్టు), ఆరోన్ ఫించ్ (వన్డే), వార్నర్ (టి20), మహిళల విభాగంలో అలీసా హీలీ (వన్డే, టి20) ఉత్తమ ప్లేయర్లుగా ఇతర అవార్డులు అందుకున్నారు.

# రూ. 63 కోట్ల చేతి ప్రతి!



అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్, రష్యా కోటీశ్వరుడు అలీషర్ ఉస్మానోవ్ చేతుల్లో కనిపిస్తున్న ఈ రాత ప్రతి విలువ అక్షరాలా రూ. 63 కోట్లు! ఒలింపిక్ క్రీడల నిర్వహణపై తన విజన్‌ను చెబుతూ 'ఆధునిక ఒలింపిక్ పితామహుడు' పియర్రీ డి క్యూబర్టీన్ స్వయంగా రాసుకున్న 14 పేజీల డాక్యుమెంట్ ఇది. ఇటీవల జరిగిన వేలంలో ఉస్మానోవ్ దీనిని 8.8 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 63 కోట్లు)కు సొంతం చేసుకున్నాడు. దానిని ఇప్పుడు లాసానేలోని ఒలింపిక్ మ్యూజియంలో ఉంచమంటూ తానే బహుమతిగా అందించాడు. క్రీడల చరిత్రలో వేలం ద్వారా ఒక స్మారకం లేదా జ్ఞాపికకు లభించిన అత్యధిక మొత్తం ఇదే కావడం విశేషం. గతంలో అమెరికా బేస్‌బాల్ ఆటగాడు బేబ్ రూత్ ధరించిన 'న్యూయార్క్ యాంకీస్' టీమ్ జెర్సీ 5.64 మిలియన్ డాలర్లకు (రూ. 40 కోట్లు) అమ్ముడుపోయింది.

epaper.sakshi.com

సాక్షి బిజినెస్
మంగళవారం
11-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 162 ▼ | 40,980 |
| నిఫ్టీ | 66 ▼ | 12,032 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,570 | ▲ 50 |
| డోజోన్స్ | 29,137 | ▲ 35 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,447 | ▼ 20 |
| డాక్స్ | 13,494 | ▼ 20 |
| షాంఘై | 2,890 | ▲ 15 |
| నికాయ్ | 23,686 | ▼ 142 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| $ యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.65 | 72.29 |
| £ బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 90.61 | 93.80 |
| € యూరో | ఎస్‌బీఐ | 76.83 | 79.70 |
| ¥ జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.90 | 66.29 |
| AU$ ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.98 | 49.16 |
| S$ సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.55 | 52.29 |
| SAR సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.22 | 19.83 |
| UAE D యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.95 | 19.95 |
| ¥ చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.59 | 11.00 |

# గ్రీస్ విమానాశ్రయం ప్రాజెక్ట్ జీఎంఆర్ చేతికి




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ కంపెనీ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) గ్రీస్ క్రీట్‌లోని హెరాక్లియోన్ అంతర్జాతీయ విమానాశ్రయం డిజైన్, నిర్మాణం, ఫైనాన్సింగ్, ఆపరేషన్, నిర్వహణ బిడ్‌ను దక్కించుకుంది. దీంతో యూరోపియన్ ఎయిర్‌పోర్ట్ నిర్వహణ బిడ్ గెలిచిన తొలి భారతీయ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్‌గా జీఎంఆర్ నిలిచింది. జీఏఎల్, దాని గ్రీస్ భాగస్వామి జీఈకే టెర్నా కన్సార్టియం గతేడాది ఫిబ్రవరిలో కన్సెషన్ అగ్రిమెంట్ మీద సంతకాలు చేసిన విషయం తెలిసిందే. విమానాశ్రయ అభివృద్ధికి ఈ కన్సార్టియం 500 మిలియన్ యూరోలకు పైగా పెట్టుబడులు పెట్టనుంది. ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ నిర్మాణానికి గ్రీస్ ప్రధాన మంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ పునాది రాయి వేశారు. ఈ సందర్భంగా జీఎంఆర్ గ్రూప్ ఎనర్జీ అండ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాలా మాట్లాడుతూ.. హెరాక్లియోన్ విమానాశ్రయ బిడ్‌తో జీఎంఆర్ గ్రూప్ ఈయూ రీజియన్‌కు ఎంట్రీ ఇచ్చినట్లయిందన్నారు. ప్రతిష్టాత్మక ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కావటం ఆనందంగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తామని చెప్పారు. ప్రాజెక్ట్ కన్సెషన్ పీరియడ్ 35 ఏళ్లు. ఈ ప్రాజెక్ట్‌కు స్థానిక గ్రీస్ ప్రభుత్వం ఈక్విటీ, ఇప్పటికే ఉన్న ఎయిర్‌పోర్ట్స్ నుంచి నిధులను సమకూరుస్తుంది. హెరాక్లియోన్ గ్రీస్‌లోని రెండో అతిపెద్ద విమానాశ్రయం. గత మూడేళ్లుగా 10 శాతం ట్రాఫిక్ వృద్ధిని నమోదు చేస్తుంది. ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక ప్రాంతాల్లో గ్రీస్ ఒకటి. ఏటా 33 మిలియన్ల మంది పర్యాటకులు వస్తుంటారు. క్రిట్ అత్యధిక పర్యాటకులను ఆకర్షించే ద్వీపం.

## రేటు కోత బాటలో బ్యాంక్ ఆఫ్ బరోడా...



**న్యూఢిల్లీ:** రుణ రేటు కోత బాటలో తాజాగా బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కూడా నిలిచింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్ఆర్) రుణ రేటును 10 బేసిస్ పాయింట్ల వరకూ తగ్గిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. కొత్త రేట్లు ఫిబ్రవరి 12వ తేదీ నుంచీ అమల్లోకి వస్తాయి. తాజా రేట్లను పరిశీలిస్తే...

- గృహ, ఆటో, వ్యక్తిగత రుణాలకు అనుసంధానమయ్యే ఏడాది ఎంసీఎల్ఆర్ 8.25 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గింది.
- నెల రేటు 5 బేసిస్ పాయింట్ల తగ్గుదలతో 7.55 శాతానికి చేరింది.

# యూనియన్ బ్యాంకు ఆకర్షణీయ ఫలితాలు

- నాలుగు రెట్లు పెరిగిన నికర లాభం
- రూ.575 కోట్లుగా నమోదు




**న్యూఢిల్లీ:** యూనియన్ బ్యాంకు డిసెంబర్ త్రైమాసిక ఫలితాల్లో మంచి పనితీరు ప్రదర్శించింది. బ్యాంకు స్టాండలోన్ లాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.153 కోట్లతో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగి రూ.575 కోట్లకు చేరుకుంది. బ్యాంకు ఆదాయం కూడా రూ.9,573 కోట్ల నుంచి రూ.10,741 కోట్లకు దూసుకుపోయింది. బ్యాంకు ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 15.66 శాతం నుంచి 14.86 శాతానికి (మొత్తం రుణాల్లో రూ.49,923 కోట్లు) తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 8.27 శాతం నుంచి 6.99 శాతానికి (రూ.21,510 కోట్లు) తగ్గుముఖం పట్టాయి. ఎన్‌పీఏల కోసం చేసిన కేటాయింపులు రూ.1,570 కోట్లుగా ఉన్నాయి. ఇక కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం బ్యాంకు నికర లాభం రూ.554 కోట్లుగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.183 కోట్లు. ఆదాయం రూ.9,757 కోట్ల నుంచి రూ.10,985 కోట్లకు పెరిగింది. ఆంధ్రా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకులను యూనియన్ బ్యాంకు విలీనం చేసుకోనున్న సంగతి తెలిసిందే.

## 25 శాతం తగ్గిన గెయిల్ నికర లాభం



**న్యూఢిల్లీ:** గెయిల్ నికర లాభం డిసెంబర్ క్వార్టర్‌లో 25 శాతం తగ్గింది. సహజ వాయువు, ఎల్‌పీజీ, లిక్విడ్ హైడ్రోకార్బన్ల మార్కెటింగ్ మార్జిన్లు క్షీణించడంతో రూ.1,250 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. షేరు వారీ ఆర్జన రూ.2.77గా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి నికర లాభం రూ.1,681 కోట్లుగా ఉండడం గమనార్హం. సహజ వాయువు మార్కెటింగ్ ద్వారా వచ్చే ఆదాయం 9.5 శాతం తగ్గి రూ.14,663 కోట్లుగా ఉంది. ఈ విభాగం లాభం 31 శాతం తగ్గి రూ.466 కోట్లుగా నమోదైంది. గ్యాస్ పంపిణీ విభాగంలో ఆదాయం, లాభాలు డబుల్‌డిజిట్ స్థాయిలో వృద్ధి చెందాయి. పెట్రో కెమికల్ వ్యాపారం రూ.8.51 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. కంపెనీ మొత్తం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.19,789 కోట్ల నుంచి రూ.17,769 కోట్లకు పరిమితమైంది. త్రైమాసికం వారీగా చూస్తే సెప్టెంబర్ క్వార్టర్‌లో వచ్చిన నికర లాభం కంటే డిసెంబర్ త్రైమాసికంలో లాభం 18 శాతం పెరిగినట్టు గెయిల్ తెలిపింది. ఒక్కో షేరుకుగాను రూ.6.40 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇచ్చేందుకు కంపెనీ బోర్డు నిర్ణయం తీసుకుంది.

## రియల్‌మీ నుంచి సీ3 ఫోన్



**న్యూఢిల్లీ:** రియల్‌మీ నుంచి ఎంట్రీ లెవల్ ఫోన్ సీ3 విడుదలైంది. దీని ధరలను కంపెనీ రూ.8,000లోపే నిర్ణయించడం గమనార్హం. 3జీబీ, 32జీబీతో ఒక వేరియంట్ ధర రూ.6,999 కాగా, 4జీబీ, 64జీబీ వేరియంట్ ధర రూ.7,999. ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు మొదటి విడత అమ్మక కార్యక్రమం ఫ్లిప్‌కార్ట్‌లోనూ, రియల్‌మీ డాట్ కామ్‌లో ఉంటుందని కంపెనీ వెల్లడించింది. మీడియాటెక్ జీ70 ప్రాసెసర్‌తో విడుదలైన తొలిఫోన్ ఇదే. బ్లేజింగ్ రెడ్, ఫ్రోజెన్ బ్లూ రంగుల్లో ఇది లభిస్తుంది.

**ఫోన్ ఫీచర్లు:** 6.52 అంగుళాల హెచ్‌డీ ప్లస్ మినీ డ్రాప్ ఫుల్‌స్క్రీన్ డిస్‌ప్లే, మీడియాటెక్ హీలియో జీ70 ప్రాసెసర్, 5,000 ఎంఏహెచ్ బ్యాటరీతోపాటు డే లైట్, లో లైట్ పరిస్థితుల్లోనూ ఫొటోలు తీసుకునే విధంగా కెమెరా సెన్సర్లు ఇందులో ఉన్నాయి. వెనుక భాగంలో 12ఎంపీ, 12ఎంపీతో డ్యుయల్ కెమెరా సెటప్‌ను ఏర్పాటు చేశారు. ముందు భాగంలో 5ఎంపీ కెమెరా ఉంది. అలాగే, రియల్‌మీ యూఐతో విడుదల చేసిన మొదటి ఫోన్ ఇది. మొదటి సేల్‌లో ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోలు చేసే వారికి, ఎక్స్ఛేంజ్‌పై రూ.1,000 తగ్గింపు ఆఫర్ ఉంది.

# విదేశీ సైట్లలో కొంటే బాదుడే..!

- ప్రీపెయిడ్ కస్టమ్స్ డ్యూటీ, ట్యాక్స్ విధింపు ప్రతిపాదన
- సుంకాల ఎగవేతను అరికట్టేందుకే ● దాదాపు 50% పెరగనున్న భారం




**న్యూఢిల్లీ:** విదేశీ ఈ–కామర్స్ సైట్లలో జరిపే కొనుగోళ్లు ఇకపై భారం కానున్నాయి. ఈ షాపింగ్ పోర్టల్స్‌లో లావాదేవీల్లో సుంకాలు, పన్నుల ఎగవేత ఉదంతాలు చోటు చేసుకుంటుండటంపై కేంద్రం మరింతగా దృష్టి సారించడమే ఇందుకు కారణం. సీమాంతర లావాదేవీలపై ప్రీ–పెయిడ్ విధానంలో కస్టమ్స్ సుంకాలు, పన్నులను వడ్డించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ విధానం అమల్లోకి వచ్చిన పక్షంలో విదేశీ ఆన్‌లైన్ షాపింగ్ సైట్ల ద్వారా జరిపే కొనుగోళ్లు దాదాపు 50% మేర భారం కాగలవని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

**ప్రస్తుతం ఏం జరుగుతోందంటే...**

భారతీయులకు విదేశాల నుంచి వచ్చే గిఫ్టుల విలువ రూ. 5,000 దాకా ఉన్న పక్షంలో పన్నుల భారం ఉండదు. దీన్ని ఆసరాగా చేసుకుని పలు చైనీస్ ఈ–కామర్స్ వెబ్‌సైట్లు .. ఇక్కడివారు కొనుగోలు చేసిన ఉత్పత్తులను బహుమతుల పేరిట ఎగుమతి చేస్తున్నాయి. తద్వారా సుంకాలు, పన్నుల ఎగవేత జరుగుతోంది. పలు ఉత్పత్తులపై భారీగా ఉండే సుంకాల భారం తగ్గడం వల్ల దేశీ ఈ–కామర్స్ పోర్టల్స్‌తో పోలిస్తే విదేశీ షాపింగ్ పోర్టల్స్‌లో కొనే ఉత్పత్తులు దాదాపు 40 శాతం చౌకగా లభిస్తున్నాయి. ఇలా విదేశీ ఈ–కామర్స్ సంస్థలు వ్యాపార లావాదేవీల కోసం గిఫ్ట్ విధానాన్ని దుర్వినియోగం చేస్తుండటం వల్ల దేశీ ఈ–కామర్స్ సంస్థలకు నష్టం జరుగుతోందని సోషల్ మీడియా ప్లాట్‌ఫాం లోకల్‌సర్కిల్స్ చైర్మన్ సచిన్ తపారియా తెలిపారు.

కస్టమ్స్ సుంకాలు, వస్తు–సేవల పన్ను (జీఎస్టీ) ఎగవేత జరుగుతున్న ఇలాంటి లావాదేవీలను గతేడాది.. కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ మరింత లోతుగా పరిశీలించింది. గిఫ్టుల రూపంలో వచ్చే దిగుమతులపై ముంబై కస్టమ్స్ విభాగం నిషేధం విధించింది. దీంతో ఈ తరహా కొనుగోళ్లు సుమారు 60 శాతం దాకా పడిపోయాయి. కీలకమైన ఔషధాలు, రాఖీలు మినహా గిఫ్ట్ మార్గంలో విదేశీ ఈ–కామర్స్ సైట్ల నుంచి వచ్చే ప్యాకేజీలన్నింటి పైనా నిషేధం విధిస్తూ విదేశీ వాణిజ్య విధానంలో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది.

### కొత్త విధానం ఇలా..

తాజాగా విదేశీ షాపింగ్ పోర్టల్స్ ద్వారా జరిగే కొనుగోళ్లపై సుంకాలు, పన్నులు విధించే అంశంపై కేంద్రం .. లోకల్‌సర్కిల్స్ వంటి సంబంధిత వర్గాల అభిప్రాయాలు సేకరిస్తోంది. ఈ విధానం ప్రకారం కస్టమ్స్ విభాగం సొంత పేమెంట్ ఇంటర్‌ఫేస్‌ను వినియోగంలోకి తెస్తుంది. చైనా తదితర విదేశీ ఈ–కామర్స్ సంస్థలు.. భారత కస్టమర్ల నుంచి సుంకాలు, పన్నులు వసూలు చేసి ఈ ఐటీ సిస్టమ్ ద్వారా భారత ప్రభుత్వానికి చెల్లిస్తాయి. లావాదేవీ వివరాలు సమర్పించి, ప్రీపెయిడ్ సుంకాలను చెల్లించిన తర్వాత.. ఆయా ఈ–కామర్స్ సంస్థలకు రసీదు, లావాదేవీ రిఫరెన్స్ నంబరు లభిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఉత్పత్తుల డెలివరీకి వీలవుతుంది. ప్రత్యామ్నాయంగా సదరు విదేశీ ఈ–కామర్స్ సంస్థకు భారత్‌లో ఉన్న భాగస్వామ్య సంస్థ అయినా సంబంధిత పన్నులు చెల్లిస్తే లావాదేవీకి ఆమోదముద్ర లభిస్తుంది. ఇలాంటి ప్రీ–పెయిడ్ మోడల్‌తో కస్టమర్లు, విదేశీ సరఫరాదారుల మధ్య లావాదేవీలపై పారదర్శకత పెరుగుతుందని లోకల్ సర్కిల్స్ చైర్మన్ సచిన్ తపారియా తెలిపారు.

## ఐఎల్‌ఎఫ్‌ఎస్ క్లెయిమ్‌లకు కేంద్రం ఆమోదం

**న్యూఢిల్లీ:** అసంపూర్ణంగా మిగిలిపోయిన రహదారి ప్రాజెక్టులకు సంబంధించి ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్ అండ్ ఎఫ్‌ఎస్‌కు కాస్త ఊరట దక్కింది. దాదాపు రూ. 2,700 కోట్ల క్లెయిమ్‌లకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతి లభించింది. ఫాగ్నె సోన్‌గఢ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుపై రూ. 707 కోట్లు, ఖేడ్ సిన్నార్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు విషయంలో రూ. 902 కోట్లు, కిరాత్‌పూర్ నెర్ చౌక్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు సంబంధించి రూ. 672 కోట్లు, జోర్బాత్ షిల్లాంగ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టులో రూ. 252 కోట్లు, ఐటీఎన్ఎల్ రోడ్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కంపెనీ (ఐఆర్ఐడీసీఎల్) రూ. 144 కోట్ల క్లెయిములకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసినట్లు అధికారులు తెలిపారు. రుణ సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌ను 2018 అక్టోబర్‌లో కేంద్రం తన ఆధీనంలోకి తీసుకుని .. ప్రముఖ బ్యాంకరు ఉదయ్ కోటక్‌ను చైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

**సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...**

- షార్ట్‌టర్మ్‌కు స్ట్రాంగ్ సిఫార్సులు
- ఎయిర్‌టెల్.. లాభాల ట్యూన్ వెనుక!
- నిఫ్టీలో షార్ట్ స్ట్రాడిల్ వ్యూహం!
- కరోనా ఎఫెక్ట్- ఫార్మా ఎగుమతులకు చెక్?

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

WWW.BUSINESS.SAKSHI.COM

# ప్రభుత్వ బ్యాంకులపై తగ్గుతున్న 'మొండి' భారం

**లోక్ సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి**

- 2018 మార్చిలో రూ.8.96 లక్షల కోట్లు
- 2019 సెప్టెంబర్‌లో రూ.7.27 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకులపై మొండిబకాయిల (ఎన్‌పీఏ) భారం తగ్గుతోందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ఇచ్చిన ఒక లిఖిత పూర్వక సమాధానంలో పేర్కొన్నారు. 2018 మార్చిలో రూ.8.96 లక్షల కోట్లు ఉన్న ఈ మొండిబకాయిల భారం 2019 సెప్టెంబర్ నాటికి రూ.7.27 లక్షల కోట్లకు తగ్గిందని తెలిపారు. దేశంలో బ్యాంకింగ్ రంగ మెరుగుదలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇందుకు కారణమని అన్నారు. బ్యాంకింగ్‌లో పాలనా వ్యవస్థ మెరుగుదల, పర్యవేక్షణ, రికవరీ, సాంకేతికత వినియోగం వంటి అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆమె ప్రకటనలోని కొన్ని ముఖ్యాంశాలను చూస్తే...

- సెప్టెంబర్ 2019తో ముగిసిన ఏడాదిన్నర కాలంలో దాదాపు రూ.2.03 లక్షల కోట్ల రికార్డు స్థాయిలో రికవరీ జరిగింది.
- ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో మొత్తం 18 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 12 లాభాలను నమోదు చేసుకున్నాయి.
- ఏడున్నర సంవత్సరాల్లో అత్యధిక ప్రొవిజన్ కవరేజ్ రేషియో (మొండిబకాయిలకు కేటాయింపుల నిష్పత్తి) కేటాయింపులు జరిగాయి.
- బ్యాంకింగ్ వ్యవస్థ కుదుటపడుతోందని డిసెంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రచురించిన బ్యాంకింగ్ ట్రెండ్ రిపోర్ట్ పేర్కొంది. అలాగే 2019 మార్చిలో 14.3 శాతం ఉన్న వాణిజ్య బ్యాంకుల క్యాపిటల్ అడిక్వసీ రేషియో 2019 సెప్టెంబర్ నాటికి 15.1 శాతానికి పెరిగింది.
- రియల్టీ, ఎన్‌బీఎఫ్‌సీలుసహా వివిధ విభాగాల్లో మొండిబకాయిల సమస్య సత్వర పరిష్కారానికి దివాలా పరిష్కార ప్రక్రియసహా తగిన అన్ని చర్యలనూ కేంద్రం తీసుకుంటోంది.
- రుణ చెల్లింపుల్లో వైఫల్యం, మోసాలు, ద్రవ్య లభ్యత వంటి సవాళ్లతో తాజా రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు కొంత సంశయించిన విషయం వాస్తవం. అయితే ఈ సవాళ్ల పరిష్కారం దిశలో తగిన చర్యలు తీసుకోవడం జరిగింది.

### పారిశ్రామిక ప్రతినిధులతో భేటీ

**ప్రత్యక్ష పన్ను వివాదాలపై సమీక్ష**

ఆర్థికమంత్రి సోమవారం పారిశ్రామిక ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రతిపాదిత ప్రత్యక్ష పన్ను వివాద పరిష్కార పథకంపై వారితో చర్చించారు. పన్ను బకాయిల చెల్లింపు, ఇందుకు సంబంధించి వడ్డీ, జరిమానాల నుంచి మినహాయింపు వంటి అంశాలు ఈ పథకంలో ప్రత్యేకతలు. దాదాపు రూ. 9 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నులు ప్రస్తుతం వివాదాల్లో ఉన్నాయి. ఆయా వివాదాల పరిష్కార లక్ష్యంగా లోక్‌సభలో ప్రభుత్వం గత వారం ''డైరెక్ట్ ట్యాక్స్ వివాద్ సే విశ్వాస్ బిల్లు, 2020''ని ప్రవేశపెట్టింది. బిల్లు ఆమోదం పొందిన తర్వాత నోటిఫై అవుతుంది. తాజా సమావేశంలో ఈ బిల్లుపై పారిశ్రామిక వర్గాలు తమ సూచనలు, సలహాలు ఇచ్చినట్లు ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి.

# ఓఎన్‌జీసీ, ఐఓసీ, ఎన్‌టీపీసీ హ్యాపీ




- 2018–19లో అత్యంత లాభదాయక కంపెనీలు ఇవి...
- పార్లమెంటుకు సర్వే నివేదిక...

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి 2018–19లో లాభాల బాటన నిలిచిన కంపెనీల్లో తొలి మూడు స్థానాల్లో ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీలు ఉన్నాయి. ఇక బీఎస్ఎన్ఎల్, ఎయిర్ ఇండియా, ఎంటీఎన్ఎల్‌లు భారీ నష్టాలను మూటగట్టుకున్న ప్రభుత్వ రంగ కంపెనీలుగా మిగిలాయి. వరుసగా మూడేళ్ల నుంచీ ఈ కంపెనీలది ఇదే పరిస్థితి. 2018–19కి సంబంధించి ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి పార్లమెంటులో ప్రవేశపెట్టిన సర్వే ఒకటి ఈ అంశాలను తెలియజేసింది. నష్టాలను చవిచూసిన 70 ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్ఈ) 94.04 శాతం వాటా కేవలం 10 సంస్థలవే కావడం గమనార్హం. మొత్తం సీపీఎస్ఈల ఆదాయం 2018–19లో రూ.24,40,748 కోట్లయితే, 2017–18లో ఈ మొత్తం రూ.20,32,001 కోట్లు కావడం గమనార్హం. అంటే వృద్ధి 20.12 శాతం. ఇక ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలు, జీఎస్టీ, కార్పొరేట్ పన్ను, డివిడెండ్లు, ఇతర సుంకాలు, పన్నుల రూపంలో సీపీఎస్ఈల నుంచి కేంద్ర ఖజానాకు 2017–18లో రూ.3,52,361 కోట్లు లభిస్తే, 2018–19లో ఈ మొత్తం రూ. 3,68,803 కోట్లకు పెరిగింది. అంటే వృద్ధి 4.67 శాతంగా నమోదయ్యింది. సర్వే ప్రకారం, 2019 మార్చి నాటికి 348 సీపీఎస్ఈల్లో 249 పనిచేస్తున్నాయి. 86 నిర్మాణంలో ఉన్నాయి. 13 దివాలా ప్రక్రియను ఎదుర్కొంటున్నాయి.

# ఇసుజు కార్ల ప్లాంట్ విస్తరణ

- పరిశ్రమలో అదనపు ఉత్పత్తులు ప్రారంభం
- రూ. 400కోట్లతో ప్రెస్‌షాప్, ఇంజన్ అసెంబ్లింగ్ యూనిట్లు ఏర్పాటు




ఇసుజు అదనపు ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

**వరదయ్యపాళెం(చిత్తూరు జిల్లా):** శ్రీసిటీలోని జపనీస్ యుటిలిటీ వాహన తయారీదారు ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమలో అదనపు ఉత్పత్తుల యూనిట్‌ను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. కంపెనీ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జపాన్ కాన్సుల్ జనరల్ కొజిరో యఖియామా, ఇసుజు మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టోరూ నకాటా, మిట్సుబిషి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, సీఈఓ ఇవారో టోయిడి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని రూ. 400కోట్ల పెట్టుబడులతో అదనపు ఉత్పత్తి కేంద్రంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌షాప్ సదుపాయం, ఇంజన్ అసెంబ్లింగ్ యూనిట్లను ప్రారంభించారు. ఈ రెండవ దశ కార్యకలాపాల ప్రారంభం భారత్‌లోని ఇసుజు ప్రయాణంలో అతి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని జపాన్ కాన్సుల్ జనరల్ తెలిపారు. అంతర్జాతీయ తయారీ కేంద్రాలలో ఒకటిగా ఈ ప్లాంటును తీర్చిదిద్దడానికి ఇసుజు చేస్తున్న ప్రయత్నాలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. అనివార్య పరిస్థితుల్లో ఈ కార్యక్రమానికి హాజరు కాలేక పోయిన రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి పంపిన అభినందన సందేశాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చదివి వినిపించారు. మంత్రి తన సందేశంలో ఇసుజుకు అన్నివిధాలా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు, భరోసా ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఆటో మొబైల్ తయారీకి ఇసుజు ఒక ప్రామాణికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి కార్ల పరిశ్రమ ఇసుజు అంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. టోరూ నకాటా మాట్లాడుతూ.. పోటీ మార్కెట్‌లో అత్యుత్తమ శ్రేణి ఉత్పత్తులు, సేవలను అందించడానికి ఇసుజు ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తమ ఉత్పత్తుల నాణ్యత, విశ్వసనీయతకు భరోసా అందిస్తామన్నారు. రెండవ దశ కార్యకలాపాలు తమ వృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ సామర్థ్యాన్ని విస్తరించనుందని పేర్కొన్నారు.

# వాహన అమ్మకాలు.. బే'కార్'!

- జనవరిలో 6 శాతం తగ్గిన విక్రయాలు
- కొనుగోలు భారం పెరగడం, మందగమనం కారణం
- సియామ్ నివేదికలో వెల్లడి




**గ్రేటర్ నోయిడా:** దేశీయంగా వాహన విక్రయాల్లో మందగమనం కొనసాగుతోంది. కొత్త ఏడాదిలోనూ అమ్మకాలు పుంజుకోలేదు. జనవరిలో దేశీయంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు 6.2 శాతం క్షీణించాయి. వాహనాల కొనుగోలు భారం పెరగడం, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి మందగించడం తదితర అంశాలు ఇందుకు కారణంగా నిల్చాయి. ఆటోమొబైల్ సంస్థల సమాఖ్య సియామ్ సోమవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తున్న కొత్త బీఎస్6 ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా ఉండే వాహనాల రేట్లు అధిక స్థాయిలో ఉండటం, ముడివస్తువుల ధరల పెరగడంతో జనవరిలో కొన్ని ఆటోమొబైల్ కంపెనీలు వాహనాల రేట్లను పెంచడం కూడా అమ్మకాలపై ప్రతికూల ప్రభావాలు చూపాయి. 'జీడీపీ వృద్ధి మందగమనం, వాహన కొనుగోలు వ్యయాలు పెరగడం వంటి అంశాల ప్రతికూల ప్రభావాలు వాహన విక్రయాలపై కొనసాగుతున్నాయి' అని అని సియామ్ ప్రెసిడెంట్ రాజన్ వధేరా తెలిపారు. 'ఇన్‌ఫ్రా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ప్రభుత్వం ఇటీవలచేసిన ప్రకటనలతో వాహనాల అమ్మకాలు మళ్లీ పుంజుకోగలవని ఆశిస్తున్నాం. ముఖ్యంగా వాణిజ్య వాహనాలు, ద్విచక్ర వాహనాల సెగ్మెంట్ మెరుగుపడగలదని భావిస్తున్నాం' అని ఆయన చెప్పారు.

**త్రిచక్ర వాహనాలు కాస్త ఊరట..**

జనవరి గణాంకాలను ప్రస్తావిస్తూ.. త్రిచక్ర వాహనాలు మినహా అన్ని విభాగాల్లోనూ అమ్మకాలు పడిపోయాయని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేష్ మీనన్ చెప్పారు. పరిశ్రమ ఇంకా నెగటివ్‌లోనే ఉన్నప్పటికీ.. పండుగల సీజన్ తర్వాత విక్రయాల క్షీణత తీవ్రత కాస్త తగ్గిందని ఆయన తెలిపారు. 'ప్రస్తుతం కొనసాగుతున్న ఆటో ఎక్స్‌పోలో సందర్శకుల స్పందనను బట్టి చూస్తే.. వినియోగదారుల సెంటిమెంటు మరింత మెరుగుపడగలదని ఆశిస్తున్నాం. ఇందులో ఇప్పటిదాకా దాదాపు 70 వాహనాలను ఆవిష్కరించారు' అని ఆయన చెప్పారు.

**విక్రయాల తీరిదీ..**

- గతేడాది జనవరిలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 2,80,091 యూనిట్లు. ఈ ఏడాది జనవరిలో 2,62,714 యూనిట్లకు తగ్గాయి.
- కార్ల అమ్మకాలు 8.1% క్షీణించి 1,79,324 యూనిట్ల నుంచి 1,64,793కి పరిమితమయ్యాయి.
- ద్విచక్ర వాహనాల అమ్మకాలు 16 శాతం పడిపోయాయి. 15,97,528 యూనిట్ల నుంచి 13,41,005 యూనిట్లకు తగ్గాయి. మోటార్ సైకిళ్ల అమ్మకాలు 15 శాతం తగ్గి 10,27,766 నుంచి 8,71,886కి క్షీణించాయి. స్కూటర్లు 16 శాతం క్షీణించి 4,97,169 యూనిట్ల నుంచి 4,16,594కి పరిమితమయ్యాయి.
- వాణిజ్య వాహనాల అమ్మకాలు 14 శాతం పడిపోయాయి. 87,591 యూనిట్ల నుంచి 75,289 యూనిట్లకు తగ్గాయి.
- వివిధ కేటగిరీల్లో అన్ని వాహనాల విక్రయాలు 13.83 శాతం తగ్గి.. 20,19,253 యూనిట్ల నుంచి 17,39,975 యూనిట్లకు క్షీణించాయి.
- కంపెనీలవారీగా చూస్తే కార్ల విభాగంలో మార్కెట్ లీడర్ మారుతీ సుజుకీ ఇండియా అమ్మకాలు మాత్రం 0.29% పెరిగి 1,39,844 యూనిట్లుగా నమోదయ్యాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా విక్రయాలు 8% క్షీణించి 42,002 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- ద్విచక్ర వాహనాల విభాగంలో హీరో మోటోకార్ప్ విక్రయాలు 14 శాతం పడిపోయాయి.

epaper.sakshi.com



సోమవారం ఢిల్లీలోని జామియా నగర్‌లో సీఏఏ, ఎన్నార్సీ వ్యతిరేక నిరసనలో పాల్గొన్న ఓ మహిళను బ్యారికేడ్ నుంచి పక్కకు నెట్టేస్తున్న మహిళా పోలీసులు

# కొట్టరాని చోటా కొట్టారు

**పోలీసులు దాడిచేశారన్న జామియా వర్సిటీ విద్యార్థులు**

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరసనల్లో హింస చోటుచేసుకుంది. పార్లమెంటు వద్దకు ర్యాలీగా వెళుతూ నిరసనలు తెలిపేందుకు విద్యార్థులకు పోలీసులు అనుమతి ఇవ్వకపోయినప్పటికీ.. విద్యార్థులు ర్యాలీగా బయలుదేరారు. అయితే పోలీసులు వారిని బారికేడ్లతో అడ్డుకున్నారు. మరిన్ని బలగాలను రప్పించి విద్యార్థులను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు తమపై లాఠీచార్జ్ చేశారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టు కింది భాగంలో లాఠీలతో కొట్టారని, కాళ్లకేసి కొట్టారని చెప్పారు. అంతేగాక బారికేడ్ల వద్ద ముందు వరుసలో ఉన్న వారి మర్మావయవాలపై పోలీసులు దాడి చేశారని, ఇందులో ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయని విద్యార్థులు ఆరోపించారు. కొంత మందిని గొంతుపట్టుకొని ఊపిరి ఆడకుండా చేశారని చెప్పారు. దీంతో పలువురు నిరసనల అనంతరం 20 మంది విద్యార్థులు ఆస్పత్రిలో చేరారు. అందులో ఎనిమిది మందికి వైద్యులు చికిత్స చేసి ఇంటికి పంపారని, ఈ 8 మందిలో 5 మంది అమ్మాయిలే ఉన్నారని విద్యార్థులు చెప్పారు.

# ఢిల్లీ ఓట్ల లెక్కింపు నేడే

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. నేడు జరిగే కౌంటింగ్ కోసం ఢిల్లీలోని ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కే మళ్లీ అధికారం అన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు..ఎన్నికల సంఘం తుది పోలింగ్ శాతాన్ని ఆలస్యంగా వెల్లడించిన నేపథ్యంలో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అసలైన పోటీ ఆప్, బీజేపీ మధ్యే ప్రధానంగా ఉండనుందని, ఈసారి కూడా కాంగ్రెస్ ఖాతా తెరిచే అవకాశాలు లేవని భావిస్తున్నారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో 67.47 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి ఐదు శాతం తక్కువగా 62.59 శాతం మాత్రమే నమోదైందని ఆదివారం సాయంత్రం ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపులో 70 నియోజకవర్గాల్లో బరిలో నిలిచిన 79 మంది మహిళలు సహా మొత్తం 672 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఢిల్లీలోని సీడబ్ల్యూజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్ సీవీ రామన్ ఐటీఐ, రాజీవ్ గాంధీ స్టేడియం, మీరాబాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తదితర 21 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు, 33 మంది పరిశీలకులను నియమించారు. 13, 780 పోలింగ్‌బూత్‌లలో పోలైన ప్రతి ఓటును ప్రిసైడింగ్ అధికారులు పరిశీలిస్తారని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ సందీప్ సక్సేనా తెలిపారు. అభివృద్ధినే ఎజెండాగా తీసుకుని ఎన్నికల బరిలో దిగిన ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ఈసారి కూడా తమదే అధికారమనే ధీమాతో ఉంది. జాతీయతావాదం, సీఏఏ వ్యతిరేక ఆందోళనలపై తీవ్రంగా ప్రచారం చేసిన బీజేపీ కూడా ఢిల్లీ సీఎం పీఠం తమకే దక్కుతుందని అంచనా వేస్తోంది.


## క్లుప్తంగా...

### ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు..

**ఒక మావోయిస్టు, ఇద్దరు జవాన్ల మృతి**

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు – పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఒక మావోయిస్టుతో పాటు ఇద్దరు జవాన్లు మృతి చెందగా, మరో జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కోబ్రా బలగాలు కూంబింగ్ చేస్తున్నాయి. కూంబింగ్ ముగించుకొని తిరిగి వస్తున్న బలగాలపై సోమవారం ఉదయం మావోలు కాల్పులు జరపగా ఇద్దరు జవానులు చనిపోయారు. జవాన్లు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్ట్ హతమయ్యాడు.

### ఆ మహిళా లెక్చరర్ మృతి



**సాక్షి, ముంబై:** మహారాష్ట్రలోని వర్ధా జిల్లా హింగణ్‌ఘాట్ తాలూకాలో పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడిన అంకిత పిసుడే వారం రోజులు మృత్యువుతో పోరాడుతూ సోమవారం తుది శ్వాస విడిచారు. ఈ నెల 3న కాలేజీలో విధులకు బయలుదేరిన అంకితపై వికేశ్ నగ్రాలే అనే యువకుడు పెట్రోల్ పోసి నిప్పటించిన విషయం తెలిసిందే. త్వరగా నిందితునికి కఠిన శిక్ష విధిస్తామని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. బాధితురాలి కుటుంబానికి రూ. 10 లక్షల సాయంతోపాటు, కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

### లోక్‌సభలో ప్లకార్డుల ప్రదర్శన అవసరమా?

**న్యూఢిల్లీ:** లోక్‌సభ జరుగుతోన్న సమయంలో సభ్యులు ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శిస్తుండటంపై స్పీకర్ ఓంబిర్లా అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ జరుగుతున్న సమయంలో ప్లకార్డుల ప్రదర్శనను అనుమతించాలా? వద్దా? అనే అంశంపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. టీఎంసీ సభ్యుడు సౌగతా రాయ్ ఆయుర్వేద బిల్లు–2020పై సోమవారం సభలో చర్చిస్తున్న సమయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ సభ్యులు 'పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని రక్షించండి'అంటూ పోస్టర్లు ప్రదర్శించారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన రాయ్.. సభలో ఇలాంటివి అనుమతించకుండా చూడాలని స్పీకర్‌ను కోరారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. సభలోకి పోస్టర్లను అనుమతించాలా, వద్దా అనే అంశంపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాన్ని పరిశీలించాల్సిందిగా లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరిని కోరారు. స్పీకర్ నిర్ణయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్వాగతించారు.

# 'ఎస్సీ, ఎస్టీ చట్టం' రాజ్యాంగబద్ధమే




- సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- ఎస్సీ, ఎస్టీలపై వివక్ష కొనసాగుతోందని ఆందోళన
- కేసు నమోదుకు ప్రాథమిక విచారణ అక్కర్లేదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం –2018 చట్టబద్ధతను సుప్రీంకోర్టు సమర్థించింది. ప్రాథమిక విచారణలో ఆరోపణలు నిరూపించలేకపోతే సదరు వ్యక్తికి బెయిల్ మంజూరు చేయవచ్చని కోర్టు పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే ప్రాథమిక విచారణ అవసరం లేదని జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. పౌరులంతా సమానమనీ, సోదరభావాన్ని పెంపొందించుకోవాలనీ, ముందస్తు బెయిల్ అవకాశాన్ని దుర్వినియోగం చేయడం పార్లమెంట్ ఉద్దేశాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం అవుతోందంటూ ఈ చట్టంలోని సెక్షన్ 18ఏ కింద పార్లమెంట్ 2018లో సవరణలు చేసింది. అంతకుముందు డాక్టర్ సుభాష్ కాశీనాథ్ మహాజన్ వర్సెస్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసేందుకు ప్రభుత్వం ఈ సవరణలు చేపట్టింది. ఈ చట్టం దుర్వినియోగం అవుతోందని, తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కోర్టు కొన్ని నిబంధనలను విధించింది. వీటిలో ప్రధానమైవి.. 'నిందితుడికి ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి ఎటువంటి అడ్డంకులు లేకుండటం. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే ప్రాథమిక విచారణ చేపట్టడం, అరెస్టు చేయడానికి అనుమతి పొందాల్సి రావడం'. ప్రభుత్వోద్యోగుల విషయంలో అయితే నియామక అధికారి ఆమోదం, ప్రభుత్వేతర ఉద్యోగైతే సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ ఆమోదం పొందాకే అరెస్టు చేయాలని అప్పట్లో సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ తీర్పు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పూర్తిగా నిష్ప్రయోజకంగా మార్చిందంటూ దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. ఈ నేపథ్యంలో తీర్పును సమీక్షించాలంటూ కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వపు హక్కులకు భంగకరమంటూ చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ ఇంకొందరు కోర్టుకెళ్లారు. ఎస్సీ, ఎస్టీల పట్ల దేశంలో కొనసాగుతోన్న వివక్ష కారణంగా చట్టం రూపకల్పనకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ఈ చట్టం కింద క్రిమినల్ కేసు నమోదు చేయడానికి ప్రాథమిక విచారణ అక్కర్లేదని స్పష్టంచేసింది.

# నింగిలోకి సోలార్ ఆర్బిటర్

**తొలిసారిగా సూర్యుడి ధృవాల ఫొటోలను తీయనున్న అంతరిక్ష నౌక**



**వాషింగ్టన్:** అంతరిక్ష చరిత్రలోనే తొలిసారిగా సూర్యుడి ధృవాల చిత్రాలను మనకు పంపేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, యురోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ)లు సంయుక్తంగా తయారు చేసిన సోలార్ ఆర్బిటర్ అంతరిక్ష నౌక సోమవారం నింగిలోకి దూసుకెళ్లింది. దాదాపు రూ.10 వేల కోట్ల ఖర్చుతో రూపొందించిన ఈ అంతరిక్ష నౌకను అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న కేప్ కెనవరల్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి అలియన్స్ అట్లాస్–వీ రాకెట్ సాయంతో నింగిలోకి పంపినట్లు నాసా తెలిపింది. ఈ ప్రయోగం విజయవంతమైన సంకేతాలు జర్మనీలోని యురోపియన్ స్పేస్ సెంటర్‌కు అంతరిక్ష నౌక నుంచి వచ్చినట్లు నాసా తెలిపింది. ప్రయోగించిన రెండు రోజుల తర్వాత ఈ సోలార్ ఆర్బిటార్ భూమి మీదకు సమాచారాన్ని చేరవేసేందుకు ఉపయోగపడే పరికరాలైన 'బూమ్', పలు ఆంటెన్నాలను అంతరిక్షంలో విచ్చుకుంటాయి. సూర్యుడి ఫొటోలను తీసేందుకు ఈ ఆర్బిటార్ బుధగ్రహం కక్ష్యలో తిరగనుంది. బుధగ్రహం చుట్టూ తిరుగుతూ ఇప్పటివరకు మానవుడు కనిపెట్టని సూర్యుడి ధృవాల చిత్రాలను తీయనుంది.

# కోటాపై వాగ్యుద్ధం

- సుప్రీంకోర్టు ఆదేశాలపై వేడెక్కిన లోక్‌సభ
- తాము కక్షిదారుకాదన్న ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు ఇవ్వాలా వద్దా అనేది ప్రభుత్వాలే నిర్ణయిస్తాయంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు వెలువరించిన కేసులో తాము కక్షిదారు కాదని కేంద్రం స్పష్టం చేసింది. రిజర్వేషన్ విధానాన్ని పరిరక్షించడంలో కేంద్రం విఫలమైందంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్న నేపథ్యంలో లోక్‌సభలో ప్రభుత్వం ఈ మేరకు ప్రకటన చేసింది. సామాజిక న్యాయం, సాధికారిత శాఖ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ సోమవారం సభలో.. 'ఎస్సీ, ఎస్టీలోపాటు ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉంది. ఈ విషయంలో అఫిడవిట్ వేయాలని సుప్రీం కోరలేదు. ఈ అంశాన్ని ప్రభుత్వం ఉన్నతస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటుంది. 2012లో ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి'అని ఆరోపించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు సిగ్గు, సిగ్గు అని నినాదాలు చేసుకుంటూ సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు, ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ ఈ విషయాన్ని లేవనెత్తారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై తీవ్ర వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం రిజర్వేషన్లకు వ్యతిరేకమని చెప్పేందుకు ఎన్నో ఆధారాలున్నాయని డీఎంకే సభ్యుడు ఎ.రాజా, బీఎస్పీ నేత రితేశ్ పాండే వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని సీపీఎం నేత ఏఎం అరీఫ్ ప్రభుత్వాన్ని కోరారు. మరో వైపు రాజ్యసభలో... అసమర్థులైన వైద్యుల కారణంగానే దేశ ఆర్థిక వ్యవస్థ పతనావస్థలో ఉందని కాంగ్రెస్ నేత చిదంబరం అన్నారు. సోమవారం సభలో ఆయన వార్షిక బడ్జెట్‌పై చర్చను ప్రారంభిస్తూ.. పెరుగుతున్న నిరుద్యోగిత, పడిపోతున్న వినియోగం అనే రెండు సమస్యలను దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటుండగా ప్రభుత్వం మాత్రం ఖండించడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. 'అన్ని రకాల పన్ను వసూళ్లు మందగించాయి. ఆరేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ..ఇంకా గత పాలకులను ఎలా విమర్శిస్తుంది? అని అన్నారు.

# కరోనాతో కకావికలం..

- 908కి చేరిన మృతుల సంఖ్య
- 40,171 మందికి సోకిన ఇన్ఫెక్షన్

**బీజింగ్/టోక్యో/త్రిస్సూర్:** చైనాలో ప్రమాదకర కరోనా వైరస్ వ్యాప్తి జనసమూహంలో రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇప్పటివరకూ ఈ వ్యాధి కారణంగా మరణించిన వారి సంఖ్య 908కి చేరుకుంది. వైరస్ సోకినట్లు నిర్ధారణైన కేసుల సంఖ్య 40వేలు మించినట్లు చైనా ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం తెలిపారు. ఆదివారం ఒక్కరోజే చైనాలో 97 మంది కరోనా వైరస్ కారణంగా మరణించారు. 3062 కొత్త కేసులు నమోదయ్యాయని చైనా ఆరోగ్య కమిషన్ తెలిపింది. అయితే, చైనాలో గతంతో పోల్చితే రోజువారీ కొత్త కేసుల సంఖ్య తగ్గుతూ వస్తోందని ఓ నివేదిక వెల్లడించింది. చైనాలో వ్యాధి కట్టడి కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) పంపిన అంతర్జాతీయ వైద్య నిపుణుల బృందం సోమవారం బీజింగ్‌కు చేరుకుంది. టోక్యో సముద్రతీరంలో లంగరేసి ఉన్న డైమండ్ ప్రిన్స్ క్రూయిజ్ నౌకలో మరో 65 మందికి కరోనా వైరస్ సోకినట్లు సోమవారం వెల్లడైంది. దీంతో ఈ వ్యాధి బారిన పడిన నౌక ప్రయాణికుల సంఖ్య 130కి పెరిగింది. ఏఏ దేశాల వారికి వ్యాధి సోకిందో స్పష్టంగా తెలపలేదు. నౌకలోని భారతీయ సిబ్బంది, ప్రయాణికులకు సంబంధించిన అదనపు సమాచారం కోసం @IndianEmbTokyo, fscons. tokyo@mea.gov.in, @CPVIndia, @MEAIndia, @PMOIndia ట్విట్టర్ హ్యాండిళ్ల ద్వారా అధికారులను సంప్రదించవచ్చునని జపాన్‌లోని భారతీయ దౌత్యకార్యాలయం తెలిపింది. కరోనా వైరస్ బయటపడిన తర్వాత మొదటిసారి బయటకు వచ్చిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాస్కు ధరించి బీజింగ్ నగరాన్ని సందర్శించారు. కరోనాను జయించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. కరోనా వైరస్ నియంత్రణకు సాయం అందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఒక లేఖ రాయడంపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందించారు. కష్టకాలంలో అండగా నిలిచినందుకు, సాయం అందిస్తామని చెప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



బీజింగ్‌లో మాస్క్ ధరించిన జిన్‌పింగ్ ఉష్ణోగ్రతను చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

### ఆమెకు కరోనా లేదట!

**భారత్‌లో** మొదట కరోనా వైరస్ సోకిన వైద్య విద్యార్థిని దాని నుంచి కోలుకుంటున్నారు. తాజాగా ఆమెకు నిర్వహించిన కరోనా వైరస్ పరీక్షల్లో 'నెగిటివ్' అని వచ్చిందని వైద్యులు వెల్లడించారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. 'త్రిస్సూర్ నుంచి మొదటి కరోనా కేసు అయిన ఆమె రక్త నమూనాను జాతీయ వైరాలజీ సంస్థ (ఎన్ఐవీ)కు పంపగా కరోనా వైరస్ లేదని వెల్లడైంది. అయినప్పటికీ ఎన్ఐవీ నుంచి రిపోర్టు కోసం ఎదురుచూస్తున్నాం'అని సీనియర్ వైద్యాధికారి ఒకరు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3,252 మందికి పైగా వ్యక్తుల్ని పరిశీలనలో ఉంచినట్లు వైద్య విభాగం వెల్లడించింది.

### మతస్వేచ్ఛపై విస్తృత ధర్మాసనం చర్చ

**న్యూఢిల్లీ:** తనకున్న పరిమితులను దృష్టిలో ఉంచుకొని ఐదుగురు సభ్యుల ధర్మాసనం శబరిమల కేసులోనూ, మత స్వేచ్ఛకు సంబంధించిన చర్చనీయాంశాలను విస్తృత ధర్మాసనానికి సూచించవచ్చునని సుప్రీంకోర్టు వెల్లడించింది. అందులో భాగంగానే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బాబ్డే నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బెంచ్ రాజ్యాంగం ప్రకారం మత స్వేచ్ఛ, మత విశ్వాసాలపై విస్తృత ధర్మాసనం చర్చించనున్న ఏడు అంశాలపై ప్రశ్నలను రూపొందించింది. ఫిబ్రవరి 17 నుంచి ఈ అంశాలపై విస్తృత ధర్మాసనం విచారిస్తుందని సుప్రీంకోర్టు వెల్లడించింది.




# శిశువు ఆందోళనల్లో పాల్గొందా?

**షహీన్‌బాగ్ నిరసనల్లో చిన్నారి మృతిపై సుప్రీం వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** 'నాలుగు నెలల శిశువు తనంతట తానే ఆందోళనల్లో పాల్గొందా?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కు వ్యతిరేకంగా ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో కొనసాగుతున్న నిరసనల్లో చిన్నారి మృతి చెందడంపై కోర్టు పైవిధంగా స్పందించింది. షహీన్‌బాగ్ నిరసనల్లో 4 నెలల చిన్నారి చనిపోవడంపై జాతీయ సాహస అవార్డు గ్రహీత, ముంబైకి చెందిన జెన్ గుణ్‌రతన్ సదవర్తే(10) అనే బాలిక రాసిన లేఖను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. దీనిపై సీజేఐ జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌ల బెంచ్ సోమవారం విచారణ చేపట్టింది. 'నిరసనల్లో పాలుపంచుకున్న చిన్నారులను స్కూళ్లలో తోటి వారు ఉగ్రవాదులు, విప్లవకారులు, పాకిస్తానీ అనే పేర్లతో పిలుస్తున్నారు. దీంతో వారు ఏడ్చుకుంటూ ఇళ్లకు వస్తున్నారు'అంటూ షారూక్ ఆలం, నందితా రావ్ అనే మహిళా న్యాయవాదులు పేర్కొన్నారు. నిరసన తెలపడం చిన్నారుల హక్కు అని ఐక్యరాజ్యసమితి తీర్మానాల్లో కూడా ఉందని, దీనిని అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా స్వీకరించడం తగదని వారు వాదించారు. తీవ్రంగా స్పందించిన ధర్మాసనం.. 'ప్రమాదకరమైన ఆ సమర్థనను ఆపండి. అలాంటి వాదనలు చేయకండి. మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యేందుకు న్యాయస్థానాన్ని వేదికగా మార్చకండి'అని పేర్కొంది. 'నాలుగు నెలల చిన్నారి ఆందోళనల్లో పాల్గొనేందుకు సొంతంగా వెళతాడా?. మాతృత్వంపై మాకు అత్యున్నత గౌరవం ఉంది. చిన్నారుల క్షేమం గురించి ఆలోచిస్తాం. ఇలాంటి వాదనలతో అపరాధభావం మరింతగా పెంచకండి. నిరసనల్లో పాల్గొని చిన్నారులకు మరిన్ని ఇబ్బందులు కలిగించరాదని తల్లులు గ్రహించాలి'అని ధర్మాసనం పేర్కొంది. షహీన్‌బాగ్‌లో కొనసాగుతున్న సీఏఏ వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొన్న తల్లితోపాటుగా ఉన్న నాలుగు నెలల చిన్నారి జనవరి 30వ తేదీ రాత్రి నిద్రలోనే కన్నుమూసిన విషయం తెలిసిందే. మరో పరిణామం.. షహీన్‌బాగ్‌లోని ప్రభుత్వ రహదారిపై చేపట్టిన నిరసనల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ట్రాఫిక్ సజావుగా సాగేలా ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'నిరసనలు తెలిపే హక్కు ప్రజలకుంది. అయితే, కీలకమైన అలాంటి ప్రాంతంలో సుదీర్ఘకాలం ఆందోళనలు సాగించడం తగదు. ప్రభుత్వ రహదారులు, పార్కుల వద్ద కాకుండా ప్రత్యేకించిన ప్రాంతాల్లోనే వారు నిరసనలు చేపట్టాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించరాదు'అని పేర్కొంది. డిసెంబర్ 15వ తేదీ నుంచి కాళిందికుంజ్–షహీన్‌బాగ్ రహదారిపై కొనసాగుతున్న నిరసనలపై స్పందించాలని కేంద్రం, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు పోలీసులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com